thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 254 | కరీంనగర్ శుక్రవారం, 21 నవంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం

బెంగళూరు : జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజ కవర్గాలపు నర్విభజన చేస్తే, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం వాటిల్లుతుందని, లోక్‌సభలో వాటి ప్రాతి నిధ్యం తగ్గుతుందని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. డీలి మిటేషన్‌తో ఉత్తరాది రాష్ట్రాల్లో 30శాతం సీట్లు పెరిగే అవకాశం ఉందని నివేదికలు తెలియజేస్తున్నాయన్నారు. దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ముఖ్యులంతా సమైక్యంగా పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. సహకార సమాఖ్యవా దం గురించి మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వం.. ప్రజలకు అవసరమైన పనులకోసం గ్రాంట్లలో ఎందు కు కోత పెడుతోందని నిలదీశారు. కర్ణాటక లో సహకార బ్యాంకుల కు నాబార్డు నిధుల్లో 58శా తం కోత విధించిందని, తద్వారా లక్షలాది రైతులకు ఈ ఏడాది పంటరుణాలు అందలేదని చెప్పారు.

# రాజకీయ వర్గాల్లో ఇదే చర్చ!

## తెలంగాణలో మరో ఉప ఎన్నిక..!




### ఇప్పటి నుంచే బీఆర్ఎస్ అభ్యర్థిని సిద్ధం చేస్తోందా?

హైదరాబాద్ : తెలంగాణలో మరో ఉప ఎన్నిక కోసం బీఆర్ఎస్ ఇప్పట్నుంచే అభ్యర్థిని సిద్ధం చేస్తోందా? జూబ్లీహిల్స్‌లో తగిలిన దెబ్బ పునరావృతం అవకుండా ఇప్పటి నుంచి జాగ్రత్తపడుతోందా? ఒకవేళ ఉప ఎన్నిక జరిగితే....అభ్యర్థి ఎవరో ఆల్రెడీ డిసైడ్ చేసేసిందా? బైపోల్ గ్యారంటీ అనుకుంటున్న ఆ నియోజకవర్గం ఏది? ఇంత ముందుగానే పార్టీ అధిష్టానం దృష్టిలో పడ్డ ఆ నాయకుడు ఎవరు?. జూబ్లీహిల్స్ తర్వాత తెలంగాణలో ఉప ఎన్నిక జరగడానికి గట్టి అవకాశాలున్న వాటిలో ఖైరతాబాద్ ముందు వరుసలో ఉంది. 2023లో ఇక్కడి నుంచి బీఆర్ఎస్ తరపున గెలిచిన దానం నాగేందర్ తర్వాత కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అంతకు మించి ఆ పార్టీ తరఫున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారాయన. ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి రాజీనామా చేయకుండానే మరో పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడంతో ఫిరాయింపుల చట్టం ప్రకారం దానం నాగేందర్ మీద కచ్చితంగా అనర్హత వేటు పడుతుందన్న అంచనాలున్నాయి. అటు దానం కూడా వేటుకంటే ముందే రాజీనామా చేసి ఉప ఎన్నికను ఎదుర్కోవడానికి సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. దీంతో ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించిన వేరే నియోజకవర్గాల సంగతి ఎలా ఉన్నా... ఖైరతాబాద్‌లో మాత్రం కచ్చితంగా ఉప ఎన్నిక జరుగుతుందని అంటున్నారు. ఈ క్రమంలోనే%ూ% జూబ్లీహిల్స్‌లో దారుణంగా దెబ్బతిని సిట్టింగ్ సీటు కోల్పోయిన బీఆర్ఎస్%ూ% ఖైరతాబాద్ మీద ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. అందుకోసం ఉమ్మడి ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి గతంలో ఎమ్మెల్యేగా గెలిచిన విష్ణువర్ధన్ రెడ్డి వైపు గులాబీ అధిష్టానం మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. ఖైరతాబాద్ కాంగ్రెస్‌లో ప్రస్తుతం దానం నాగేందర్ స్ట్రాంగ్ లీడర్‌గా ఉన్నారు. ఉప ఎన్నిక జరిగినా... పార్టీ ఆయనకే టిక్కెట్ ఇస్తుందనడంలో డౌట్ లేదు. అందుకే ఆయన్ని దీటుగా ఎదుర్కొనే నేతకు టికెట్ ఇవ్వాలని భావిస్తోందట బీఆర్ఎస్. ఆ క్రమంలోనే పీజేఆర్ కొడుకు, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి పేరు ఫైనల్ కావచ్చని అంటున్నారు. గతంలో పీజేఆర్ ఉమ్మడి ఖైరతాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నారు. ఇక్కడ ఇప్పటికీ ఆయన అభిమానులున్నారు. పీజేఆర్ చనిపోయాక అదే ఉమ్మడి ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు విష్ణువర్ధన్ రెడ్డి. మొన్నటి 2023 ఎన్నికలకు ముందు వరకు కాంగ్రెస్‌లో ఉన్నా చివరి నిమిషంలో బీఆర్ఎస్ గూటికి చేరారు విష్ణు. అంతకు ముందు 2009 నుంచి 2014 వరకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా ఉన్నారు విష్ణువర్ధన్ రెడ్డి. దీంతో మొన్నటి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఆయన కూడా టిక్కెట్ ఆశించి భంగపడ్డారు. ఇప్పుడు అన్నిటినీ బేరీజు వేసుకుని ఖైరతాబాద్ ఉప ఎన్నిక జరిగితే%ూ% తమ అభ్యర్థిగా విష్ణువర్ధన్‌రెడ్డినే బరిలో దింపాలని కారు పార్టీ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. పీజెఆర్ వారసత్వం, నియోజకవర్గం మీద కొంత పట్టు ఉన్న విష్ణువర్ధన్ రెడ్డి అయితేనే ఖైరతాబాద్‌లో దానం నాగేందర్‌ని గట్టిగా ఎదుర్కొంటారని బీఆర్ఎస్ అధిష్టానం గట్టిగా భావిస్తున్నట్టు తెలుస్తోంది.




### ఉల్లాసంగా, ఉత్సాహంగా ప్రధాని మోదీ.. నెట్టింట్లో ట్రెండింగ్

పాట్నా, నవంబర్ 20: ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతున్నారు. బిహార్లో ఎన్డీయే విజయాన్ని పూర్తిగా ఆస్వాదిస్తున్న ప్రధాని మోదీ, 'గంచా మూమెంట్' తీసుకొచ్చారు. మెడలోని కండువా తీసి తలపై గుండ్రంగా తిప్పుతూ జనాన్ని ఉర్రూతలూగించారు. బిహార్ ముఖ్యమంత్రి నీతీష్ కుమార్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ప్రధాని ఉదయం నుంచీ చాలా ఉత్సాహంగా కనిపించారు. వేదిక వద్దకు చేరుకునే సందర్భంలో కూడా ప్రధాని తన కండువా గాల్లో ఊపుతూ అక్కడికి చేరుకున్న ప్రజల్ని ఉత్సాహపరిచే యత్నం చేశారు. కాగా, బిహార్‌కు పదవసారి ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ, అమిత్ షా తదితర ఎన్డీయే పెద్దలు హాజరయ్యారు. పాట్నాలోని గాంధీ మైదాన్‌లో జరిగిన ఈ వేడుకకు భారీ ఎత్తున జనం హాజరయ్యారు. ఈ సందర్భంగా పీఎం మోదీ తన కండువాతో జనాల్ని ఉత్సాహపర్చారు. ముఖ్యమంత్రి, మంత్రుల చేత గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ ప్రమాణ స్వీకారాలు చేయించారు. ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ (జేడీ-యూ), బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరీ, విజయ్ కుమార్ సిన్హా ఉప ముఖ్యమంత్రులుగా, మరో 26 మంది మంత్రులుగా ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు.

### తిరుచానూరు ఆలయాన్ని సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



తిరుచానూరు: తిరుమల పర్యటనకు విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న రాష్ట్రపతికి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, తితిదే ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ తదితరులు ఆలయ సంప్రదాయం ప్రకారం.. ఘనస్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలను అందజేశారు.

# బీహార్‌లో కొలువుదీరిన ఎన్డీయే సర్కార్..


## సీఎంగా నితీశ్.. డిప్యూటీ సీఎంలుగా ఆ ఇద్దరు..

## మొత్తం 26మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం..

బీహార్ ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ ప్రమాణస్వీకారం చేశారు. ఆయన సీఎంగా ప్రమాణస్వీకారం చేయడం ఇది పదో సారి. బీహార్ రాజధాని పాట్నాలోని ప్రఖ్యాత గాంధీ మైదాన్‌లో పెద్ద ఎత్తున జనం సమక్షంలో నితీష్ కుమార్ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఎన్డీయే పక్షాల నేతలు హాజరయ్యారు.

ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, హర్యానా సీఎం నయాబ్ సింగ్ శైనీ, అసోం సీఎం హిమంత బిస్వ శర్మ, నాగాలాండ్ సీఎం నీఫు రోయ్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి హాజరయ్యారు. అలాగే, బీజేపీకి చెందిన సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా డిప్యూటీ సీఎంలుగా ప్రమాణస్వీకారం చేశారు. మొత్తం 26మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో 14మంది బీజేపీ ఎమ్మెల్యేలు ఉండగా.. ఎనిమిది మంది జేడీ(యు) ఎమ్మెల్యేలు ఉన్నారు.

లోక్ జనశక్తి పార్టీ (రాంవిలాస్) నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు, హెచ్ఎఎం(ఎస్), ఆర్ఎల్ఎం నుంచి ఒక్కొక్కరు చొప్పున నితీశ్ మంత్రివర్గంలో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు.



**ప్రమాణ స్వీకారం చేసిన బిహార్ కేబినెట్ మంత్రులు** : సామ్రాట్ చౌదరి (బీజేపీ) విజయ్ కుమార్ సిన్హా (బీజేపీ) దిలీప్ జైస్వాల్ (బీజేపీ) మంగళ్ పాండే (బీజేపీ) విజయ్ కుమార్ చౌదరి (జేడీయూ) బిజేంద్ర ప్రసాద్ యాదవ్ (జేడీయూ) శ్రావణ్ కుమార్ (జేడీయూ) అశోక్ చౌదరి (జేడీయూ) లేషి సింగ్ (జేడీయూ) మదన్ సాహ్ని (జేడీయూ) సునీల్ కుమార్ (జేడీయూ) రామ్ కృపాల్ యాదవ్ (బీజేపీ) సంతోష్ సుమన్ (బీజేపీ) నితిన్ నబిన్ (బీజేపీ) మహ్మద్ జమా ఖాన్ (జేడీయూ) సంజయ్ సింగ్ టైగర్ (బీజేపీ) అరుణ్ శంకర్ ప్రసాద్ (బీజేపీ) సురేంద్ర మెహతా (బీజేపీ) నారాయణ ప్రసాద్ (బీజేపీ) రామ నిషాద్ (బీజేపీ) లఖేంద్ర కుమార్ రోషన్ (బీజేపీ) ప్రమోద్ కుమార్ (బీజేపీ) సంజయ్ కుమార్ - LJP(RV) సంజయ్ కుమార్ సింగ్ - LJP(RV) సంతోష్ కుమార్ సుమన్ - HAM(S) దీపక్ ప్రకాష్ - RLM. ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 243 అసెంబ్లీ సీట్లకుగాను ఎన్డీయే కూటమి 202 సీట్లు దక్కించుకుంది. బీజేపీ 101 ఎమ్మెల్యేలను గెలుచుకోగా.. జేడీ(యూ) 85 చోట్ల విజయం సాధించింది.






# తిరుపతి పై టెన్షన్..టెన్షన్ .!!

**-పోలీసుల అదుపులో మావోయిస్టు దేవ్‌జీ లేరంటున్న ఏపీ ఆఫీసర్స్ -లొంగిపోనున్న ఆజాద్, నారాయణ?**

**-వారి వెంట మరో 20 మంది మావోలు - పాక హన్మంతు,మల్లా రాజిరెడ్డి సేఫ్ గానే ఉన్నార.?**

చురకలు ప్రత్యేక ప్రతినిధిహైదరాబాద్‌మావోయిస్టు పార్టీకి ఇటీవల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ విజయవాడ పోలీసుల అదుపులో ఉన్నాడా? హిడ్మా ఎన్కౌంటర్లో మరణించిన తర్వాత తిరుపతి కోసం ఆయన కుటుంబీకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఏపీలో పట్టుబడిన వారిలోని నలుగురు కీలక నేతల్లో అతను కూడా ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏపీ పోలీసులు మాత్రం తిరుపతి తమ వద్ద లేరని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసుల మాటపై అనుమానాలు తొలగినప్పటికీ ఆయన మాత్రం ఎక్కడ ఉన్నా సరే లొంగిపోవాలని సోదరులు కోరుతున్నారు .లొంగుబాటు ప్రణాళికలో భాగంగా ఏఓబీ నుంచి హిడ్మా రావాల్సి ఉండగా, ముందుగానే తిప్పరి తిరుపతి విజయవాడకు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.ఒకవేళ లొంగుబాటు ప్రయత్నాలు సఫలం కాకపోతే ఏపీ నుంచి తమిళనాడుకు వెళ్లేందుకు కూడా వారు ప్రణాళికలు రచించారని ప్రచారం జరుగుతున్నది. ఈ క్రమంలో దేవ్‌జీ పట్టుబడి ఉంటాడని అంటున్నారు. మరోవంక, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ నేతృత్వంలో భారీగా క్యాడర్ లొంగిపోయేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్టు తెలిసింది. ఇటీవల ఆయన తెలంగాణ పోలీసులను సంప్రదించినట్టు సమాచారం. కొందరు మాత్రం ఇప్పటికే సాంబయ్యతో పాటు మరికొందరు తెలంగాణ పోలీసుల గూటికి చేరుకున్నరాని అంటున్నారు.కాగా నేడో రేపో ఆయనతోపాటు డివిజన్ కమిటీ సభ్యుడు అప్పాసి నారాయణ అలియాస్ రమేశ్, వారితో వచ్చిన క్యాడర్‌ను మీడియా ముందు ప్రవేశపెట్టనున్నారు. మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీలో కీలక సభ్యుడిగా, భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శిగా ఆజాద్ కీలకంగా ఉన్నారు. వీరితోపాటు 20 మంది వరకు డివిజనల్, ఏరియా కమిటీల సభ్యులు లొంగిపోయేందుకు కార్యాచరణ పూర్తయినట్టు సమాచారం. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం మొద్దులగూడేనికి చెందిన ఆజాద్ 1995లోనే అజ్ఞాతంలోకి వెళ్లారు. రాష్ట్రకమిటీ కార్యదర్శి హరిభూషణ్ మృతి తర్వాత ఆ హోదా కోసం ఆజాద్, మరో రాష్ట్రకమిటీ సభ్యుడు బడే చొకారావు అలియాస్ దామోదర్ మధ్య పోటీ నెలకొంది. ఇప్పుడిది రాజకీయ వైరం సమస్య కాదు.దీంతో అప్పట్లో చంద్రన్న నేతృత్వంలోనే తెలంగాణ కమిటీని కొనసాగించారు. ఇటీవల దామోదర్‌ను రాష్ట్రకమిటీ కార్యదర్శిగా నియమించగా.. మారిన పరిస్థితుల కారణంగా ఆజాద్ లొంగిపోయేందుకు సిద్ధమైనట్టు తెలిసింది. అతనితోపాటు పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం ఎఫ్‌సీఐ ప్రాంతానికి చెందిన రమేశ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ టెక్నికల్ టీమ్ ఇన్‌చార్జిగా ఉన్నారు.

కాగా, ఏపీ పోలీసులు పలుచోట్ల నిర్వహించిన సోదాల్లో మొత్తం 50 మందికి పైగానే అరెస్టు చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించి,రిమాండ్ కు పంపించారు. మంగళవారం ఉదయం హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత ఆ వెంటనే ఏపీలోని పలు చోట్ల పోలీసులు మెరుపు దాడులు చేశారు. విజయవాడ పెనుమలూరులోని ఒక భవనంలో ఏలూరులోని ఒక అపార్ట్‌మెంట్ లో.. కాకినాడలోని ఒక ఇంటివద్ద కూడా గ్రేహౌండ్స్, ఆక్టోపస్ పోలీసులు చుట్టుముట్టి సోదాలు చేశారు. విజయవాడ పెనుమలూరు సమీపంలోని న్యూ ఆటోనగర్‌లోని ఓ అద్దె భవనంలో మొత్తం 31 మంది మావోయిస్టులు పట్టుబడ్డారని అధికారులు స్వయంగా వెల్లడించారు. అందులో మహిళలే ఎకువగా ఉన్నారని.. ఎకువమంది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మావోయిస్టులు అని ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్డా తెలిపారు. పట్టుబడిన వారిలో కీలక నేతలు ఉన్నట్లు కృష్ణా జిల్లా ఎస్పీ తెలిపారు. వీరంతా పెద్ద నేతలకు రక్షణగా ఉండే ఆర్మీ టీం సభ్యులని కూడా అధికారులు తెలిపారు. పట్టుబడిన వారిలో దేవ్ జీకి రక్షణగా ఉండే వారు 9 మంది ఉండటంతో అతను కూడా పోలీసుల అదుపులోనే ఉన్నాడనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పోలీసులు మాత్రం పట్టుబడిన కీలక నేతల పేర్లు వెల్లడించలేదు. ప్రస్తుతం వారందరినీ ఆక్టోపస్, టాస్ ఫోర్స్ కార్యాలయాలకు తరలించారు. ఏలూరులో నిర్వహించిన సోదాల్లో 12 మంది మావోయిస్టులు పట్టుబడ్డారు. కాకినాడ, తిరుపతిలో కూడా కొందరిని అరెస్టు చేశారని, వారిని నేడు మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉందని సమాచారం. కాగా తిరుపతికి సంబంధించిన ప్రచారాన్ని పోలీసులు నిర్ధారించలేదు.

మరోవంక, ఆపరేషన్ కగార్‌తో వరుస ఎన్ కౌంటర్లు, అగ్రనేతల మృతితో ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టులు ఆంధ్రప్రదేశ్ వైపు వచ్చారన్న సమాచారంతో కొంతకాలంగా పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఏకకాలంలో రాష్ట్రంలోని అల్లూరి, కాకినాడ, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో ఇంటెలిజెన్స్, ఆక్టోపస్ బృందాలు ఆపరేషన్ చేపట్టాయి. ఇప్పటివరకు విజయవాడలో 28, కాకినాడలో 2, ఏలూరులో 15 మందిని మిగతా ప్రాంతాల్లో మరికొంతమందితో కలుపుకుని మొత్తంగా రాష్ట్రంలో 50 మందికి పైగా మావోయిస్టులను అరెస్టు చేశారు. అలానే రాష్ట్రవ్యాప్తంగా మావోయిస్టు డంప్‌ల కోసం గాలింపు కొనసాగుతుంది. హిడ్మా డైరీ ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల సోదాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోరుట్ల దేవ్ జీ స్వస్థలం. తిప్పిరి తిరుపతి దాదాపు 43 ఏండ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లారు. గణపతి కార్యదర్శిగా పీపుల్స్‌వార్ పార్టీ తన ప్రస్తానాన్ని కొనసాగించిన క్రమంలో మల్లోజుల కోటేశ్వర్‌రావు, నల్లా ఆదిరెడ్డి, శీలం నరేశ్, పులి అంజన్న, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి, నంబాల కేశవరావు, మాధవ్, తిప్పిరి తిరుపతి కీలక భూమిక పోషించారు. పీపుల్స్‌వార్‌లో దళ సభ్యుడిగా ప్రస్థానం మొదలుపెట్టిన తిరుపతి, పార్టీలో కార్యదర్శి గా ఎదిగారు.ఇప్పుడు మావోయిస్టు ప్రాబల్యం ఎక్కువగా ఉండే ప్రాంతంలో తిరుపతి కదలికలు,రక్షణపై కలవరం నెలకొంది.



# సన్న బియ్యాన్ని పంపిణీ చేయండి.. కేంద్రమంత్రితో సీఎం

హైదరాబాద్, నవంబర్ 20: దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో రేషన్ షాపుల్లో వినియోగదారులకు సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఈరోజు (గురువారం) ఉదయం హెూటల్ తాజ్‌కృష్ణలో కేంద్రమంత్రితో ముఖ్యమంత్రి రేవంత్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు తినే బియ్యాన్ని సరఫరా చేస్తేనే సంక్షేమ పథకం ఉద్దేశం నెరవేరుతుందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలాగే కేంద్రం కూడా దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ అంశాన్ని పరిశీలించాలని కేంద్రమంత్రి కోరారు. అవసరమైతే అధ్యయనం చేసి తగు నిర్ణయం తీసుకోవాలని వినతి చేశారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. పూర్తిస్థాయి అధ్యయనం తర్వాత పరిశీలించి దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణిపై నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




## అఫిడవిట్ దాఖలు చేయాల్సిందే.. వారికి స్పీకర్ నోటీసులు

హైదరాబాద్, నవంబర్ 20: పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ నోటీసులు జారీ చేయగా.. అందులో ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రం ఇప్పటి వరకు అఫిడవిట్‌లు దాఖలు చేయని పరిస్థితి. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి.. స్పీకర్ నోటీసులకు స్పందించని విషయం తెలిసిందే. దీంతో వారిరువురికి స్పీకర్ మరోసారి నోటీసులు జారీ చేశారు. అనర్హత పిటిషన్లపై అఫిడవిట్ దాఖలు చేయాలని అసెంబ్లీ స్పీకర్ స్పష్టం చేశారు. ఇక.. పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విచారణ నేటితో (గురువారం)తో ముగియనుంది.

కేసు విచారణ ఆలస్యంపై సుప్రీం సీరియస్ అవడంతో పాటు నాలుగు వారాలు గడువు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణలో వేగం పెంచాలని అసెంబ్లీ స్పీకర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా రెండో విడత విచారణలో భాగంగా నలుగురు ఎమ్మెల్యేలను నేడు విచారణకు పిలిచారు. ఉదయం ఎమ్మెల్యేల విచారణ మొదలైంది. పోచారం శ్రీనివాస్ రెడ్డి వర్సెస్ జగదీశ్ రెడ్డి కేసును స్పీకర్ విచారించారు. ఇరు వర్గాల ఓరల్ ఆర్గ్యుమెంట్స్‌ను స్పీకర్ విన్నారు. అలాగే మధ్యాహ్నం అరికెపూడి గాంధీ వర్సెస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కేసు విచారించనున్నారు. వీరి విచారణతో మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్యేల విచారణ పూర్తి అవుతుంది.

**ఢిల్లీకి దానం...** మరోవైపు ఎమ్మెల్యే దానం నాగేందర్ ఢిల్లీ వెళ్లారు. ఏఐసీసీ పెద్దలను కలవనున్నారు. నేటితో ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ ముగియనున్నప్పటికీ ఇప్పటి వరకు దానం అఫిడవిట్లు దాఖలు చేయలేదు. విచారణకు హాజరైతే వేటు పడుతుందని దానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. వేటు పడితే ఆరు సంవత్సరాల పాటు పోటీ చేయడానికి నో ఛాన్స్. ఈ క్రమంలో రాజీనామా చేసేందుకు దానం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. రాజీనామా చేస్తే తన పరిస్థితి ఏంటని పార్టీ పెద్దలతో దానం సంప్రదింపులు జరుపనున్నట్లు తెలుస్తోంది.




హైదరాబాద్: ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించారు. ఈ కేసులో ఇప్పటికే పలుమార్లు కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈక్రమంలో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి కోరుతూ గతంలో ఏసీబీ లేఖ రాసింది. ఆయన పాత్రపై సాక్ష్యాలు ఉన్నాయంటూ అందులో పేర్కొంది. ఈక్రమంలో తాజాగా ఏసీబీ అధికారులకు అనుమతి ఇస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో త్వరలోనే ఏసీబీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయనుంది.

## కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు ఇది పరాకాష్ఠ: హరీశ్‌రావు



హైదరాబాద్: ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించడంపై మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు ఇది పరాకాష్ఠ అని ఆయన విమర్శించారు. ఈ ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతులు నొక్కే ప్రయత్నం చేస్తోందన్నారు. "ప్రతిపక్ష నేతలను వేధించడమే సీఎం రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టారు. స్థానిక ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం చిల్లర డ్రామాలు చేస్తున్నారు. కేటీఆర్‌కు అండగా ఉంటాం" అని హరీశ్‌రావు అన్నారు.




హైదరాబాద్: విధి నిర్వహణలో ఉన్న అధికారులపై దాడులు చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. పోలీసు అధికారులు, ఉపాధ్యాయులు, ఆర్టీసీ సిబ్బంది సహా ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. దాడులకు పాల్పడినవారిపై 221, 132, 121(1) సెక్షన్ల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. వారిపై హిస్టరీ షీట్స్ కూడా తెరుస్తామన్నారు. ఒకసారి కేసు నమోదైతే భవిష్యత్ అంధకారమయ్యే ప్రమాదం ఉందని.. పాస్‌పోర్టు జారీ, ప్రభుత్వ ఉద్యోగానికి ఇబ్బందులు వస్తాయన్నారు. క్షణికావేశంలో ఏ చిన్నతప్పు చేసినా జీవితాంతం కుమిలిపోవాల్సి వస్తుందని సీపీ హెచ్చరించారు.




హైదరాబాద్: సినిమా పైరసీ కేసులో ప్రధాన నిందితుడు, ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమంది రవిని పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. బషీర్‌బాగ్‌లోని సైబర్‌క్రైమ్ పీఎస్‌కు అతడిని తరలించారు. పైరసీ కేసుకు సంబంధించి వివిధ కోణాల్లో అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఇమంది రవిని ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీలోకి తీసుకొనేందుకు బుధవారం నాంపల్లి కోర్టు అనుమతి ఇచ్చింది. భారతీయ భాషల్లోని 21 వేల సినిమాలను పైరసీ చేసిన రవిని ఇటీవల నగర సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. కరేబియన్ దీవులు కేంద్రంగా చేసుకొని ఆరేళ్లుగా 66 మిర్రర్ వెబ్‌సైట్లలో పైరసీ సినిమాలు అప్‌లోడ్ చేసినట్లు గుర్తించారు.

50 లక్షల మంది డేటా సేకరించి సైబర్ నేరస్థులు, గేమింగ్, బెట్టింగ్‌యాప్‌ల నిర్వాహకులకు విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈక్రమంలో 5 రోజుల కస్టడీలో రవి నుంచి మరింత సమాచారం సేకరించాలని పోలీసులు భావిస్తున్నారు.

## ఇంత పెద్ద దుఃఖం మరెవరికీ రాకూడదు: కేటీఆర్



హైదరాబాద్: సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అడిక్‌మెట్‌లోని ఒకే కుటుంబంలో 18 మంది మరణించడం బాధాకరమని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఆయన అడిక్‌మెట్, రాంనగర్, విద్యానగర్ ప్రాంతాల్లో పర్యటించారు. 18 మంది మృతి చెందిన కుటుంబంతో పాటు.. ఇతర బస్సు ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారికి తాము అండగా ఉంటామన్నారు. ఇప్పటికే కొందరు తమ పార్టీ నాయకులు జెడ్డా వెళ్లారని చెప్పారు. భారత దౌత్య అధికారులతో మాట్లాడి వీలైనంత సహాయం చేస్తామని తెలిపారు. ఇంత పెద్ద దుఃఖం మరెవరికీ రాకూడదన్నారు. ప్రమాద ఘటన తనతో పాటు అందరికీ బాధ కలిగించిందన్నారు. శోక సమయంలో బాధిత కుటుంబాలకు మనోధైర్యం ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. సౌదీ అరేబియాలో ఈ నెల 17న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది హైదరాబాదీలు మృతిచెందిన విషయం తెలిసిందే. యాత్రికులతో వెళ్తోన్న బస్సు.. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

## కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతి.. ఇప్పుడు రేవంత్ ఏం చేస్తారో?: బండి సంజయ్



హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు తెలంగాణ గవర్నర్ అనుమతించిన నేపథ్యంలో ఇప్పుడు కాంగ్రెస్ ఏం చెబుతుందని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో ఏసీబీ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బండి సంజయ్ స్పందించారు.

"భాజపా, భారత రాష్ట్ర సమితి ఒకటే అని విమర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడేం సమాధానం చెబుతారు? ఇన్నాళ్లూ గవర్నర్ అనుమతి ఇవ్వొద్దనే సీఎం కోరుకున్నారు. అవినీతిపరుల ఆస్తులు జప్తు చేస్తానని గతంలో ఆయన అన్నారు. ఇప్పుడు గవర్నర్ అనుమతి ఇచ్చారు కదా.. సీఎం ఏం చేస్తారో చూడాలి." అని బండి సంజయ్ అన్నారు. అర్బన్ నక్సలైట్లు చిన్నపిల్లలను రెచ్చగొడుతున్నారని ఆయన విమర్శించారు. కార్లలో తిరుగుతూ సొంత పైరవీలు చేసుకుంటూ రూ.కోట్లు సంపాదిస్తున్నారని ఆరోపించారు.

## ఇందిరమ్మ చీరల పంపిణీపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్ 20: ఇందిరమ్మ చీరల పంపిణిపై అధికారులకు మంత్రి సీతక్క కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇంటింటికి ఇందిరమ్మ చీర పంపిణీ చేయాలని.. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి చీరలు పంచాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో బృంద సభ్యులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి బొట్టుపెట్టి చీరలు అందజేయాలన్నారు. ఎస్‌హెచ్‌జీ వెలుపల ఉన్న మహిళలకు వెంటనే సభ్యత్వం వెను వెంటనే చీర పంపిణీ చేయాలని మంత్రి తెలిపారు. మహిళా స్వయం సహాయక బృందాల ప్రాముఖ్యతపై నియోజకవర్గ, మండల స్థాయి కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పంపిణీ వివరాలు తప్పనిసరిగా ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ క్రమశిక్షణగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. 18 ఏళ్లు పైబడిన ప్రతి మహిళకు చీర అందాలన్నారు. కొత్త లబ్ధిదారుల గుర్తింపుకు పౌర సరఫరా శాఖ సహకారం తీసుకోవాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు.

కాగా.. తెలంగాణ వ్యాప్తంగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం మొదలైంది. కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అర్హులైన మహిళలకు రెండు దశల్లో చీరలను పంపిణీ చేయనున్నారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా నిన్నటి (బుధవారం) నుంచి ఈ కార్యక్రమం మొదలవగా.. తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం (డిసెంబర్ 9) మొదటి దశలో గ్రామీణ ప్రాంతాల్లో చీరలను పంపిణీ చేస్తారు. ఇక రెండవ దశలో మార్చి 1 నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవం అంటే మార్చి 8 వరకు పట్టణాల్లో చీరలను పంచనున్నారు. ఇందిరమ్మ చీరలకు సంబంధించి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) పలు మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. ప్రతీ మహిళకు బొట్టు పెట్టి చీరలు పంపిణీ చేయాలని స్పష్టం చేసింది. చీరలు తీసుకునేందుకు లబ్ధిదారులు ఆధార్ కార్డు చూపించాల్సి ఉంటుంది. అలాగే చీరలు తీసుకున్నాక ఫేషియల్ రికగ్నిషన్ యాప్ ద్వారా రికార్డు చేయాలి. సెర్ప్ సభ్యులు ముఖ గుర్తింపు యాప్ ద్వారా వారి ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసి, లబ్ధిదారుల ఫొటోను తీసి చీర అందజేస్తారు.




## రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించడం తగదు: 'బిల్లుల' అంశంపై సుప్రీం కీలక తీర్పు

ఢిల్లీ: రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే అంశంలో సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానం గడువు విధించడంపై దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము సంధించిన ప్రశ్నల (ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్)పై అత్యున్నత న్యాయస్థానం సమాధానమిచ్చింది. పెండింగ్ బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించడం తగదని సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టంచేసింది. అయితే, కారణం చెప్పకుండా గవర్నర్లు బిల్లులను వెనక్కి పంపలేరని వెల్లడించింది. ఈ మేరకు దీనిపై గతంలో ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సీజేఐ ధర్మాసనం పక్కనబెట్టింది.

**సుప్రీం తీర్పులో కీలక అంశాలివే..** గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు ఆప్షన్లు ఉంటాయి. 1. బిల్లులకు సమ్మతి తెలియజేయడం 2. కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం 3. బిల్లును తిరస్కరించి అసెంబ్లీకి పంపడం ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారు. ఇందుకు న్యాయస్థానాలు గడువు విధించడం సబబు కాదు. గవర్నర్ల విధుల నిర్వహణ వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోవు. కానీ, కారణం లేకుండా దీర్ఘకాలంగా బిల్లులను పెండింగ్‌లో ఉంచిన సందర్భాల్లో కోర్టులు పరిమిత విచక్షణతో వ్యవహరించొచ్చు. రాష్ట్రపతి విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. నిరవధిక ఆలస్యం కొనసాగుతున్న సందర్భాల్లో అది న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుంది. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి రిజర్వ్ చేసిన ప్రతిసారీ ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి సుప్రీంను సంప్రదించాల్సిన అవసరం లేదు. ఆర్టికల్ 200 కింద గవర్నర్లకు విచక్షణాధికారం ఉంటుంది. అయితే, దాన్ని అపరిమితంగా వినియోగించలేరు.

**పెండింగ్ బిల్లుల అంశం పూర్వాపరాలివీ..** శాసనసభలు ఒకటికి రెండుసార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆ బిల్లులను ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం నిర్దేశించింది. దీంతో రాజ్యాంగ అధికరణం 143(1) ప్రకారం తనకున్న అధికారాన్ని వినియోగిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మే నెలలో పలు ప్రశ్నలతో సీజేఐకి లేఖ రాశారు. రాష్ట్రపతి విచక్షణ అధికారాల పరిధిలోకి వచ్చే రాష్ట్రాల బిల్లులకు ఆమోదం తెలిపే అంశంలో న్యాయస్థానం గడువు విధించడం ఎంతవరకు న్యాయ సమ్మతమో తెలపాలంటూ సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. దీనిపై సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. పది రోజుల పాటు అన్ని పక్షాల వాదనలను ఆలకించిన ధర్మాసనం సెప్టెంబరు 11న తీర్పు రిజర్వు చేసింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించలేమంటూ తాజాగా తీర్పు వెలువరించింది.

# "మాసానాం మార్గశీర్షోహం"



**బృహత్సామ తథా సామ్నాం గాయత్రీ ఛందసామహమ్**
**మాసానాం మార్గశీర్షోహం ఋతూనాం కుసుమాకరః**

"వేదాలలో సామవేదాన్ని, ఛందస్సుల్లో గాయత్రీ ఛందస్సును, మాసాలలో మార్గశిర మాసాన్ని, రుతువులలో వసంత రుతువును" అంటూ సాక్షాత్తూ శ్రీ కృష్ణ పరమాత్ముడు భగవద్గీతలోని విభూతియోగంలో చెప్పిన శ్లోకమిది. కార్తికేయుడు, కాలభైరవుడు, దత్తాత్రేయుడు, వంటివారితో పాటు స్వయం భగవానుముఖతః ప్రకటితమైన శ్రీమద్భగవద్గీత అవతరించిన మాసం. విభూతి యోగంలోనే "నక్షత్రాణ మహం శశీ" అన్నారు. చంద్రుడు తారా నాధుడు. "మాసాలలో మార్గశీర్షం- నక్షత్రాలలో చంద్రుడు"- మృగశిరా నక్షత్ర యుక్త పౌర్ణమాసి మార్గశీర్షం - ఈ మాసమునకు అధినాధుడు చంద్రుడు. మృగశిరా నక్షత్రమునకు కూడ చంద్రుడే అధినాధుడు. ఇంకే నక్షత్రానికి చంద్రుడు ఆధినాధుడు కాడు. నక్షత్రములు మృగశిరాదిగ నెలలు, మార్గ శీర్షమాదిగా లెక్కించెడివారు. అందువలన మార్గశిర మాసమునకు భగవానుడు ప్రాధాన్యత కలిగించారు. విషవత్తు అంటే రాత్రి దివసముల సమాన కాలము. మృగశిరా నక్షత్రముతో మనపూర్వ రుషులు విషువత్తు నిర్ణయం గావించారు. మృగశిరా విషువత్తుతో మొదలయ్యే కాలం మార్గశీర్షం. మార్గశిర మాసానికి ఇంకొక ప్రాముఖ్యం ఉంది. పరమ పవిత్రమైన గోదాదేవి వ్రతం ఆరంభించి ఉపనిషత్తుల్యములైన పాశురములను అనుగ్రహించినది. "మార్గళంగల్ మదినిజైన్ద నన్నాళాల్ మార్గశిరము వచ్చినది. పూర్ణ చంద్రునితో కూడిన శుక్ల పక్షము - వైష్ణవ మాసము - మార్గశీర్షము అనగా భగవంతుని పొందుదారి- "నారాయణనే నమక్కే" అని శరణాగతి. భాగవతం దశమ స్కంధంలోనే భగవంతుని వెదకెడి ద్రోవలో హేమంతంలో ప్రధమ మాసంలో నందప్రజ కుమారికలు భగవత్ ప్రసాదం "హవిష్యం భుంజాన:" కాత్యాయనీ వ్రతం చేయుటకు పూనుకొన్నారని ప్రమాణం ఉన్నది. మార్గశిరం తొమ్మిదవ మాసం. మృగశిరా నక్షత్రంతో కూడిన పౌర్ణమి గల మాసం మార్గశిరం. మార్గశీర్షం పరమ పవిత్రం. నక్షత్ర మండలంలో మూడు నక్షత్రాలు శీర్షాకృతిని పోలి ఉన్నందున "మృగశీర్ష" అని పేరువచ్చింది. రాశి అధి పతి గురుడు, సూర్యచంద్రుల సమాగమమును సంతరించుకున్న ఈ మాసం విష్ణు ఆరాధనతో మోక్షదాయిని అయింది. ఒకప్పుడు మార్గశిరంలోనే సంవత్సరారంభం ఉండినట్లు వాడకంలో ఉంది. భాగవత దశమ స్కందంలో బమ్మెర పోతనామాత్యుడు, గోపభామలు "మార్గశీర్షవ్రతం" జరిపారని పేర్కొన్నాడు. కోటిసూర్య గ్రహణ స్నాన తుల్య ఫలాన్ని ఇచ్చే మార్గశిర శుక్ల ప్రతిపద, ఉమామహేశ్వర, అనంత తృతీయ, యోగ తృతీయ, నామ తృతీయ, అనబడే శుక్ల తృతీయ నాడు రంభావ్రతం, చవితి నాడు వినాయక చతుర్థి వ్రతం, పంచమి నాడు దక్షిణాత్యుల నాగపూజ, శివుని రెండవ కుమారుడు, కుమారస్వామి, కార్తికేయుడు స్కందుడు, గుహుడు, షణ్ముఖుడైన సుబ్రహ్మణ్య స్వామిని కొలిచే సుబ్బారాయుడి షష్టినాడు స్కంద వ్రతం, బ్రహ్మచారి పూజ, సర్పపూజ, సప్తమి సూర్య ఆరాధన, నందా సప్తమీ వ్రతం, అష్టమి నాడు కాల భైరవ పూజ, నవమి నాడు నందిని దేవి పూజ, దశమి నాడు ఆరోగ్య వ్రతం, మోక్షదైకాదశి, సౌఖ్య దైకాదళి అని పిలువబడే ఏకాదశి విష్ణు ఆరాధన, త్రయోదశి హనుమత్ వ్రతం, ద్వాదశి నాడు తెలుగు వారి ఇలవేలుపు అయిన వేంకటేశ్వరుని పుష్కరిణికి తీర్ధదినంగా, త్రయోదశిన గోదావరి ప్రాంత హనుమజ్జయంతిగా, చతుర్దశి దత్తాత్రేయ ఆరాధన పౌర్ణమి నాడు దత్త జయంతి, చంద్రపూజ, యమా రాధన, కృష్ణపక్ష ద్వాదశి మల్లన్న ద్వాదశిగా, చతుర్ధశి మాస శివరాత్రి, వ్రత నిష్ణాపరులకు ఆచరణలో ఉన్నాయి. కార్తిక పౌర్ణమి నుండి మార్గశిర పౌర్ణమి వరకు యమధర్మ రాజు కోరలు తెరుచుకొని ఉంటాడు, ఈ రోజుల్ని యమ దంష్ట్రలుగా చెబుతారు. ఈ కాలంలో జనం వివిధ ఆనారోగ్య సమస్యలతో బాధపడుతుంటారు. మార్గశిర పౌర్ణమితో ఈ అనేక రకమైన వ్యాదులు, అనారోగ్య సమస్యలు తొలగుతాయి కాబట్టి యముని పట్ల కృతజ్ఞత పూర్వకంగా మార్గశిర పౌర్ణమినాడు యమధర్మ రాజుని ఆరాధిస్తారు. ఈ పౌర్ణమిని కోరల పున్నమి, నరక పౌర్ణమి అని కూడా పిలుస్తారు. మహర్షి అత్రి, మహా పతివ్రత అనసూయలకు మార్గశీర్ష పౌర్ణమి నాడు గురు స్వరూపంగా త్రిగుణాత్ముడు, త్రిముఖ దేహుడు దత్త రూపంలో జన్మించిన "దత్తాత్రేయుని జయంతి"ని మహారాష్ట్ర, తెలుగు రాష్ట్రాలలో వైభవంగా భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ఇవి కాకుండా ధనుర్మాసం, లక్ష్మీవారం గురువారం, షష్టీవారాలు ప్రసిద్ధాలు. జ్ఞానమును పెంపొందించే ధనుర్మాసంలో ఓంకారాన్ని ధనువుగా, ఆత్మను బాణంగా, బ్రహ్మమును లక్ష్యంగా చేసుకుని, సాధకులు నిర్మల, నిశ్చల మనస్కులై ఏకాగ్రత చిత్తంతో ధ్యానం చేస్తే, త్వరగా లక్ష్య సిద్ధి కలగు తుందనేది విశ్వాసం. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# భక్తి శ్రద్ధలతో ధర్మపురిలో గోదావరి మహా హారతి



కార్తీక బహుళ అమావాస్య పర్వదిన సందర్భంగా, ధర్మపురి క్షేత్రంలో గోదావరి నది వద్ద కార్తీక దీపారాధనా మహోత్సవం గురువారం రాత్రి నేత్ర పర్వంగా జరిగింది. కార్తీక మాస చివరి రోజైన అమావాస్య అపురూప సన్నివేశ నేపథ్యంలో దేవస్థాన ఆస్థాన వేదపండితులు బొజ్జా రమేశ శర్మ రూపశిల్పిగా, వినూత్నంగా క్షేత్రంలో ఏర్పాటు చేసిన, అరుదైన, అపురూప ఆ సన్నివేశ సందర్భంగా గురు వారం సాయంత్రం 4 గంటల నుండి శ్రమించి ఏర్పాటు చేసిన వేలాది దీపాలంకరణలకు అనూహ్య స్పందన లభించింది. వేద పండితులు, అర్చకులు, సిబ్బంది నిర్వహించగా, మహిళలు, దీపాల అలంకరణకు సహకరించారు. అమావాస్య రాత్రి మునుముందుగా గోధూళి ముహూర్తాన దేవస్థానం ఇఓ శ్రీనివాస్, జక్కు రవీందర్ నేతృత్వంలోని ధర్మ కర్తల దర్శకత్వంలో, హారతి భక్తులు దేవస్థానం వద్దనుండి మంగళ వాద్యాలు తోడు రాగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజాదులలో పాల్గొని నదీమ తల్లికి సంప్రదాయ రీతిలో మహా హారతి సమర్పించారు. మునుముందుగా గోధూళి ముహూర్తాన దేవస్థానం ఇఓ శ్రీనివాస్ జక్కు రవీందర్ నేతృత్వంలోని ధర్మ కర్తల దర్శకత్వంలో, ఆస్థాన వేద పండితులు బొజ్జా రమేశ శర్మ, అర్చకులు నేరేళ్ళ శ్రీనివాసాచార్య, ప్రవీణ్, రాజగోపాల్, అరుణ్, సంతోష్, సూపరింటెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, సి ఐ రాం నర్సింహా రెడ్డి దంపతులు,దేవస్థానం వివిధ ఆలయాల అర్చకులు, మహిళలు, సువాసినులు, శ్రీ శారదా మహిళా మండలి, శ్రీవల్లి స్వచ్ఛంద సంస్థ సభ్యులు, సిబ్బంది ప్రత్యేక పూజలొనరించి మంగళ హారతి, మంత్ర పుష్ప నీరాజనాది క్రతువులు నిర్వహించిన అనంతర సనాతన సాంప్రదాయ రీతిలో నది నీటిలో కార్తీక దీపాలను దొప్పలలో వెలిగించి వదిలి పెట్టారు.



**ముగిసిన కార్తీక మాసోత్సవాలు...** పుణ్య తీర్ధము, ప్రాచీన క్షేత్రమైన ధర్మపురిలో కార్తీక మాసోత్సవ వేడుకలు ఘనంగా ముగిసాయి. చివరి రోజైన గురు వారం గోదావరిలో కార్తీక మాస ముగింపు సందర్భంగా అత్యధిక సంఖ్యాకులైన భక్తులు, యాత్రికులు పవిత్ర నదీ స్నానాలకై తరలి వచ్చారు. ప్రధానంగా కార్తీక మాస చివరి రోజు, అమావాస్య నాడు సుదూర ప్రాంతాల నుండి ఆర్టీసీ బస్సులు మరియు ప్రైవేటు వాహనాలలో భక్తులు అరుదెంచారు. కార్తీక మాసంలో నదీ స్నానమాచరిస్తే నరక బాధలుండవనే విశ్వాసంతో నెల రోజుల ఉదయాత్పూర్వ స్నానాలకు ముగింపు పలికేందుకు, చివరి రోజు ఉదయాత్పూర్వం నుండే పిల్లా పాపలతో, గోదావరి నదిలో మంగళ స్నానాలు ఆచరించి, దీపా రాధనగావించి, దొప్పలలో దీపాలను వెలిగించి, నదినీటిలో వదిలి పెట్టారు. నదీమ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. శివాలయంలో రావిచెట్టుకు పూజలు చేశారు. ప్రధానాలయాలలో ఈ సందర్భంగా ఉదయం పంచోపనిష యుక్త అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు, పూజలు, నిత్య కళ్యాణ అది కార్యక్రమాలు, నిత్య కళ్యాణ దాతల పేరున అర్చనలు, షోడశోపచార విధివిధాన పూజలు నిర్వహించగా, భక్త జనం ప్రత్యేక పూజులలో పాల్గొన్నారు. దేవస్థానం ఎసి, ఇఓ శ్రీనివాస్, జక్కు రవీందర్ నేతృత్వం లోని ధర్మ కర్తలు, ఆస్థాన వేద పండితులు, రమేశ శర్మ, అర్చక పౌరోహితులు ప్రవీణ్ శర్మ,సంతోష్ శర్మ, సంపత్ కుమార శర్మ, రాజగోపాల్ శర్మల సహకారంతో ఆలయాల అర్చకులు వేదోక్త సాంప్రదాయ రీతిలో పూజలను నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు, నాయకులు, పాల్గొన్నారు.
**రామ కిష్టయ్య సంగన భట్ల...9440595494**

# శాస్త్ర పరిశోధనలో సిద్ధి పొందిన తాపసి సి.వి. రామన్ - నవంబర్ 21... సి.వి. రామన్ వర్ధంతి



విజ్ఞాన ఆవిష్కరణల్లో భారతీయులకు నోబెల్ రావడం గగన సదృశం. సర్ సివి రామన్ ఆ ఘనత సాధించారు. అంతేకాదు, విజ్ఞాన శాస్త్రంలో ఆఘనత సాధించిన ఏకైక ఆసియా వాసిగానూ ఖ్యాతి గడించారు. సైన్సులో ఎవరూ చేయలేని సాహసాలను అత్యంత సునాయాసంగా చేసి చూపించి, విశ్వ వినువీధిలో భారత కీర్తి పతాకాన్ని రెపరెప లాడించిన మహా జ్ఞాని చంద్రశేఖర్ వెంకటరామన్ (సి వి రామన్). వైజ్ఞానిక రంగంలో ప్రపంచ దేశాలను తలదన్నేలా భారత్ ను శక్తివంతంగా చూపి, అబ్బుర పరిచే ప్రయోగాలకు నిలువెత్తు వేదికలా నిలిచారు సర్ సివి రామన్. వైజ్ఞానిక రంగంలో తొలి నోబెల్ అందుకున్న విజ్ఞాన ఖని. ఒక్క మాటలో చెప్పాలంటే వైజ్ఞానిక శాస్త్రానికే వైద్యుడిలా మారిన మహెూన్నతుడు. ఆధునిక భారత విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధనా ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప జేసిన వ్యక్తిల్లో సర్ సీవీ రామన్ మొదటివారు. సీవీ రామన్ నవంబర్ 7, 1888 తమిళనాడులోని తిరుచురాపల్లిలో జన్మించారు. తండ్రి చంద్రశేఖర్ అయ్యర్, తల్లి పార్వతి అమ్మాళ్. తండ్రి విశాఖపట్నంలోని ఏవీఎన్ కళాశాలలో లెక్చరర్ గా పని చేయడం వల్ల రామన్ బాల్యం, విద్యాభ్యాసం అక్కడే జరిగింది. అనంతరం మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో చేరి 19 ఏళ్లకు ఫిజిక్స్ లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు. ఆ తర్వాత తల్లిదండ్రుల కోరిక మేరకు ఐసిఎస్ పాస్కై కలకత్తా ప్రభుత్వ ఆర్థిక శాఖలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్గా చేరారు. ఆ సమయం లోనే పరిశోధనలపై ఆసక్తి పెంచుకున్నారు. పరిశోధనల కోసం భారతీయులు విదేశాలకు వెళ్లడమేమిటి?. విదేశీయులే... పరిశోధనల కోసం ఇక్కడకు రావాలని చాటి చెప్పిన మహెూన్నత వ్యక్తి రామన్. రామన్ ముందు వరకూ సైన్స్ లో నోబెల్ బహుమతులు పాశ్చాత్యులకే దక్కేవి. కానీ, రామన్ అచ్చమైన భారతీయునిగా ఈ గడ్డ పైనే చదువుకొని, తలమానికమైన పరిశోధన జరిపి సైన్సులో దేశ శక్తి సామర్ధ్యాలను ప్రపంచానికి చాటి చెప్పి భారత్ కు నోబెల్ సాధించి పెట్టారు. "నా మతం సైన్సు.. దానినే జీవితాంతం ఆరాధిస్తా..' అని చెప్పి తుదిశ్వాస వరకూ శాస్త్రాన్వేషణ లోనే గడిపిన దార్శనికుడు. "విజ్ఞాన శాస్త్ర సారాంశం ప్రయోగ శాలల పరికరాలతో వికసించదు. నిరంతర పరిశోధన, స్వతంత్రంగా ఆలోచించే ప్రవృత్తి ఇవే విజ్ఞాన శాస్త్ర సాగరాన్ని మథించి వేస్తాయి" అంటూ ఆయన చేసిన ప్రసంగం నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తోంది. ఉదయాకాశంలోని వెలుగుల్లో చెట్లు ఎంత అందంగా కనబడతాయో మీరు ఎప్పుడైనా గమనించారా? నాకు వీటిని చూస్తూ ఉంటే స్ఫటిక నిర్మాణం గురించిన ఆలోచనలు వస్తుంటాయి. అందుకే "విజ్ఞానం అత్యుత్తమ్మైన సృజనాత్మక కళారూపం అని రామన్ ఎప్పుడూ చెబుతుండే వారు. మెర్క్యూరీ ల్యాంప్ నుండి ఏకవర్ణ కాంతి తరంగాలను ఒక పారదర్శక యానకం గుండా ప్రసరింపజేస్తే, యానక ధర్మాలపై ఆధారపడి ఆ కాంతిలో కొంత భాగం వివర్తనం చెంది, తక్కువ తరంగ ధైర్ఘ్యం గల కాంతిగా బహిర్గత మౌతుంది. సముద్ర జలంపై ఇదే ప్రక్రియతో నీలి రంగు కాంతి బహిర్గత మవుతుంది. దీనినే 'రామన్ ఫలితం' (రామన్ ఎఫెక్ట్) అంటారు. రామన్ జీవితంలో మరో మైలురాయి రామన్ ఎఫెక్ట్ సిద్ధాంతం. వస్తువు మీద కాంతి కిరణం పడితే అది పరివర్తనం చెందుతుందని, దాని వల్లనే అది తన గమనాన్ని మార్చుకుంటుందని తన సిద్ధాంతాల ద్వారా రుజువు చేశారు. రామన్. అప్పటికున్న అరకొర సదుపాయాలతోనే మన దేశ విజ్ఞాన కిరణాలను నలుదిశలా ప్రసరింప జేశారు. సూర్యుని నుంచి వెలువడే తెలుపు వర్ణపు కాంతి వాయువులోని అణువులపై పడి, వాటి ప్రయాణ దిశను మార్చు కుంటాయని తన పరిశోధనల ద్వారా తెలుసుకున్న సి.వి. రామన్ ఓ సిద్ధాంతాన్ని సూత్రీకరించాడు. వస్తువు మీద కాంతి కిరణం పడితే అది పరివర్తనం చెందుతుందని 1928 సంవత్సరం, ఫిబ్రవరి 28న రామన్ మొట్ట మొదటిసారి ప్రకటించారు. పారదర్శకంగా ఉన్న ఘన లేదా ద్రవ లేదా వాయు మాధ్యమం గుండా కాంతిని ప్రసరింప చేసినప్పుడు అది తన స్వభావాన్ని మార్చు కుంటుంది. ఈ విషయాన్ని 1928 మార్చి 16 న బెంగుళూరులో జరిగిన శాస్త్రజ్ఞుల సదస్సులో చూపించాడు. అతను అనుకున్నట్లే 1928 ఫిబ్రవరి 28 న "రామన్ ఎఫెక్టు" ఆవిష్కరించడం జరిగింది. ఈ పరిశోధనను అభినందిస్తూ బ్రిటీష్ ప్రభుత్వం 1929 లో "నైట్ హుడ్" బిరుదుతో సత్కరించింది. ఈ రామన్ ఎఫెక్టు అసామాన్య మనదని, అందులో 200 రూపాయలు కూడా ధర చేయని పరికరాలతో ఆ విషయ నిరూపణ జరగడం అద్భుతమ్మైనదని ప్రపంచ శాస్త్రజ్ఞులంతా రామన్ ను అభినందించారు. అఖండ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందిన రామన్ కు ఎన్నో గౌరవ డాక్టరేట్లు లభించాయి. 1924 లో ఇంగ్లండ్ "రాయల్ సొసైటీ" సభ్యుడయ్యాడు. 1928 లో రామన్ కు "సర్" బిరుదు దక్కింది. 1947 లో ప్రతిష్టాత్మకమ్మైన "ఫ్రాంక్లిన్ మెడల్" లభించింది. తన అనన్య సామాన్య పరిశోధనా సామర్ధ్యంతో ఫిజిక్స్ రంగంలో రామన్ ఎఫెక్ట్ కనుగొని చరిత్ర సృష్టించిన ఫిబ్రవరి 28 నే జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపు కొంటున్నాం. 1987 ఫిబ్రవరి నుండి ప్రతీ సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవంగా భారత ప్రభుత్వం అధికారకంగా జరుపుతోంది. రామన్ నూటికి నూరుపాళ్ళూ భారతీయునిగా ఈ గడ్డపైనే చదువుకొని, పరిశోధనలు జరిపి స్కెన్సులో శక్తిసామర్ధ్యాలను ప్రపంచానికి చాటి చెప్పి భారత్ కు నోబెల్ సాధించి పెట్టారాయన. 1913 లో సాహిత్యంలో మనదేశం నుండి నోబెల్ బహుమతి పొందిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ అనంతరం సైన్స్ రంగంలో విజయ ఢంకా మ్రోగించిన అఖండ ప్రజ్ఞాశాలి రామన్ ఒక్కరే కావడం దేశానికి గర్వకారణం. రామన్ పరిశోధనలు సైన్స్ లో, పారిశ్రామిక రంగం లోనూ క్రొత్తపుంతలు త్రొక్కడానికి దారితీసింది. శాస్త్ర రంగంలో రామన్ స్పెక్ట్రో స్కోపీ ఆవిర్భావానికి "భారతరత్న", 1957 లో "లెనిన్ శాంతి బహుమతి" లభించాయి. కాంతి ప్రసరణ పై జరిపిన పరిశోధనలకు "నోబెల్ బహుమతి" లభించింది. స్వాతంత్ర్యం రాగానే రామన్ కు మొట్టమొదటి నేషనల్ ప్రొఫెసర్ గా ప్రభుత్వం నియమించి గౌరవించింది. 1948 లో బెంగళూరు లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ గా రిటైరయ్యారు. దృష్టి, కాంతి, ధ్వని, వర్ణాలు, ద్రవాల తలతన్యత, ఖనిజాలు, డైమండ్, క్రిస్టల్ తదితర అంశాలపై పరిశోధనలు జరిపిన సి.వి. రామన్ సుమారు 465 పరిశోధన పత్రాలను వెలువరించారు. వాటిని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సెన్స్ బెంగుళూరు వారు సేకరించి భద్రపరిచారు. 1949 లో బెంగుళూ రులో రామన్ రీసెర్చి ఇన్స్టిట్యూట్ స్థాపించి, 1970 నవంబరు 27 న ఆయన మరణించే వరకూ, ఆ సంస్థలో పరిశోధనలు జరిపి, మన దేశంలో సైన్స్ అభివృద్ధికి మార్గదర్శకు లయ్యారు. 1971 నవంబర్ 21 న సీ.వీ. రామన్ పోస్టేజి స్టాంపును భారత ప్రభుత్వం వెలువరించి ఆ మహా శాస్త్రజ్ఞుడిని గౌరవించింది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**




## దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి మా వద్ద లేరు.. హైకోర్టుకు తెలిపిన పోలీసులు

అమరావతి: మావోయిస్టులు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డిని కోర్టులో హాజరుపర్చేలా పోలీసులను ఆదేశించాలంటూ దాఖలైన హెబియస్‌కార్పస్ పిటిషన్‌పై ఏపీ హైకోర్టు విచారణ జరిపింది. వారిద్దరూ తమ వద్ద లేరని పోలీసులు ఉన్నత న్యాయస్థానానికి తెలిపారు. అరెస్టు చేసిన ఇతర మావోయిస్టులను సంబంధిత మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి పోలీసుల వద్ద ఉన్నారనేందుకు ఆధారాలను కోర్టు ముందు ఉంచాలని పిటిషనర్లను హైకోర్టు ఆదేశించింది. మావోయిస్టు కీలక నేతలు తమ ఆధీనంలో ఉన్నారని పోలీసులు ప్రెస్ స్టేట్‌మెంట్ ఇచ్చారని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. ప్రెస్ స్టేట్‌మెంట్‌ను కోర్టు ముందు ఉంచుతామన్నారు. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.





## కల్పవృక్ష వాహనంపై దర్శనమిచ్చిన శ్రీపద్మావతీ అమ్మవారు

**తిరుపతి: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగో రోజైన గురువారం అమ్మవారు కల్పవృక్ష వాహనంపై శ్రీ మురళీకృష్ణ అలంకారంలో భక్తులకు అభయమిచ్చారు. భక్తజన బృందాల భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారికి వాహనసేవ కన్నుల పండుగగా జరిగింది.**

చురకలు

## సంపాదకీయం

# హాట్ టాపిక్... పాక్ కు రష్యా సహకారంలో నిజం ఎంత?

పాకిస్థాన్ కు అగ్రరాజ్యం అమెరికా మద్దతుగా నిలుస్తుందనే చర్చ ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. పాక్ అధికారిక బ్యాచ్ మొత్తం నిత్యం అమెరికాతో సన్నిహిత సంబంధాలు నెరవేరుస్తూ.. ట్రంప్ తో రాసుకుపూసుకు తిరుగుతున్నారనే కామెంట్లు వినిపిస్తున్నాయి. అయితే... భారత్ తో అత్యంత సన్నిహితంగా ఉంటున్న రష్యా సైతం పాకిస్థాన్ కు సహకరిస్తుందనే కథనాలు ఇప్పుడు అత్యంత చర్చనీయాంశంగా మారాయి. అవును... భారత్ కు రష్యా అత్యంత సన్నిహిత వ్యాపార భాగస్వామిగా చెబుతారనే సంగతి తెలిసిందే. ఈ విషయాన్నే ప్రధాన కారణంగా చూపించి.. భారత్ పై అమెరికా పెద్ద ఎత్తున సుంకాలు విధించింది. రష్యాతో భారత్ వ్యాపారం ఉక్రెయిన్ తో యుద్ధానికి పరోక్ష మద్దతు అనే కామెంట్లూ చేసింది. ఈ సమయంలో పాకిస్థాన్ యుద్ధ విమానాలకు రష్యా ఇంజిన్లు సరఫరా చేస్తుందనే వార్తలు ఇప్పుడు అత్యంత హాట్ టాపిక్ గా మారాయి. వివరాల్లోకి వెళ్తే... పాకిస్థాన్ యుద్ధ విమానాల కోసం ఇంజిన్లను రష్యా సరఫరా చేస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వార్తలను మాస్కో కొట్టిపారేసింది. ఈ సందర్భంగా పాకిస్థాన్ తో తమకు అటువంటి ఒప్పందం ఏమీ జరగలేదని రష్యా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇదే సమయంలో... భారత్ తో పెద్ద ఎత్తున వాణిజ్య సంబంధాలను కొనసాగిస్తున్న నేపథ్యంలో.. ఈ తరహా ప్రచారాలు చేయడం సరికాదన్నాయి. అదేవిధంగా... భారతదేశానికి ఇబ్బందికరంగా మారే ఎలాంటి చర్యలు తాము చేపట్టబోమని రష్యా ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. అయినప్పటికీ ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తూనే ఉన్నాయని అంటున్నారు. మరో వైపు ఈ విషయం భారత్ లో మోడీ సర్కార్ పై విపక్షాల విమర్శలకు కారణమైంది. ఈ విషయంపై తాజాగా ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ స్పందించింది.. బీజేపీపై తీవ్ర విమర్శలు చేసింది. ఇందులో భాగంగా... రష్యాను అత్యంత సన్నిహితమైన వ్యాపర భాగస్వామిగా ఓ వైపు ప్రధాని మోడీ చెబుతారని.. కానీ, ఆ దేశం మాత్రం మన శత్రు దేశమైన పాకిస్థాన్ కు మద్దతునిస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేష్ ఆరోపించారు. ఇది ప్రధాని మోడీ వైఫల్యాన్ని సూచిస్తుందని అన్నారు. ఇదే సమయంలో... ప్రధాని మోడీ జాతీయ ప్రయోజనాలకంటే తనకు పేరు వచ్చే విషయాలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తారని జైరాం రమేష్ దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో... అసలు పాకిస్థాన్ కు రష్యా ఎందుకు సహకారం అందిస్తుందో మోడీ ప్రభుత్వం వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాలతో సంబంధాలను మెరుగుపరుచుకుంటున్నట్లు చెప్పే మోడీ.. దౌత్యం విషయంలో పాకిస్థాన్ ను ఇప్పటికీ ఒంటరిని చేయలేకపోతున్నారని విమర్శించారు. కాగా... పాకిస్థాన్ లో ఉన్న చైనా తయారీ జేఎఫ్-17 ఫైటర్ జెట్లలో వాడే ఆర్.డీ.-93ఎంఏ ఇంజిన్లను రష్యా సరఫరా చేస్తోందంటూ పలు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ విషయం అటు అంతర్జాతీయగానూ, ఇటు భారత్ లోనూ హాట్ టాపిక్ గా మారింది. అయితే ఈ విషయంపై పాక్ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు!

# మనవ జీవన విధానం పై టెలివిజన్ ప్రభావం - నవంబర్ 21...ప్రపంచ టెలివిజన్ దినం

1996 నవంబర్ 21, 22 తేదీలలో ఐక్యరాజ్య సమితి మొదటి ప్రపంచ టెలివిజన్ ఫోరమ్‌ను నిర్వహించింది, దీనిలో ప్రముఖ మీడియా ప్రముఖులు ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో సమావేశమై నేటి మారుతున్న ప్రపంచంలో టెలివిజన్ గురించి పెరుగుతున్న ప్రాముఖ్యతను చర్చించారు. అందుకే నవంబర్ 21ని ప్రపంచ టెలివిజన్ దినోత్సవంగా ప్రకటించాలని మహాసభ నిర్ణయించింది. అప్పటి నుండి నవంబర్ 21 న ప్రపంచ టెలివిజన్ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపు కుంటారు. టీవీ అద్భుతమైన ఆవిష్కరణలలో ఒకటి. మానవ జీవన విధానం పై ప్రభావాన్ని సృష్టించిన ఏకైక ఎలక్ట్రానిక్ మీడియా ఇది. టెలివిజన్" (దూర దర్శన్) అనునది సుదూర ప్రాంతాలకు ఒక మాధ్యమం ద్వారా చలన చిత్రాలను, ధ్వనిని ఒకేసారి గ్రహించగలిగే సాధనం. దీనిద్వారా దృశ్య, ధ్వని సమాచారాన్ని ఒకేసారి గ్రహించవచ్చు. ఇది నలుపు-తెలుపు, రంగుల్లో చిత్రాలను చూపించే సాధనం. టెలివిజన్ అనే పదమునకు మూలం లాటిన్, గ్రీకు పదాలు. "దూర దృష్టి" అనే అర్థం వచ్చే గ్రీకు పదం. టెలి అనగా దూరం, లాటిన్ పదం విజియో అనగా దృష్టి అని అర్థము. విద్యుత్ సహాయంతో వార్తల్ని పంపే టెలిగ్రాఫ్ కనుక్కోబడిన రోజుల్లోనే బొమ్మల్ని కూడా ఇలా పంపడానికి వీలవుతుందా అని అలెగ్జాండర్ బెయిన్ అనే స్కాట్?లాండ్ మనో వైజ్ఞానిక శాస్త్రజ్ఞుడు ప్రయత్నిం చాడు. దీనికోసం 1842 లో ఇతడు రూపొందించిన చిన్ని యంత్రాన్ని బేక్?వెన్ అయిదేళ్ళ తరువాత మెరుగు పరచాడు. ఈ యంత్రంలో ప్రసారిణి, రిసీవర్ అనే రెండు స్థూపాలుంటాయి. దాదాపు అర్థ శతాబ్దం తరువాత ఆర్థర్ కార్న్ అనే జర్మన్ భౌతిక శాస్త్రజ్ఞుడు ఈ పద్ధతిని మెరుగు పరిచాడు. ప్రసారిణిలో సూదికి బదులు పోటో ఎలక్ట్రిక్ సెల్ ని ఉపయోగించాడు. ప్రసారం చేయాల్సిన బొమ్మ వివిధ భాగలపై క్రమంగా కాంతిని పడనించాడు. ఇలా చేయడాన్ని "స్కానింగ్" అంటారు. వివిధ భాగాల కాంతి తీవ్రతలకు అనుగుణంగా విద్యుత్ ప్రవాహంలో మార్పులు సంభవిస్తాయి. ఈ విద్యుత్తును రిసీవర్కి పంపిస్తారు. మారుతున్న విద్యుత్ కి అనుగుణంగా ఇక్కడ ఓ చిన్న దీపం వెలుగుతూ, దాని కాంతి తీవ్రతలో హెచ్చు తక్కువలు ఏర్పడతాయి. తిరుగుతున్న స్థూపం చుట్టూ అతికించ బడిన ఫొటోగ్రాఫీ కాగితంపై ఈ కాంతి పడినప్పుడు ప్రసారిణిలో వుండే బొమ్మలాంటి ప్రతిబింబం నిర్మించ బడుతుంది. ఇలాంటి పద్ధతి ఇప్పుడు కూడా వినియోగిస్తున్నారు. పోలీసు శాఖకీ, వార్తాపత్రికలకీ ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంది. వార్తలకు సంబధించిన పోటోలను వివిధ నగరాల నుండి వెలువడే పత్రికల్లో ఏక కాలంలో ముద్రించటానికి ఈ పద్ధతి బాగా ఉపకరిస్తుంది. అమెరికా లోని కొన్ని పత్రికా సంస్థలు ఈ పద్ధతి ద్వారా మొత్తం వార్తా పత్రికలనే పేజీల వారీగా ప్రసారం చేయటం 1950 నుంచి వాడుకలో ఉంది. స్కానింగ్ విధానము దిశలో మొదటి ప్రయోగం 1883 లోనేజరిగింది. బెర్లిన్ విశ్వవిద్యాలయం లోని పోల్ నిప్ కో అనే విద్యార్థి కాస్త మొరటుగా




ఉండే స్కానింగ్ సాధనాన్ని నిర్మించాడు. ముఖ్యంగా రెండు ఆవిష్కరణలు అతని ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేశాయి. మొదటికి టెలిఫోన్. సెలెనియం అనే లోహంపై సూర్యకాంతి పడి నప్పుడు దానిగుండా విద్యుచ్ఛక్తి మరింత సులువుగా ప్రవహిస్తుందనే విషయాన్ని కనుక్కోవడం రెండోది. దీని ఆధారంగా నిప్కో ఫోటో ఎలక్ట్రిక్ సెల్ నిర్మించబడినది. సెలెనియం పై పడే కాంతి తీవ్రతలలో తేడాలను బట్టి విద్యుత్ ప్రవాహం మారుతుంది. గనుక ఒక దృశ్యాన్ని ఈ సిద్ధాంతం ఆధారంగా ప్రసారం చేయాలని నిప్ కో ప్రయత్నించాడు. దృశ్యాన్ని చిన్నచిన్న భాగాలుగా చేసి, వాటిని ఓ క్రమ పద్ధతిలో వేగంగా స్కాన్ చేయాలి. వాటి కాంతి తీవ్రతల తేడాను బట్టి ప్రవహించె విద్యుత్ పరిమాణంలో మార్పులు ఏర్పడతాయి. రిసీవర్ లో ఈ విద్యుత్తుని మళ్ళీ కాంతిగా మారిస్తే, తెరపై తొలిదృశ్యాన్ని నిర్మించవచ్చు. ఈ సిద్ధాంతం ఆధారంగా నిప్కో నిర్మించిన పరికరానికి విద్యుత్ దూరదర్శిని అని పేరు పెట్టారు. క్రూక్స్ అనే శాస్త్రజ్ఞుడు నిర్మించిన కాథోడ్ కిరణ నాళాన్ని స్ట్రాస్?బర్గ్ విశ్వ విద్యాలయంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ బ్రాన్ మెరుగుపరిచాడు. కిరణ నాళంలో ఒక వైపున వుండే తెరని కొన్ని రసాయనిక పదార్థాలతో పూస్తే దానిపై ఎలక్ట్రాన్ లు పడినపుడు కాంతివంతమైన చుక్కలు ఏర్పడతాయని బ్రాన్ కనుగొన్నాడు. బ్రాన్ నాళం అనబడే ఈ పరికరం 1897 లో తయారైంది. ఈ సూత్రం ఆధారంగానే జూలియన్ ఎల్?స్టర్, హాన్స్ గైటర్ అనే ఇద్దరు జర్మన్ శాస్త్రజ్ఞులు సెలెనియం కంటే అతి వేగంగా, సమర్థవంతంగా పనిచేసే ఫోటో ఎలక్ట్రిక్ సెల్ ని నిర్మించారు. స్కాట్లండ్ కు చెందిన ఓ క్రైస్తవ మతాధికారి కొడుకు జాన్ లోగీ బెయిర్డ్ కొన్ని ఆకారాల్ని సుమారు మూడు మీటర్ల దూరందాకా ప్రసారం చేయడంలో కృతకృత్యులయ్యాడు. తరువాతి పరిశోధనల ఫలితంగా 1925 అక్టోబరు 2 వ తేదీన ఓ కంపెనీలో పనిచేసే అబ్బాయి ముఖాన్ని ప్రసారంచేయగా, ఈ చిత్రాన్ని పక్క గదిలోని రిసీవర్లో చూడటం జరిగింది. కొన్ని నెలల తర్వాత, అతడు తన పరికరాన్ని వైజ్ఞానిక సంఘ సభ్యులకూ, పత్రికా విలేఖరులకూ ప్రదర్శించాడు. అనేక విఘ్నాలు ఏర్పడినా పార్లమెంట్ వత్తిడి మూలంగా 1929 లో బి.బి.సి ప్రయోగాత్మకంగా టెలివిజన్ కార్యక్రమాల్ని ప్రసారం చేయటం మొదలుపెట్టింది. టెలివిజన్ ప్రసారాల్ని క్రమంగా ప్రసారం చేయడం లండన్ లో 1936 నవంబర్ 2 వ తేదీన ప్రారంభమైనది. ఒక వారం ప్రసారం బెయిర్డ్ పద్ధతిలో జరిగితే మరుసటి వారం జ్యోరికిన్ పద్ధతిలో జరిగుతుండేవి. రెండు పద్ధతుల్ని మార్చి మార్చి వాడాక జ్యోరికిన్ పద్ధతినే తుదకు ఎన్నుకున్నారు. ప్రపంచ యుద్ధ కాలంలో అమెరికాలో టెలివిజన్ కు అంకురార్పణ జరిగింది. యుద్ధం ముగిసిన తరువాత టెలివిజన్ రిసీవర్ ల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. 1960 నాటికి దేశంలో మూడింట రెండు వంతుల జనాభా టెలివిజన్ కార్యక్రమాల్ని తిలకించటానికి వీలైంది. విన్న విషయాల కంటే కళ్లకు కట్టినట్టు చూసిన కార్యక్రమాల ప్రభావం మూలాన రేడియో తెరమరుగై, టెలివిజన్ విశ్వరూపం ధరించి ప్రపంచ మంతటా వ్యాపించటం మొదలైంది. ఆధునిక ప్రజాస్వామ్యంలో ఇది కీలక సాధనం. సాంకేతిక ప్రగతి ఊహించలేని స్థాయికి ఎదిగింది. చేయిలో ఉంచుకోవటానికి వీలైన పరిమాణంలో టెలివిజన్ సెట్ ని 1952 లో తయారు చేశారు. మొదట నలుపు తెలుపు దూరదర్శినిలు మాత్రమే వచ్చాయి. కొంతకాలానికి రంగుల దూరదర్శిని వాడకంలోకి వచ్చింది. - పెద్ద సాధారణ టీవీ నుండి స్మార్ట్, సొగసైన టీవీ వరకు టీవీ అసాధారణమైన వృద్ధిని సాధించింది. టీవీ సిగ్నల్స్ కూడా అనలాగ్ నుండి డిజిటల్ గా మార్చబడ్డాయి. ఈ రోజు %ఎణ% (హై డెఫినిషన్) టీవీ, ఐపిటివి, మొబైల్ టివి మరియు 3 డి టివి ఉన్నాయి. ఈ రోజు టీవీ ప్రసారం, కమ్యూనికేషన్, కంప్యూటర్ల కలయికకు ఇది ఒక అద్భుతమైన ఉదాహరణ. వెబ్ బ్రౌజింగ్, వీడియో కాల్స్ మరియు సోషల్ నెట్‌వర్కింగ్ చేయవచ్చు. భారత దేశంలో 1959లో టివి ప్రవేశించగా, 1961 లో ఉపాధ్యాయుల కోసం టెలివిజన్ కార్యక్రమాలు ప్రవేశ పెట్టబడ్డాయి. 1965 లో ఢిల్లీ ద్వారా ప్రతిరోజూ న్యూస్ బులెటిన్‌తో ఒక గంట సమయం, కొన్ని వినోద కార్యక్రమాలు కూడా ప్రారంభం అయినాయి. 1967 లో కృషి దర్శనం, గ్రామీణ, రైతుల కోసం కార్యక్రమాలు ఉన్నాయి. 1972 లో టీవీ సేవలు ముంబైకి విస్తరించ బడ్డాయి. 1975 నాటికి కలకత్తా, చెన్నై, శ్రీనగర్, అమృత్సర్, లక్నో వంటి నగరాల్లో కూడా టీవీ స్టేషన్లు ఉన్నాయి. 1975-76లో ఉపగ్రహ బోధనా టెలివిజన్ ప్రయోగం 2,400 గ్రామాలకు తీసుకువచ్చింది. ఏప్రిల్ 1, 1976 న, దూరదర్శన్ ఆల్ ఇండియా రేడియో నుండి విడిపోయింది. దూరదర్శన్ భారత ప్రభుత్వం నిధులు సమకూర్చిన స్వతంత్ర ప్రజా సేవా ప్రసారకర్త. భారత్‌లో టీవీ ప్రసారాలను 1972 లో ఢిల్లీ లో చిన్నగా భూస్థిత నెట్ వర్క్ ను ప్రస్తుతం దూదదర్శన్ ప్రారంభించి, 1984 నాటికల్లా కలర్ ప్రసారాలను ప్రవేశ పెట్టారు. రామాయణం, మహా భారత్, భారత్ ఏక్ ఖోజ్, రజని వంటి గొప్ప సిరీయళ్లను చూపారు. 1990 తరువాత అంతర్ జాతీయ చానల్స్ ఉపగ్రహ ప్రసారాలు ప్రారంభించినా 1995 లో ప్రాంతీయ చానల్స్ రాకతో కేబుల్ టీ.వి వ్యవస్థ ప్రారంభమైయింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల...9440595494**

# "శబ్దానికి శాశ్వత జీవం: థామస్ ఎడిసన్ ఫోనోగ్రాఫ్ విప్లవం" - 1877 నవంబర్ 21: మాటలకు శాశ్వత జీవం ఇచ్చిన ఎడిసన్ ఫోనోగ్రాఫ్ విప్లవం

1877 నవంబర్ ఇరవై ఒక్కటో తేదీ మానవ విజ్ఞాన చరిత్రలో ఒక అద్భుతమైన మలుపును తెచ్చింది. ఆ రోజు థామస్ అల్వా ఎడిసన్ తన ఫోనోగ్రాఫ్ ఆవిష్కరణను ప్రకటించాడు. అప్పటి వరకు మనిషి మాట్లాడే మాట, పాడే పాట, వాయించే సంగీతయ వాటి ధ్వని గాలిలో అలుముకుని మరుగునపడే క్షణిక అనుభూతి మాత్రమే. శబ్దాన్ని ఏదైనా వస్తువులో బంధించి, తిరిగి వినిపించడం అసాధ్యమని భావించిన దశలో ఎడిసన్ చేసిన ఈ ప్రయోగం మానవ మేధస్సు సరిహద్దులను తిరగరాసింది. శబ్దం గాలి తరంగాల రూపంలో కదులుతుంటే, ఆ తరంగాలు ఏదైనా పలకను కంపింప జేస్తాయని ఎడిసన్ గ్రహించాడు. ఆ కంపనం సూదిపై పడితే, సూది ఏదైనా మృదువైన లోహ పూతపై చిన్న గీతలను గీస్తుంది. ఈ గీతలే శబ్దపు గుర్తులు. ఇక అదే సూది ఆ గీతలను తిరిగి అనుసరిస్తే, మొదట వచ్చిన కంపనం మళ్లీ ఉత్పత్తి అవుతుంది. అలా అసలు శబ్దమే తిరిగి వినిపిస్తుంది. ఈ సరళమైన కాని విప్లవాత్మక సూత్రాన్ని ఆధారంగా తీసుకుని ఎడిసన్ ఫోనోగ్రాఫ్‌ను రూపుదిద్దాడు. టిన్-ఫాయిల్‌తో చుట్టిన సిలిండర్, దానిపై ఒక సూది, శబ్దాన్ని స్వీకరించే చిన్న డైఫ్రాగ్మ్ఇంత చిన్న యాంత్రిక వ్యవస్థలో మానవ స్వరాన్ని బంధించడమే ఆయన అద్భుతం. తన తొలి రికార్డింగ్‌గా "%మీుతీఎ ఝుస ఖ నాటశ్రీవ ఝుఎఎ%" అని చదివి, తర్వాత అదే తన పరికరం నుండి తిరిగి వినిపించినప్పుడు ప్రయోగశాలలో ఉన్న శాస్త్రవేత్తలు, సహాయకులు ఉలిక్కి పడ్డారు. శబ్దానికి చరిత్ర ఇచ్చిన క్షణం అదే. ప్రపంచం దానిని ఒక మంత్రదండం లాంటి ఆవిష్కరణగా చూసింది. శబ్దం ఇక క్షణికం కాదుఅమరమైనది అయింది. ఫోనోగ్రాఫ్‌తో కలిగిన ప్రభావం అపరిమితం. సంగీత ప్రపంచం కొత్త దశలోకి ప్రవేశించింది. అప్పటి వరకు సంగీతం ప్రత్యక్షంగా వినడం మాత్రమే సాధ్యంబీ కాని ఈ ఆవిష్కరణతో పాటలు, స్వరాలూ, కళాకారుల గాత్రాలూ కాలాన్ని దాటి భవిష్యత్ తరాలకు చేరే మార్గం తెరుచుకుంది. ఫోనోగ్రాఫ్ సూత్రం తర్వాత గ్రామోఫోన్ రికార్డులు, వినైల్ ప్లేట్లు, మాగ్నెటిక్ టేపులు, చివరకు డిజిటల్ శబ్ద సాంకేతికత వరకూ ఒక శ్రేణిగా అభివృద్ధి చెందింది. నేటి సంగీత పరిశ్రమ, రేడియో ప్రసారాలు, ఆడియో పుస్తకాలు, సినిమా డబ్బింగ్ వ్యవస్థఇవన్నీ ఫోనోగ్రాఫ్ అనే తొలి ఇటుకపై నిర్మించిన భవనం. సామాజికంగా కూడా దీని ప్రభావం విశాలం. రాజకీయ నాయకుల ప్రసంగాలు, శాస్త్రవేత్తల ఉపన్యాసాలు, మహోన్నత కళాకారుల స్వరాలు, పురాణ గాయకుల గానములు అన్నీ రికార్డింగ్ రూపంలో భద్రపడడం వల్ల చరిత్ర మరింత సజీవమైంది. విద్యా రంగంలో ఉపన్యాసాలు, పరిశోధనల్లో ప్రయోగ ధ్వనులు, న్యాయ పరిశోధనల్లో ప్రమాణ శబ్దాల నిక్షేపయఅన్నింటికీ ఫోనోగ్రాఫ్ సూత్రం ఆధారం. ప్రపంచ సంస్కృతిలో ఎన్నో తరాలు వినిపించేలా ఎవరి స్వరాన్నైనా సంరక్షించడం, కాలాన్ని అతికించుకుని గళాన్ని భవిష్యత్తుకు బదిలీ చేయడం అనే భావన ఈ ఆవిష్కరణ వల్లే సాధ్యమైంది. ఎడిసన్ చేసిన ఈ ఆవిష్కరణ కేవలం ఒక సాధనాన్ని సృష్టించడం కాదుబీ మానవ భావోద్వేగాన్ని, మాటను, సంగీతాన్ని కాలంతో పోరాడే శాశ్వత పాత్రలో నిలబెట్టడం. పరిశ్రమ విప్లవం ముగింపు దశలో, విజ్ఞాన శాస్త్రం ఉధృతమైన కాలంలో ఈ ఫోనోగ్రాఫ్



ప్రపంచానికి కొత్త ఇంద్రియాన్ని ఇచ్చిందిశబ్ద సంరక్షణ అనే ఇంద్రియాన్ని. నేడు మనం వినే ప్రతి పాట, ప్రతి ప్రసంగం, ప్రతి శబ్ద రికార్డింగ్ వెనక ఈ ఒకే ఆవిష్కరణ నిలబడి ఉందని గుర్తిస్తే ఎడిసన్ ప్రతిభ ఎంత మహత్తరమో తెలుస్తుంది. 1877 నవంబర్ 21న జరిగిన ఆ ప్రకటన ప్రపంచాన్ని కొత్త శబ్దయుగం వైపు నడిపిన తీర్మానమైన రోజు. శబ్దాన్ని కేవలం వినడమే కాక, దాన్ని నిలిపి పెట్టి తిరిగి వినగలుగుతున్నామంటే, అది ఫోనోగ్రాఫ్ అనే ఆ మహోన్నత ఆవిష్కరణ వల్లే. శాస్త్రం, సాంకేతికత, సంస్కృతిఇవన్నింటి మధ్య దారిని కలిపిన అద్భుత సేతుసమం ఫోనోగ్రాఫ్. మానవ చరిత్రలో శబ్దం శాశ్వతమై నిలిచిన ఘట్టయఅదే ఎడిసన్ ఫోనోగ్రాఫ్ జననం.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# స్వాతంత్ర్య ముద్ర భారత తొలి తపాలాబిళ్ళ

## స్వతంత్ర భారత తొలి సందేశం మూడు అణాల బిళ్ళలో ముద్రిత గౌరవం - భారత సార్వభౌమత్వపు మొదటి ముద్రఔ% చారిత్రక తపాలా బిళ్ళ

## 1947 నవంబర్ 21... స్వతంత్ర భారత దేశపు మొట్ట మొదటి తపాలా బిళ్ళ విడుదలయిన దినం




1947లో భారతదేశం బ్రిటీష్ పాలన సంకెళ్లను తెంచుకొని స్వతంత్ర దేశంగా అవతరించిన క్షణం దేశ చరిత్రలో ఒక మహత్తర మైలురాయి. ఈ స్వాతంత్ర్య భావాన్ని ప్రపంచానికి తెలిపే తొలి అధికారిక చిహ్నం 1947 నవంబర్ 21న విడుదలైన స్వతంత్ర భారత దేశపు మొదటి తపాలా బిళ్ళ. కేవలం మూడున్నర అణాల విలువ మాత్రమే ఉన్న ఈ చిన్న కాగితపు బిళ్ళ, స్వతంత్ర భారత్ తొలి శ్వాసను ముద్రించిన చారిత్రక నిధిగా నిలిచింది. స్వాతంత్ర్య ఉద్యమంలో లక్షలాది మంది ప్రాణ త్యాగాలు, పోరాటాలు, దేశభక్తి జ్వాలలు భారత దేశాన్ని కొలమానం లేని మార్పులకు నడిపించాయి. అటువంటి సమయంలో కొత్త దేశం స్వయం గౌరవాన్ని ప్రతిబింబించే అధికారిక చిహ్నాలను రూపొందించడం, వాటిని ప్రపంచానికి తెలియ జేయడం అత్యంత ప్రధానమైన పని. అందుచేత స్వతంత్ర భారతం మొదటగా ప్రకటించిన చిహ్నాలలో తపాలా బిళ్ళ ముఖ్యమైనది కావడం యాదృచ్ఛికం కాదుబీ అది సార్వభౌమ దేశం తన కొత్త యుగాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన మొదటి సాక్ష్యం. బ్రిటీష్ పాలనలో దేశంలో వినియోగంలో ఉన్న బిళ్ళలన్నీ బ్రిటీష్ చక్రవర్తుల చిత్రాలు, రాజ చిహ్నాలు, సామ్రాజ్య ప్రతీకలతో నిండిపోయి భారత దేశపు స్వరూపాన్ని మరుగున పడేలా చేశాయి. అటువంటి కాలం ముగిసిన వెంటనే స్వదేశీ చిహ్నాలతో కూడిన బిళ్ళను విడుదల చేయాలనే నిర్ణయం భారతదేశం యొక్క ఆత్మాభిమానాన్ని, స్వాతంత్ర్యానంతర దిశను స్పష్టంగా ప్రపంచానికి చూపించింది. అశోక స్తంభంపై నిలిచిన నాలుగు సింహాలలో మూడు మాత్రమే ముందుకు కనిపించే ప్రతిరూపం, క్రింద ధర్మచక్రం, '%×చీణ×ూా%' అనే పదనామయి ఈ మూడు అంశాలు ఈ తపాలా బిళ్ళను భారతీయ నాగరికత, ధర్మపరమైన విలువలు, శక్తి, నీతి, ప్రజాస్వామ్య ఆశయాలు, సార్వభౌమ అధికారం అన్నింటినీ ప్రతిబింబించే ప్రతీకగా నిలబెట్టాయి. స్వాతంత్ర్యం అనంతరం కొత్త ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే ఈ డిజైన్‌ను తుది రూపమిచ్చి, సాంకేతిక పరిశీలనలు పూర్తిచేసి, న్యూఢిల్లీ నేషనల్ ప్రెస్‌లో ముద్రణ నిర్వహించడం దేశ పరిపాలనా సామర్థ్యానికి తొలి పరీక్షగా నిలిచింది. ఈ చిన్న బిళ్ళ తయారీ వెనుక ఉన్న క్రమశిక్షణ, సమయ పాలన, ఆత్మ గౌరవం, దేశీయతుఇవి అన్నీ భారత పరిపాలన యొక్క కొత్త దిశను సూచించాయి. బిళ్ళ విడుదలైన రోజే దేశవ్యాప్తంగా ఉన్న తపాలా కేంద్రాల వద్ద ప్రజలు పెద్ద క్యూలు కట్టి వాటిని కొనుగోలు చేయడం స్వతంత్రతపై ఉన్న ప్రజాభిమానాన్ని సూచించింది. ఇది కేవలం బిళ్ళ కాదని, కొత్త దేశం తొలి ఊపిరి, తొలి అధికారిక గుర్తు అని భావించి వేలాది మంది ప్రజలు వినియోగించకుండా జ్ఞాపకంగా భద్ర పరిచారు. తద్వారా ఆ రోజున విడుదలైన ఫస్ట్ డే కవర్లు నేడు భారత ఫిలాటెలిక్ చరిత్రలో అత్యంత విలువైన సంపదగా నిలిచాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఫిలాటెలిక్ పరిశోధకులు ఈ బిళ్ళను కేవలం పోస్టల్ అంశంగా కాకుండా, స్వతంత్ర భారతం ఆవిర్భావాన్ని ముద్రించిన సాక్ష్య పత్రంగా పరిగణిస్తున్నారు. ఈ బిళ్ళలో ప్రతిఫలించిన అశోక చక్రం తరువాత భారత జాతీయ పతాకంలో, అధికారిక ప్రభుత్వ చిహ్నాల్లో, పార్లమెంట్ పత్రికలలో, న్యాయ వ్యవస్థ ముద్రల్లో కీలక చిహ్నంగా స్థిరపడటం ఈ బిళ్ళ చరిత్రాత్మకతకు మరింత బలం చేకూర్చింది. నేడు అసలు 1947 తపాలా బిళ్ళను కనుగొనడం చాలా కష్టసాధ్యం. దొరికినా ఫిలాటెలిక్ వేలాలలో లక్షల్లో అమ్ముడవుతుంది. అయితే దాని విలువ దాని ఆర్థిక ధరలో లేదుబీ స్వతంత్ర భారత తొలి క్షణాన్ని, కొత్త యుగాన్ని, సార్వభౌమ దేశ భావజాలాన్ని ప్రతిబింబించే చిహ్నంగా నిలిచిన చారిత్రక మహత్తులో ఉంది. 1947 నవంబర్ 21న విడుదలైన మూడున్నర అణాల ఈ బిళ్ళ భారత స్వాతంత్ర్యానికి ముద్ర, కొత్త దేశ ఆవిర్భావానికి తొలి గుర్తు, ప్రపంచానికి భారత ప్రకటించిన తొలి అధికారిక పరిచయం. ఈ బిళ్ళలో భారత ఆత్మగౌరవం చిరస్థాయిగా ముద్రించబడి ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# చెత్తకూ ఉందో.. లెక్క

చెన్నూరు : స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇళ్ల నుంచి సేకరించే చెత్తతోపాటు దుకాణాల ద్వారా ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలకు ఇకపై పక్కాగా లెక్క ఉండేలా చర్యలు చేపట్టనున్నారు. చెత్త పరిమాణం ఆధారంగా వాణిజ్య కేంద్రాలను విభాగాలుగా వర్గీకరించనున్నారు. ప్రాంతాన్ని బట్టి వాణిజ్య కేంద్రాల్లో చెత్త ఉత్పత్తిని లెక్కించి బల్దియాలకు రుసుము రూపంలో అదనపు ఆదాయం రాబట్టే పద్ధతికి శ్రీకారం చుట్టనున్నారు.

**క్యూఆర్ కోడ్‌తో**

పురపాలక సంఘాల్లో నివాస గృహాలను ఇదివరకే జియో ట్యాగింగ్ చేపట్టి మ్యాపింగ్ చేశారు. నగరపాలికల్లో మాదిరిగా ఇకపై వాణిజ్య ప్రాంతాల్లో చెత్తసేకరణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ప్రతీ దుకాణాన్ని గుర్తించి జియోట్యాగింగ్‌లో పొందుపర్చిన లెక్కల ఆధారంగా క్యూఆర్‌కోడ్ కేటాయించి, మ్యాపింగ్ చేయనున్నారు. ప్రైవేటు సంస్థలు, దుకాణాలు, ఆసుపత్రులు, సూపర్‌మార్కెట్లు, ఆలయాలు, చర్చిలు, మసీదులు, హోటళ్లు, తదితర దుకాణాలకు క్యూఆర్ కోడ్ ఏర్పాటుకు బల్దియాల్లో కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఏయే దుకాణం నుంచి



ఎంత చెత్త వస్తుందో లెక్కలు వేసి రుసుము విధించనున్నారు. ఆయా బల్దియాల్లో ఉత్పత్తి అవుతున్న తడి చెత్తతో ఎరువు తయారీ చేపట్టాలని నిర్ణయించారు.

**స్వచ్ఛత దిశగా అడుగులు**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంచిర్యాల నగరపాలక సంస్థ, పాత పురపాలక సంఘాలైన ఆదిలాబాద్, బెల్లంపల్లి, నిర్మల్, భైంసా బల్దియాలు స్వచ్ఛసర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకులు తెచ్చుకునేందుకు పోటీ పడుతున్నాయి. రోడ్లపై చెత్తపారేయకుండా కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించారు. దుకాణాల నుంచి చెత్తసేకరణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని భావిస్తున్నారు.

**చెత్త ఉత్పత్తి, సేకరణపై నియంత్రణ అవసరం**


ఉదయ్‌కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, చెన్నూరు

పట్టణాల్లో చెత్త ఉత్పత్తి, సేకరణపై నియంత్రణ అవసరం. ఎవరికివారు ఇళ్లల్లో తక్కువ చెత్త ఉత్పత్తి చేసేలా స్వీయ నియంత్రణ పాటించాలి. వ్యాపార సముదాయాల వారు స్వచ్ఛత దిశగా అడుగులు వేసేందుకు బల్దియా సిబ్బందికి తోడ్పాటు అందించాలి.

# భూ వివాదాలు.. సర్వేపై ఆశలు!

ఆదిలాబాద్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆక్రమిత అటవీ, రెవెన్యూ భూముల సమస్య ఏళ్ల తరబడి ఉంది. జిల్లా మొత్తంలో 83 వేల ఎకరాల భూమి ఆక్రమణకు గురైనట్లు అటవీ శాఖ ప్రాథమిక అంచనాకు వచ్చింది.. సమస్య ఉన్న ప్రాంతాల్లో సర్వే నిర్వహించాలని రైతులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వివాదాలను పరిష్కరించడంతో పాటు రైతులకు ప్రత్యేకంగా భూధార్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. ఇప్పటికే 71 గ్రామాల్లో రీ సర్వేకు ఆదేశించగా.. ప్రయోగాత్మకంగా మరో 70 గ్రామాల్లో సర్వే చేయాలని ఆదేశాలు జారీ చేసింది.గతంలో ఉన్న రికార్డుల మేరకు హద్దులు గుర్తిస్తుండటంతో రైతులు, అటవీ అధికారుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. తాజాగా ప్రభుత్వం సర్వేయర్లను నియమిస్తుండటంతో భూ వివాదాలను పరిష్కరిస్తారని ఆశిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో అటవీ శాఖ పరిధిలోని భూములకు రెవెన్యూ శాఖ పట్టాలు కూడా జారీ చేసింది. అనేక గ్రామాల్లో రైతులు తమ దగ్గర ఉన్న పట్టాలు చూపుతుండటంతో ఏం చేయాలో తెలియక అటవీ శాఖ అధికారులు వెనుదిరుగుతున్నారు. జిల్లాలో 35.08 లక్షల ఎకరాల భూమి ఉండగా, అందులో 12.02 లక్షల ఎకరాలు అటవీ శాఖవిగా తేల్చారు. ఆ ప్రకారం క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే.. అనేక గ్రామాల్లో రైతులు ఆందోళన చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 35,525 ఎకరాల అటవీ భూములకు రెవెన్యూ శాఖ పట్టాలు జారీ చేయగా, అవి బోగస్ పట్టాలని అటవీ శాఖ పేర్కొంటోంది.ప్రభుత్వ ధరణిని రద్దు చేసి భూ



భారతి పేరుతో తిరిగి పోర్టల్‌ను ప్రవేశపెట్టింది.. కొత్తగా సర్వేయర్లను నియమించింది. వివాదాలు, సరిహద్దు సమస్యలు ఉండొద్దని, రిజిస్ట్రేషన్ కంటే ముందే సర్వే నిర్వహించి డిజిటల్ మ్యాప్ తప్పనిసరి చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 37,181 మంది రైతులు అటవీ ప్రాంతంలో సాగు చేసుకుం టున్న 1.35 లక్షల ఎకరాలకు గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అటవీ హక్కు పత్రాలు ఇచ్చారు. వాటిని వారసుల పేరిట మార్చాలని ఏళ్లుగా గిరిజనులు కోరుతున్నారు. ఇవేగాకుండా మరో 12 వేల మంది గిరిజన రైతులు 50 వేలకు పైగా ఎకరాల్లో పంటలు పండిస్తు న్నారు. వీటికి ఏ పత్రాలు లేవు. వాటిని తమ భూములుగా అటవీ శాఖ స్వాధీనం చేసుకుంటోంది. వీటికీ పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

## వామ్మో.. చలి.. పులి

ఆదిలాబాద : ఉమ్మడి జిల్లాలో చలి పులి పంజా విసురుతోంది. వారం కిందట 15 డిగ్రీలు ఉన్న ఉష్ణోగ్రత సోమవారం 7.0 డిగ్రీలకు పడిపోయింది. కుమురంభీం జిల్లాలోని సిర్పూరు(యు) రాష్ట్రంలో అత్యల్పంగా 7.0 డిగ్రీలుగా నమోదైంది. దీంతో ప్రజలు ఎటూ వెళ్లలేక ముసుగు కప్పి ఇంట్లోనే ఉండిపోతున్నారు. ఉదయం 7 గంటలు దాటుతున్నా సూర్యుడు కనిపించని పరిస్థితి. తెల్లవారుజామున మంచు కురుస్తుండటంతో పనుల నిమిత్తం బయటికి వెళ్లే వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గాలిలో తేమ శాతం పెరిగిపోవడం, వాతావరణంలో వచ్చిన మార్పులతో చలి తీవ్రత పెరిగిందని శాస్త్రవేత్తలు అంటున్నారు. సాధారణంగా జనవరిలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అలాంటిది ఈ ఏడాది నవంబర్‌లోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

# అవిశ్రాంతంగా పనిచేసినా.. కష్టాలు శేషమే!



కామారెడ్డి : వారంతా సుదీర్ఘకాలం పాటు ప్రభుత్వ శాఖల్లో అవిశ్రాంతంగా సేవలందించారు. పదవీ విరమణ పొందాక శేష జీవితం సంతోషంగా గడుపుదామనుకున్నారు. కానీ, ప్రభుత్వ నిర్లక్ష్యంతో వారికి నిరాశే మిగులుతోంది. సర్కారు నుంచి ఆర్థిక ప్రయోజనాలు అందక మనోవేదనకు గురవుతున్నారు. పిల్లల వివాహాలు, ఇంటి రుణాలు, ఇతర అవసరాలకు సొమ్ము అందడం లేదని, దీంతో ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటూ మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అన్ని ప్రభుత్వ విభాగాల్లో ప్రతినెలా 60 మందికి పైగా పదవీ విరమణ పొందుతున్నారు. కేడర్(స్థాయి)కు అనుగుణంగా ఒక్కో విశ్రాంత ఉద్యోగికి రూ.35 లక్షల నుంచి రూ.85 లక్షలు అందాలి. ఈ లెక్కన ఏటా రూ.210 కోట్ల నుంచి రూ.600 కోట్ల దాకా సర్కారు చెల్లించాల్సి ఉంది.

**వైద్య సేవలు కరవు**

విశ్రాంత ఉద్యోగులకు ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స అందించాలి. ప్రతినెలా వందల సంఖ్యలో పదవీ విరమణ చేసినవారు వివిధ ఆరోగ్య సమస్యలతో హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు వెళుతున్నారు. ప్రభుత్వ ప్రయోజనాలు అందక అక్కడ రూ.లక్షల సొంత డబ్బును ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వానికి గతంలో సమర్పించిన బిల్లులూ అపరిష్కృతంగానే ఉన్నాయని విశ్రాంత ఉద్యోగులు వాపోతున్నారు.

విశ్రాంత ఉద్యోగులు ఒక్కొక్కరు రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు బ్యాంకు రుణం తీసుకుని ఇళ్లు నిర్మించుకున్నారు. వాటికి నెలనెలా రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు ఈఎంఐ చెల్లించాలి. దీనికి తోడు పిల్లల చదువులు, వివాహాలకు రూ.లక్షల్లో ఖర్చు అవుతోంది.

పదవీ విరమణ చేసిన వారికి ప్రభుత్వం నెల రోజుల్లో పూర్తి బకాయిలు చెల్లించాలని కామారెడ్డి విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్. విఠల్‌రావు కోరారు.

"ఈయన పేరు మధుసూదన్‌రావు. ఉపాధ్యాయుడిగా పనిచేసి 2024లో పదవీ విరమణ పొందారు. ఇతనికి రూ. 50 లక్షల వరకు జీపీఎఫ్ రావాలి. ఇంతవరకూ మంజూరు కాలేదు. ఇంటి నిర్మాణం కోసం తీసుకున్న రుణానికి ప్రతినెలా రూ.35 వేలు ఈఎంఐ చెల్లించాలి. ఇద్దరు పిల్లల్లో ఒకరికే వివాహం జరిగింది. మరొకరికి వివాహం చేయాలి. ప్రభుత్వం నుంచి పదవీ విరమణ ప్రయోజనాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు"

# నిరభ్యంతరంగా.. చెరపట్టారు..!



కామారెడ్డి : భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలో సర్వే నం.936లో ఎసైన్డ్ భూమి ఉంది. ఇందులోని 161 ఎకరాలను ప్రభుత్వం గతంలో నిరుపేదలకు పంపిణీ చేసింది. ఆ భూమి కొన్నేళ్లుగా పేద రైతులు సాగు చేసుకుంటున్నారు. ఈ స్థలంపై ఓ రెవెన్యూ ఉద్యోగి కన్ను పడింది. పేదలకు కొంత ముట్టజెప్పాడు. 21 ఎకరాలను తన బినామీల పేరిట కొనుగోలు చేశాడు. 2017-18లో ఆ బినామీల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నాడు. తర్వాత 2021-22లో ఆ స్థలానికి నిరభ్యంతర పత్రాలు(ఎన్వోసీ) తీసుకుని 16 ఎకరాలను పట్టా చేసుకున్నాడు.

ఎన్నేళ్లైనా.. ఏ ఊళ్లోనైనా భూమి విస్తీర్ణం ఎప్పటికీ పెరగదు. కామారెడ్డి జిల్లాలో మాత్రం పట్టా భూముల విస్తీర్ణం గత ఐదేళ్లుగా పెరుగుతూనే ఉంది. వింతగా అనిపిస్తున్నా.. ఇది నిజం! అధికారుల అండదండలతో అక్రమార్కులు చేస్తున్న మాయాజాలం!! ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన రెవెన్యూ శాఖలోని కొందరు అధికారులు కంచే చేను మేస్తున్న చందంలా వ్యవహరిస్తున్నారు. సర్కారు స్థలాలకు ఎన్వోసీలు జారీ చేస్తూ వాటిని ఆక్రమిస్తున్నారు. చిన్న లోపాలను అడ్డం పెట్టుకుని అక్రమార్కులకు వంత పాడుతున్నారు. జిల్లాలో గడిచిన ఐదారేళ్లలో 200 ఎకరాలకు పైగా భూములకు ఉన్నతాధికారులు ఎన్వోసీలు జారీ చేశారు. వాటిలో కొన్ని ఎకరాలను కొందరు.. పేదలకు కొంత ముట్టజెప్పి తమ వశం చేసుకున్నారు. దీంతో జిల్లాలో పట్టా భూమి పెరిగింది. అనర్హులు ప్రభుత్వ స్థలాలను సొంతం చేసుకున్నారు.

**ఆర్ఎస్ఆర్ కంటే అధికంగా..**రెవెన్యూ సెటిల్‌మెంట్ రికార్డ్(ఆర్ఎస్ ఆర్).. ఒక సర్వే నంబర్‌లో ఎంత భూమి ఉందో కచ్చితంగా సూచిస్తుంది. భూ రికార్డుల మార్పులు చేసినప్పుడు ఆ వివరాలను ఆర్ఎస్ఆర్‌లో నమోదు చేస్తారు. వీటిని గతంలో మాన్యువల్‌గా నమోదు చేసేవారు. ఇప్పుడు భూభారతిలో డిజిటల్ విధానం ద్వారా నమోదు చేస్తున్నారు. ఒక సర్వే నంబర్‌లో ఎన్ని ఎకరాల భూమి ఉంటే అన్ని ఎకరాలు మాత్రమే నమోదు చేయాలి. అంతకంటే అధికంగా నమోదు చేయడానికి వీలుపడదు. జిల్లాలోని చాలా గ్రామాల్లో ఆర్ఎస్ఆర్‌లో నమోదైన విస్తీర్ణం కంటే ఎక్కువగా నమోదు చేశారు. ఇలా జిల్లాలో ఎసైన్డ్ భూవిస్తీర్ణం పెరిగినట్లయింది. జిల్లాలో 2020-22 మధ్యకాలంలో జారీ చేసిన 34 నిరభ్యంతర పత్రాల్లో 25 నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసినవే. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ చేపడితే అక్రమార్కుల బాగోతం వెలుగుచూసే అవకాశముంది.

# గ్రంథాలయాల్లో.. సమస్యల పుటలు

ఎడపల్లి :గ్రంథాలయం.. పుస్తకగని.. ఉద్యోగార్థులకు వరం.. నిత్యం చాలా మంది వస్తుంటారు.. కొందరు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతుంటారు.. మరికొందరు పుస్తక పఠనం చేస్తుంటారు.. అయితే విజ్ఞాన భాండాగారాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కిరాయి భవనాల్లో అరకొర వసతుల నడుమ కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రస్తుతం గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రతినిధులు పరిశీలన చేసి ఇస్తున్న కథనమిది.రెంజల్ లైబ్రరీకి చదువుకునేందుకు గతంలో 50 మందికి పైగా వచ్చేవారు. ప్రస్తుతం ఇరుకైన కిరాయి గదిలో కొనసాగుతుండటంతో ఆ సంఖ్య 25కు పడిపోయింది. రెండున్నర ఏళ్లుగా ఇదే పరిస్థితి ఉంది. పక్కా భవనం నిర్మించినా ప్రారంభానికి నోచుకోలేదు. 50 కుర్చీలు అవసరం ఉండగా.. 22 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇరుకైన కిరాయి భవనం కావడంతో కుర్చీలు అటకెక్కాయి. కావాల్సిన పుస్తకాలు అందుబాటులో లేక ఉద్యోగార్థులు వెనుదిరుగుతున్నారు. పాఠకుల సౌకర్యార్థం మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. ఈ విషయమై గ్రంథపాలకుడు సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. 'కుర్చీలు, పుస్తకాల అవసరాన్ని గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్‌తో పాటు జిల్లా అధికారి దృష్టికి తీసుకెళ్లాం. నూతన భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. పుస్తకాలు భద్రపరిచేందుకు ర్యాక్‌ల అవసరాన్ని విన్నవించాం' అని చెప్పారు.

**అందుబాటులోకి రాక..**

నవీపేట లైబ్రరీకి చదువుకునేందుకు రోజూ 40 మంది వస్తారు. గ్రంథాలయ ప్రాంగణంలో నిర్మించిన మూత్రశాలలు, మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. వీటిని నూతనంగా నిర్మించగా ఇప్పటి వరకు వినియోగంలోకి తీసుకురాలేదు. ప్రస్తుతం ఉన్న గది ఇరుకుగా మారడంతో పాఠకులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయమై గ్రంథపాలకుడు సందీప్ మాట్లాడుతూ.. 'ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మూత్రశాలలు, మరుగుదొడ్లతో పాటు పైఅంతస్తులో నిర్మించిన గదిని అందుబాటులోకి తెచ్చేలా చూస్తాం' అని చెప్పారు.

**ఇరుకు గదుల్లో అవస్థలు**నందిపేట గ్రంథాలయానికి నిత్యం 25 నుంచి 30మంది వస్తుంటారు. ఇది కిరాయి భవనంలో కొనసాగుతోంది. సొంత భవనం లేకపోవడంతో పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. ఇరుకు గదుల్లో కూర్చోవడానికి అవస్థలు పడుతున్నారు. ఈ భవనం రోడ్డు పక్కనే ఉండటంతో వాహనాల శబ్దంతో పఠనంపై దృష్టి పెట్టలేకపోతున్నారు. ఈ విషయమై గ్రంథపాలకురాలు నిర్మలా మాట్లాడుతూ.. 'ప్రభుత్వం సొంత భవనం నిర్మిస్తామని చెప్పింది, పాఠకులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం' అని చెప్పారు.

**శివారు ప్రాంతం.. కిరాయి భవనం**

బీర్కూర్‌లో 30 ఏళ్ల కిందట నిర్మించిన లైబ్రరీ శిథిలావస్థకు చేరింది. వర్షం కురిసిన ప్రతిసారి నీరు లోపలికి చేరుతోంది. దీంతో ఏడాది కిందట గ్రామ శివారులోని కిరాయి భవనంలోకి మార్చారు. నెలకు రూ.6 వేలు కిరాయి చెల్లిస్తున్నారు. పాత భవనంలో లైబ్రరీ కొనసాగినప్పుడు నిత్యం 100 మంది పాఠకులు వచ్చేవారు. శివారు ప్రాంతానికి మార్చడంతో ఆ సంఖ్య 50కి పడిపోయింది. ఈ విషయమై ఇన్‌ఛార్జి గ్రంథపాలకుడు హమీద్ మాట్లాడుతూ.. 'కొత్త భవనం నిర్మించాలని జిల్లా అధికారులకు విన్నవించాం' అని చెప్పారు.

**రద్దీకి అనుగుణంగా లేని ఫర్నిచర్**

కామారెడ్డి జిల్లా గ్రంథాలయంలో డిజిటలైజేషన్ చేస్తామన్నా ఇప్పటి వరకు చర్యలు లేవు. కలెక్టర్‌గా సత్యనారాయణ పనిచేసినప్పుడు గ్రంథాలయ నూతన భవనాలు నిర్మించారు. అన్ని గదుల్లో అధునాతన ఫర్నిచర్, ఏసీలు ఏర్పాటు చేశారు. అయితే రద్దీకి అనుగుణంగా ఇక్కడ ఫర్నిచర్ సరిపోవడం లేదు. వరండాలో కూర్చుని చదువుకునే పరిస్థితి ఉంది. తినడానికి వీలుగా భోజనశాలలు లేవు. గ్రంథాలయం పక్కనే ఉన్న ఉద్యానంలో కూర్చొని తింటున్నారు. వాహనాల పార్కింగ్‌కు షెడ్లు లేవు. ఈ విషయమై గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ..'గ్రంథాలయాల అభివృద్ధికి దాతల సాయంతో వసతులు కల్పిస్తున్నాం. పుస్తకాలు, ఫర్నిచర్ కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం' అని చెప్పారు.**నీటి వసతి లేదు**ఎడపల్లి గ్రంథాలయానికి రోజూ చదువుకునేందుకు సుమారు 50 మంది వస్తుంటారు. ఇక్కడ నీటి వసతి లేక మూత్రశాల లు, మరుగుదొడ్లు వినియోగంలో లేవు. దీంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రకాల పోటీ పరీక్షల పుస్తకాలు కూడా అందుబాటులో లేవు. ప్రహరీ నిర్మాణం ఇప్పటి వరకు చేపట్టలేదు. ఈ విషయమై ఇన్‌ఛార్జి గ్రంథపాలకుడు గంగాధర్ మాట్లాడుతూ.. 'నీటి వసతి లేదన్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నీటి వసతి ఏర్పాటు చేస్తే మూత్రశాలలు, మరుగుదొడ్డిని వినియోగంలోకి తీసుకురావొచ్చు' అని చెప్పారు.**ఉమ్మడి జిల్లా వివరాలు**శాఖ గ్రంథాలయాలు : 43

గ్రామీణ : 30 రోజూ గ్రంథాలయాలకు వచ్చే పాఠకుల సంఖ్య : 4500కిరాయి భవనాల్లో కొనసాగేవి : 16

# తడోబా.. చూసొద్దామా!

బల్లార్ష: దేశంలోనే ప్రసిద్ధి చెందిన అభయారణ్యాల్లో తడోబా ఒకటి. ఇక్కడ పదుల సంఖ్యలో ఉన్న పులులు, ఇతర వన్యప్రాణులను ప్రత్యక్షంగా చూసి పర్యాటకులు పరవశించి పోతుంటారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలో 1727.59 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కొలువుతీరిన ఈ అభయారణ్యాల్లో బఫర్, కోర్ జోన్లుగా విభజించారు. మధ్యభాగంలో 623 చదరపు కిలోమీటర్ల ప్రదేశంలో కోర్ జోన్ ఏర్పాటు చేశారు. ఈ జోన్‌లో కేవలం పులులతో పాటు ఇతర జంతువులు మాత్రమే సంచరిస్తుంటాయి. దీనికి చుట్టుపక్కల మిగిలిన ప్రాంతమంతా బఫర్ జోన్‌గా పిలుస్తారు. ఈ ప్రాంతంలో జనజీవనం ఉంటుంది. 2019 లెక్కల ప్రకారం.. ఈ అభయారణ్యాలలో 115 పులులు ఉన్నాయి.

**పర్యటించే సమయం:** అభయారణ్యాలలోని ప్రధాన ద్వారాల నుంచి ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు సంచరించే అవకాశం ఉంటుంది. మంగళవారం కోర్ జోన్‌లో, బఫర్‌జోన్‌కు సెలవు. దీంతో పాటు ఏటా జులై నుంచి సెప్టెంబరు వరకు వర్షాకాలంలో పర్యాటకులను అనుమతించరు.



**ప్రధాన ద్వారాలు:** పర్యాటకులు కోర్ జోన్‌లో పర్యటించి ప్రత్యక్షంగా పులులను తిలకించేందుకు దీని చుట్టుపక్కలా.. మొహర్లీ, కోలార, నవేగావ్, కుటేవాడా, ఝరీ, పంగడి అనే ప్రాంతాలలో ఆరు ప్రధాన ద్వారాలు ఏర్పాటు చేశారు. టికెట్లను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారు వీటి వద్ద నుంచి అభయారణ్యాలు ఏర్పాటు చేసిన టాప్‌లెస్ ప్రత్యేక జిప్సీలలో గైడ్‌తోపాటు పర్యటించే అవకాశం కల్పిస్తారు. నాగ్‌పూర్ ద్వారా వచ్చే పర్యాటకులకు కోలార, నవేగావ్, ఝరీ గేట్లు అనుకూలంగా ఉంటాయి.

**ఇలా చేరుకోవచ్చు**

హైదరాబాద్ నుంచి దిల్లీ వెళ్లే రైలు మార్గంలో చంద్రపూర్ స్టేషన్‌లో దిగాల్సి ఉంటుంది. అక్కడ నుంచి 40 కి.మీ. దూరంలో కోర్‌జోన్ మొహర్లీ గేట్ ద్వారా లోపలికి వెళ్లొచ్చు.

**రహదారి మార్గంలో..** హైదరాబాద్ నుంచి అయితే.. కరీంనగర్-గోదావరిఖని-మంచిర్యాల-బెల్లంపల్లి-ఆసిఫాబాద్, బల్లార్ష-చంద్రపూర్. 381 కి.మీ. దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. ఆదిలాబాద్ నుంచి అయితే.. బేల-కోర్పన-గడ్‌చాందూర్-రాజూర-బల్లార్ష-చంద్రపూర్. 107 కి.మీ. ఉంటుంది.


# ఉపాధి కార్డు.. జీవితకాలం చెల్లుబాటు

మెదక్ : ఉన్నత విద్యాభ్యాసం చేసి ఉద్యోగానికి ఎదురుచూసే నిరుద్యోగులు గతంలో ప్రభుత్వ ఉపాధి కల్పన కార్యాలయాల్లో తమ పేర్లు నమోదు చేసుకొని కార్డు పొందేవారు. ఆ తర్వాత ప్రతి మూడేళ్లకోసారి వీటిని పునరుద్ధరణ చేసుకోవాలి. అయితే ఈ సమయంలో అభ్యర్థులు నానాపాట్లు పడాల్సిందే. దీన్ని గుర్తించిన ప్రభుత్వం శాశ్వత ఉపాధి కార్డులు అందించాలని నిర్ణయించి అమలుకు శ్రీకారం చుట్టడం విశేషం.

**ఒక్కసారి దరఖాస్తుతో..** ఉపాధి కల్పన వెబ్‌సైట్‌లో ఒక్కసారి పేర్లు నమోదు చేసుకుంటే జీవితకాలం చెల్లుబాటవుతుంది. జిల్లా ఉపాధి కల్పన శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న ఒక్క రోజులోనే శాశ్వత పత్రాలు ఆన్‌లైన్‌లోనే అందుకోవచ్చు. కార్డుల పునరుద్ధరణ లేక సీనియారిటీ కోల్పోయే ఇబ్బంది తొలగింది.

**ఇలా చేయండి..**

విద్యార్థులు, నిరుద్యోగులు ఎంప్లాయిమెంట్.తెలంగాణ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఇంటి నుంచి స్వయంగా గాని, మీసేవా కేంద్రాల ద్వారా గాని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు ఆయా



పత్రాలను పరిశీలించి సరిగా ఉంటే వెంటనే ఆమోదిస్తారు. ప్రభుత్వ కార్యాలయాల్లోని ఖాళీల సమాచారం జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయాలకు అందుతుంది. ఉపాధి కార్డు పొందిన సీనియర్లకు ప్రాధాన్యం ఇస్తారు.

**జిల్లాలో ఇలా..**

జనాభా: 7,67,428

యువత: 1,21,250

ఇప్పటి వరకు కార్డు తీసుకున్న వారు: 6821

54 ఏళ్ల వరకు..

రామరాజు, ఉపాధి కల్పన శాఖ జిల్లా అధికారి

ప్రస్తుతం ఉపాధి కల్పన శాఖ ద్వారా విద్యార్థులు, నిరుద్యోగులకు అందజేస్తున్న కార్డులు 54 ఏళ్ల వరకు పని చేస్తుంది. ఆ తర్వాత పునరుద్ధరణ చేసుకోవచ్చు. ఈ విధానం 2022 డిసెంబరు నుంచి అందుబాటులోకి వచ్చింది. ఇటీవల కాలంలో కార్డుల ప్రాధాన్యం పెరగడంతో యువత వీటిపై ఆసక్తి చూపుతున్నారు. చదువుకున్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

చురకలు



## గచ్చిబౌలి ఎఫ్‌సీఐ లేఅవుట్‌లో అక్రమ కట్టడాల కూల్చివేత

గచ్చిబౌలి : గచ్చిబౌలి ఎఫ్‌సీఐ లేఅవుట్‌లో అక్రమకట్టడాలను హైడ్రా కూల్చివేసింది. గచ్చిబౌలి ప్రధాన రోడ్డును అనుకొని 20 ఎకరాల్లో విస్తరించిన ఎఫ్‌సీఐ లేఅవుట్‌లో 162 ప్లాట్లున్నాయి. సంధ్యా కన్వెన్షన్ సెంటర్ అధినేత శ్రీధర్‌రావు లేఅవుట్‌లోని రోడ్లు, పార్కులు ఆక్రమించి ఫుడ్‌కోర్టులు, పెట్రోల్ బంక్, పలు షెడ్లు నిర్మించారు. 40 ఏళ్ల క్రితం వేసిన లేఅవుట్‌ను శ్రీధర్‌రావు నామరూపాలు లేకుండా చేశారని ప్లాట్ల యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. తీవ్రంగా పరిగణించి హైకోర్టు వెంటనే ఆక్రమణలు తొలగించాలని ఆదేశించింది. హైడ్రాఅధికారులు రంగంలోకి దిగి భారీ యంత్రాలతో సోమవారం ఉదయం 6 గంటల నుంచే కూల్చివేతలు ప్రారంభించారు.



ఏడు ప్రాంతాల్లో రోడ్డును ఆక్రమించి కట్టిన నిర్మాణాలు తొలగించారు. 40 అడుగుల రోడ్డుపైకి వచ్చిన ఓ భవనానికి సంబంధించిన సెల్లార్ ర్యాంపులు, ఫుడ్‌కోర్టులు, ఐరన్ ఫ్రేమ్‌తో నిర్మించిన ఐదంతస్తుల భవనాన్ని కూల్చివేశారు.

**యథాతథ స్థితికి ఆదేశం**

గచ్చిబౌలిలోని సర్వే నంబరు 124, 125లో నిర్మాణాలను కూల్చివేయడాన్ని సవాలు చేస్తూ సంధ్య హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ అత్యవసరంగా కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. జస్టిస్‌విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టగా.. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ చట్టప్రకారం వ్యవహరించాలన్న కోర్టు ఆదేశాలను హైడ్రా ఉల్లంఘించిందన్నారు. ఇప్పటికే 70 శాతం కూల్చివేసి రూ.కోట్ల నష్టం కలిగించిందని, తదుపరి కూల్చివేతలపై స్టేఇవ్వాలని కోరారు. దీంతో న్యాయమూర్తి విచారణను వాయిదా వేస్తూ కూల్చివేతలపై యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశించింది.

## అడ్డగోలుగా తవ్వకాలు.. భవనానికి బీటలు

గోషామహల్: ఇంటి నిర్మాణం కోసం తవ్వకాలు చేపడుతుండగా పక్కనే ఉన్న బహుళ అంతస్తుల భవనానికి బీటలు వారడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గోషామహల్ చాక్నావాడీలో సుమారు ఎనభై గజాల స్థలంలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణంలో భాగంగా పునాదుల కోసం తవ్వుతుండగా పక్కనే ఉన్న బహుళ అంతస్తుల భవనం కుదుపునకు గురై బీటలు వారింది. దీంతో ఆ ఇంట్లోని వారు భయంతో పరుగులు తీశారు. మరోవైపు ఉన్న ఇంకో బహుళ అంతస్తుల



భవనం ఇంటి యజమానులు భయంతో ఇల్లు వదిలి బయటకు వెళ్లిపోయారు గోషామహల్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్సై లక్ష్మయ్య, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. డీసీ ఉమా ప్రకాశ్ ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ అధికారి మహేందర్ సంఘటనా స్థలానికి చేరుకొని ఇంటి నిర్మాణం చేపట్టిన వ్యక్తిని విచారించారు. అనుమతులు లేకుండా పనులు చేపడుతున్న సదరు వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## ఈకేవైసీ ఇంకా సాగుతూనే..!

రాజపేట : జిల్లాలో ఉపాధి కూలీలకు ఈకేవైసీ అనుసంధాన ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇప్పటి వరకు మోత్కూరు మండలం ముందంజలో ఉండగా రాజపేట మండలం వెనుకంజలో ఉంది. కేంద్ర ప్రభుత్వం పనుల్లో పారదర్శకతకు ఈకేవైసీ అమలు చేస్తున్న విషయం తెలిసిందే. గత నెల రోజుల క్రితం ఈ కార్యక్రమం మొదలైనా ఇంకా కొనసాగుతూనే ఉంది. సంబంధిత వివరాలు క్లుప్తంగా..



**ఆలస్యానికి కారణాలు ఇవీ..**

జిల్లా వ్యాప్తంగా ఉపాధిహామీ పనుల్లో పాల్గొంటున్న కూలీల సంఖ్య 1,27,024 ఇప్పటి వరకు 1,16,266 మంది ఈకేవైసీ పూర్తయిందని ఇంకా 10,758 మంది కూలీలు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని అధికారిక గణాంకాలు తెలుపుతున్నాయి. కొందరు స్థానికంగా లేకపోవడం, మరి కొందరు వలస వెళ్లడం, ఇంకొందరు ఆధార్‌కార్డు అప్‌డేట్ కాకపోవడం తదితర కారణాలతో ఆలస్యమువుతుందని తెలుస్తోంది. ఈకేవైసీ చేయించుకుంటేనే భవిష్యత్తులో పనులు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో తెలిసిన వారి ద్వారా వలస కూలీలకు సమాచారం ఇస్తున్నారు. ప్రస్తుతం వివిధ రకాల పనుల సీజన్ కావడంతో కూలీలు జాప్యం చేస్తున్నారు. త్వరలో వంద శాతం పూర్తి చేయాలని ఉన్నతాధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు కనిపించని స్థితి నెలకొంది.

# ‘నిఘా’నైన భద్రతేదీ?



హైదరాబాద్: నగర పోలీసులు అధికశాతం బందోబస్తు విధులకే సరిపోతున్నారు. దీని ప్రభావం కేసుల నమోదు, దర్యాప్తుపై పడుతోంది. కేసు దర్యాప్తు, ఛార్జిషీట్‌లో తప్పిదాలతో నేరస్థులు తేలికగా తప్పించుకుంటున్నారు. పనిభారం పెరగడంతో నేర పరిశోధనలో బుర్రకు పనిచెప్పడం తగ్గింది. కాలనీల్లో కొట్లాటలు.. రౌడీషీటర్ల ఆగడాలపై అప్రమత్తం చేసే ఇన్‌ఫార్మర్ వ్యవస్థ దూరమైంది. డార్క్ స్పాట్.. క్రైమ్ స్పాట్స్ ఎక్కడుంటాయనేది చాలా మంది సెక్టార్ ఎస్సైలకు అవగాహన కరవైంది. శాంతిభద్రతల నిర్వహణలో ఎంతో అనుభవం ఉన్న పోలీసు అధికారులున్న నగరంలో నిఘా లోపం శాపంగా మారింది.

**దిద్దుబాటు చర్యలకు సిద్ధం..**

వరుస ఘటనలతో తప్పిదాలను గుర్తించిన నగర సీపీ సజ్జనార్ పరిస్థితిని చక్కదిద్దేందుకు సిద్ధమయ్యారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తరిస్తూనే కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టారు. ఆర్మ్‌డ్ విభాగం నుంచి మరింత సిబ్బందిని తీసుకొని శాంతిభద్రతలు, ట్రాఫిక్ విభాగాల్లో ఉపయోగించాలనే యోచనలో ఉన్నారు. బందోబస్తు విధులు, నేర పరిశోధనకు వేర్వేరు బృందాలను ఉపయోగించాలనే ఆలోచనను అమలు చేసేందుకు కసరత్తు మొదలైనట్టు సమాచారం.

**మొరాయించిన కెమెరాలు**

ఏ నేరం జరిగినా సీసీ కెమెరాలే కీలకపాత్ర పోషిస్తాయి. నగరంలో 5 లక్షలకుపైగా కమ్యూనిటీ సీసీ కెమెరాల్లో సగానికిపైగా మొరాయించాయి. కొన్ని కాలనీలు, వ్యాపార సముదాయ ప్రాంతాల్లో నిర్వహణ లోపంతో పనిచేయట్లేదని గుర్తించారు. వీటిని తిరిగి వినియోగంలోకి తేనున్నారు.

**గాడిన పడేనా?**

లాలాగూడలో కాలనీ జనాల మధ్య ఉంటూ చీకటి కార్యకలాపాలకు సహకరిస్తున్న యువకుడిని నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) అధికారులు అదుపులోకి తీసుకునే వరకూ ఎవరూ గ్రహించలేకపోయారు. రాజేంద్రనగర్‌లో ఇంటినే ప్రయోగశాలగా మార్చి ప్రమాదకర రసాయనం తయారు చేసి ఉగ్రమూకలతో సంబంధాలు నెరుపుతున్న వైద్యుడి కుట్రను తెలుసుకోలేకపోయారు. బెంగళూరు బాంబు పేలుళ్లలో కీలకమైన నిందితుడు వస్త్ర వ్యాపారి ముసుగులో 12 ఏళ్లు టోలిచౌకిలో కుటుంబంతో కలిసి తలదాచుకున్నా కేంద్ర దర్యాప్తు సంస్థలు అరెస్ట్ చేసే వరకూ బయటి ప్రపంచానికి తెలియదు. తరచూ వెలుగుచూస్తున్న ఈ తరహా ఘటనలు నగరంలో నిఘా పరిస్థితికి, పోలీసు విభాగంలో సమన్వయ లోపానికి అద్దం పడుతున్నాయి. మెగా పోలీసింగ్‌లో భాగంగా పోలీస్‌స్టేషన్ల సంఖ్య పెంచినా.. అడుగు అడుగునా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినా ఆశించిన ఫలితం సాధించడంలో వెనుక పడుతున్నాం.

## రూ.50 లక్షల పనులు.. నాణ్యతకు తిలోదకాలు



కరీంనగర్ : కరీంనగర్ బల్దియా పరిధిలోని కమాన్ కూడలి నుంచి హెచ్‌కెఆర్ జంక్షన్ తీగల వంతెన వరకు రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రహదారి విస్తరణ చేపట్టారు. ఆ సమయంలో డ్రైనేజీలు, తాగునీటి పైపులైన్లు, వీధిదీపాలకు సంబంధించిన పనులన్నీ ప్యాకేజీలో ఇచ్చారు. ఆ పనులు దక్కించుకున్న ఏజెన్సీలు హడావుడి చేసి పనులు పూర్తి చేశాయి. ఇప్పుడు ఒక్కో లోపం బయటపడుతోంది. ఆర్‌అండ్‌బీ ద్వారా రెండు వైపులా నిర్మించిన డ్రైనేజీ గుండా మురుగునీరు ప్రవహించడం లేదు. పైపులైను పొట్ల పండులా పగులుతోంది.

**వారు అలా.. వీరు ఇలా**

బల్దియాలో వేసే పైపులను ముందస్తుగానే ఇంజినీరింగ్ అధికారులు తనిఖీ చేసిన తర్వాత సంతృప్తికరంగా ఉంటేనే ఎంపిక చేస్తారు. లేదంటే ఆ పైపులను తీసుకోరు. ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం పైపుల నాణ్యతను తనిఖీ చేయకపోవడంతో పలు చోట్ల లీకేజీ అవుతున్నట్లు స్పష్టమవుతోంది.

**లేఖలకు స్పందన ఏదీ?**

తాగునీటి పైపులైను లీకేజీని పరిష్కరించాలని, దీనికి సంబంధించిన నిర్వహణ గడువు కూడా ముగియలేదని పేర్కొంటూ కలెక్టర్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ పేరు మీద ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీకి, ఈఈకి నాలుగుసార్లు లేఖ రాశారు. అయినా ఎలాంటి స్పందన లేకుండా పోయింది. ఈ ప్రాంతవాసులు మాత్రం లీకేజీలపై ఫిర్యాదులు మాత్రం బల్దియా అధికారులకే చేస్తున్నారు.

**వెలుగు చూస్తున్న లోపాలు..**

కమాన్ చౌరస్తా నుంచి మారుతీనగర్ జంక్షన్ మీదుగా తీగల వంతెన వైపు వెళ్లు దారి రెండు కిలోమీటర్లు పొడవు ఉంటుంది. ఏడాదిన్నర కిందట ఈ పైపులైనును రహదారులు, భవనాలతోనే వేయించారు. సుమారు రూ.50 లక్షలతో ఈ వైపు పనులు చేసేందుకు వెచ్చించారు. రహదారికి రెండు వైపులా వేసిన పైపులైను పలు చోట్ల లీకవుతోంది. ఒక చోట మరమ్మతులు చేస్తే మరో చోట లీకవుతోంది. అలా ఇప్పటికే 40 చోట్లకు పైగా నీరంతా బయటకు వస్తోంది. ఎక్కడ పడితే అక్కడ తవ్వుతుండటంతో బీటీ రోడ్డు కూడా పాడవుతోంది.

**మరోసారి ఆ శాఖకు రాస్తాం**

– వెంకటేశ్వర్లు, డీఈఈ, కరీంనగర్ నగరపాలిక

నీరు ఒత్తిడితో రావడంలేదని, మురికిగా వస్తోందని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రజల అవసరాలను గుర్తించి తామే మరమ్మతులు చేయిస్తున్నాం. అయినా లీకేజీలు ఆగడంలేదు. కమిషనర్ ఆదేశాల మేరకు మరోసారి ఆర్‌అండ్‌బీ అధికారికి లేఖ రాస్తాం.

## అంచనాలే.. అభివృద్ధి లేదు!



గోదావరిఖని : గోదావరి ఒడ్డునున్న హిందూ శ్మశానవాటిక నిర్వహణలో నిర్లక్ష్యం నెలకొంది. రెండు దశాబ్దాలుగా గోదావరిఖనిలోని హిందూ శ్మశాన వాటికను ఆదర్శంగా అభివృద్ధి చేస్తామని అంచనాలు సిద్ధం చేయడం, రాజమండ్రితో పాటు పలు నగరాల్లో పరిశీలించి రావడం మినహా ఆశించిన మేరకు పనులు చేపట్టలేదు. స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార వాణిజ్యవర్గాలతో హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శ్మశాన వాటికలో సంస్మరణ కార్యక్రమాల నిర్వహణకు రెండు హాళ్లు నిర్మించినప్పటికీ నిర్వహణ లేకపోవడంతో శిథిలమవుతున్నాయి. గ్యాస్ ఆధారిత దహన కేంద్రాన్ని ఏర్పాటు చేసినప్పటికీ ప్రారంభానికి నోచుకోకుండానే శిథిలమవుతోంది. గంగానగర్ నుంచి శ్మశాన వాటిక వరకు రహదారి సమస్య నెలకొంది.

**రూ.2 కోట్లతో టెండర్లు** గోదావరి ఒడ్డున గల హిందూ స్మశాన వాటిక అభివృద్ధి కోసం టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.2 కోట్లతో అంచనాలు సిద్ధం చేసి టెండర్లు నిర్వహించారు. నిధులు సరిపోయే అవకాశం లేదని భావించిన ఎమ్మెల్యేతో పాటు నగరపాలక అధికారులు రూ.4 కోట్లతో అంచనాలు సిద్ధం చేస్తున్నారు. టెండర్లు పూర్తయిన రూ.2 కోట్ల పనులు సైతం ముందుకు సాగడం లేదు.

గతంలో గోదావరి వరదలతో హిందూ శ్మశాన వాటిక ప్రహరీతో పాటు దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాటు చేసిన భవనం గోడలు కూలిపోవడంతో పాటు బెంచీలు విరిగిపోయి, నీటి సరఫరా పైపులైన్లు చెడిపోవడం, రహదారి శిథిలం కావడంతో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయి. దహన వాటికల వద్ద ప్రత్యేకంగా కొళాయి లేదా బోరుబావి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో వీధి దీపాలు, ఉద్యానవనం ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ లేక ఆనవాళ్లు కోల్పోయాయి. రహదారి విస్తరణ పేరిట విద్యుత్తు స్తంభాలను తొలగించారు. తాత్కాలికంగా విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేసినా సరిపోవడం లేదు. రహదారికి ఇరువైపులా తవ్విన కందకాలతో, మృతదేహాలను ఖననం చేసేందుకు స్థలం లేకప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఖననం చేసినట్లు తెలిసేందుకు బంధువులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. తాగునీటి సదుపాయం, గోదావరిలో ఘాట్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

## ఆసుపత్రికి ఆలస్యం జబ్బు


నిజామాబాద్: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిస్థితి తయారైంది. భవన మరమ్మతులు, నూతన పైప్‌లైన్‌కు నిధులు మంజూరైనా పనులు చేపట్టడంలో నెలల తరబడి జాప్యం జరుగుతోంది. ఏడంతస్తుల జీజీహెచ్‌లో మరుగుదొడ్లు, మూత్రశాలల పైపులు పగిలాయి. లీకైన నీరు గోడల మీదుగా పారుతోంది. ఈ నేపథ్యంలో మరమ్మతులకు ప్రభుత్వం రూ.2.75 కోట్లను 3 నెలల క్రితం మంజూరు చేసింది.

**తల్లీ బిడ్డలకు కష్టాలే..**

జీజీహెచ్‌లో రోజుకు ఓపీ 1,500–2,000 నమోదవుతోంది. ప్రతీ నెలా 500 ప్రసవాలు జరుగుతున్నాయి. తల్లీబిడ్డల వార్డు ప్రస్తుతం మొదటి అంతస్తులో కొనసాగిస్తున్నారు. వీరికోసం పక్కనే రూ.40 కోట్లతో మాతా, శిశు సంరక్షణ కేంద్రాన్ని (ఎంసీహెచ్) నిర్మించారు. ఏడాదిగా అది అలంకారప్రాయంగా ఉంది. అక్కడకు మాతా శిశు విభాగం తరలింపులో జాప్యం జరుగుతోంది. ఎప్పుడు అధికారులను అడిగినా.. ‘వారం, పది రోజుల్లోనే’ తరలిస్తాం అంటున్నారు.

**అక్కరకు రాని క్యాథ్‌ల్యాబ్**

రూ. 7 కోట్ల వ్యయంతో క్యాథ్‌ల్యాబ్, యంత్రాలు రెండేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. కార్డియాలజిస్ట్ లేకపోవడంతో క్యాథ్‌ల్యాబ్ సేవలు అందుబాటులోకి రాలేదు. హృద్రోగులకు సేవలు దరిచేరడం లేదు.



ఈ విభాగంలో 120–150 ఓపీ నమోదవుతుండగా.. చాలామంది ప్రైవేటు దవాఖానాలకు వెళ్లి జేబులు గుల్లచేసుకోవాల్సి వస్తోంది.

**‘ప్రైవేటు’కు సహకరించేందుకేనా...**

ప్రస్తుతం జీజీహెచ్‌లోని మాతా, శిశు వార్డుకు వైద్య సిబ్బంది ఎవరు వస్తున్నారో, ఎప్పుడు వెళ్తున్నారో తెలియని పరిస్థితి. ఎంసీహెచ్‌ను ప్రారంభిస్తే అక్కడ కచ్చితంగా అందుబాటులో ఉండాలి. ఇక్కడ ప్రసవాలు పెరిగితే ప్రైవేటు దవాఖానాలకు తాకిడి తగ్గుతుంది. జీజీహెచ్‌లో పనిచేసే చాలామంది వైద్యులు ప్రైవేటులో ప్రాక్టీస్ చేసేవారే. ఈ కారణంగానే ఎంసీహెచ్ ప్రారంభం, ఆసుపత్రి మరమ్మతుల అంశాన్ని కొందరు దాటవేస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. ‘వారం రోజుల్లో మాతా శిశు విభాగాన్ని కొత్త భవనంలో పూర్తిస్థాయిలో తరలిస్తాం. అక్కడే సేవలన్నీ అందిస్తాం. ఆసుపత్రిలో మరమ్మతులు, పైప్‌లైన్ పనుల్ని త్వరలోనే పూర్తిచేయిస్తాం’ అని జీజీహెచ్ పర్యవేక్షకులు శ్రీనివాస్ అన్నారు.

## వారంతే.. అన్నదాతకు చింతే..!

తుంగతుర్తి : ప్రభుత్వ హామీ: రైతులు ఆందోళన చెందొద్దు. ధాన్యం తడిసినా..మొల కెత్తినా..ఆరిన తర్వాత 16 శాతం తేమ వస్తే కొనుగోలు చేస్తాం.మిల్లర్ల కొర్రీలు: తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి తేమ వచ్చిన తర్వాత ధాన్యం కాంటా వేయించి బస్తాలను లారీలో మిల్లుకు పంపించాక.. యజమానులు కొర్రీలు పెడుతూ తిప్పి పంపుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ మేం సీతయ్యలం.. ఎవరి మాటా వినం.. ధాన్యం దిగుమతి చేయమంతే.. అన్నట్లు కొందరు మిల్లర్లు వ్యవహరిస్తున్న తీరు అన్నదాతలను కన్నీరు పెట్టిస్తోంది. నారు పోసింది మొదలు ధాన్యం అమ్ముకునే వరకు రైతులకు కష్టాలు అన్నీఇన్నీ కావు. నాటువేసే దశలో నీటి కొరత.. ఆపై యూరియా కోసం బారులు..తీరా పంట చేతికందే సమయంలో నీట ముంచిన భారీ వర్షాలు.. ఇలా అన్ని విపత్తులను తట్టుకుని కొనుగోలు కేంద్రాల్లో పోసిన తర్వాత మొంథా తుపానుతో ధాన్యం తడిసి ముద్దయింది. వాటిని ఆరబెట్టేందుకు రెట్టింపు కష్టాలు పడ్డారు. ఇలా తుంగతుర్తి మండలంలోని ఓ కేంద్రంలో 16 శాతం తేమ వచ్చాక కేంద్రం నిర్వాహకులు ధాన్యాన్ని కాంటా వేసి లారీలో తిరుమలగిరిలోని ఓ మిల్లుకు పంపారు. ఒకటీ రెండూ కాదు...ఆరు రోజులు దాటినా బస్తాలను దిగుమతి చేసుకోలేదు.



కారణమడిగితే ధాన్యం నల్లబడింది.. దిగుమతి చేసుకోం. మీరు ఎవరికైనా చెప్పుకోండని లారీని తిరిగి కేంద్రానికి పంపారు.

దీంతో నిర్వాహకులు చేసేది లేక ఆ లారీలోని 720 బస్తాలకు సంబంధించిన ఆరుగురి రైతులను పిలిపించారు. ఆ బస్తాలను మార్చేందుకు అదనంగా మూడు లారీలను తెప్పించి ఒక్కో బస్తా పరిశీలించారు. వాటిలో కేవలం 80 బస్తాల్లో మాత్రమే కొద్దిగా గింజ నల్లబడింది. కానీ లోపల బియ్యం తెల్లగా ఉండటాన్ని గుర్తించారు. మిల్లరు ధాన్యాన్ని ఎందుకు వెనక్కి పంపారో అర్థం కాలేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

నిర్వాహకులు తమకు సమాచారం ఇస్తే మిల్లరుతో మాట్లాడి దిగుమతి చేయించేవారమని ఐకేపీ ఏపీఎం అశోక్ చెప్పారు.

## సన్నద్ధతలో ఎలాగోలా ‘నెట్టు’కొస్తూ..

నిజామాబాద్ : ప్రభుత్వ ఉద్యోగాల ప్రకటనల నేపథ్యంలో జిల్లాలోని పఠనాలయాలకు అభ్యర్థులు వందల సంఖ్యలో తరలివస్తున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం, పాత డీఈవో కార్యాలయంలో నిరుద్యోగ యువకులు పుస్తకాలతో కుస్తీపడుతూ కనిపిస్తున్నారు. ఉద్యోగార్థులకు ఆన్‌లైన్ దరఖాస్తు, నోటిఫికేషన్ల సమాచారం, విషయ పరిజ్ఞాన సేకరణకు ఇంటర్నెట్ ఎంతో అవసరం. అందరికీ స్మార్ట్‌ఫోన్లు ఉన్నందున ఉచిత వైఫై సదుపాయం ఉపయోగపడుతుంది. వందలాది మంది వచ్చే జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కంప్యూటర్లు, వైఫై రూటర్లు ఉన్నా.. డేటా స్పీడ్ మరింత పెంచాలి. ఇతర శాఖా గ్రంథాలయాల్లోనూ ఈ సదుపాయం కల్పించాలి. అన్ని చోట్ల అంతర్జాల వసతి అవసరం

కేంద్ర గ్రంథాలయంతో పాటు శాఖా, గ్రామీణ గ్రంథాలయాలు జిల్లాలో కొనసాగుతున్నాయి. వీటిలో జిల్లా కేంద్ర గ్రంథాలయం, బోధన్, ఆర్మూర్‌లో ఇంటర్నెట్ (కంప్యూటర్లతో), వైఫై సదుపాయం, బాల్కొండ, భీమ్‌గల్, మోర్తాడ్, వర్ని, ధర్పల్లి పఠనాలయాల్లో కేవలం వైఫై (రూటర్) వసతి ఉంది. నిజామాబాద్‌లో రూ.10 లక్షలు, బోధన్‌లో రూ.3 లక్షలు, ఆర్మూర్‌లో రూ.3 లక్షలతో కంప్యూటరు విభాగాలు, రూటర్లు ఏర్పాటు చేయించారు.

# శివారు వార్డులపై శీతకన్ను

బెల్లంపల్లి : ఇది బెల్లంపల్లి మున్సిపాల్టీలోని 3, 17వ వార్డులు కలిసి ఉన్న రోడ్డు. ఇక్కడ వీధి దీపాలు మూడేళ్లుగా వెలగడం లేదు. విద్యుత్తు స్తంభాలు ఉన్నా వాటికి బిగించిన తీగలను దొంగలు ఎత్తుకెళ్లారు. తీగలు లేక చీకట్లోనే ప్రజలంతా రాకపోకలు సాగిస్తుంటారు. రవీంద్రనగర్, చిన్నబూద గ్రామాల ప్రజలు ఈ రోడ్డు వెంట వెళ్లాలంటే భయపడుతున్నారు. మున్సిపల్ అధికారులు పండగ సందర్భంగానైనా వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. జిల్లాలోని శివారు వార్డులపై మున్సిపాల్టీలు చిన్నచూపు ప్రదర్శిస్తున్నాయి. పురపాలికలు కనీస మౌలిక సదుపాయాల కల్పనలో విఫలమవుతున్నాయి. సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇక్కడి ప్రజలంతా సమస్యలతో సహవాసం చేస్తున్నారు. అభివృద్ధి అంతంతమాత్రంగానే కనిపిస్తోంది. జిల్లాలోని బెల్లంపల్లి, చెన్నూరు, లక్షెట్టిపేట, క్యాతనపల్లి, మందమర్రిలతో పాటు మంచిర్యాల కార్పొరేషన్‌లోని శివారు వార్డుల్లో ప్రజలు సమస్యలతో అవస్థలు పడుతున్నారు.

**అధికారులకు విన్నవిచ్చినా..**

అక్కడి వార్డుల్లో మౌలిక సదుపాయాలను కల్పించడంలో అధికారులు చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదు. సేవలు ఆలస్యంగానే అందుతున్నాయి.



అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తంతా రోడ్లపైనే కనిపిస్తోంది. అధికారులకు సమాచారమిచ్చినా సమస్యలు పరిష్కారం కావడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

**జిల్లాలో ఇదీ పరిస్థితి**

మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని ఒడ్డెరకాలనీ, రాజీవ్‌నగర్, గాంధీనగర్, తిలక్‌నగర్, ఎన్‌టీఆర్ కాలనీ, అండాలమ్మకాలనీలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీల నిర్వహణ సరిగా లేదు. తాగునీటి కోసం ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు పూర్తిస్థాయిలో ఇళ్లకు చేరడం లేదు.బెల్లంపల్లి పురపాలికలోని సుబ్బరావుపల్లి, అంబేద్కర్‌నగర్, షంషీర్‌నగర్, గంగారాంనగర్‌లో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. చెత్త వాహనాలు ప్రతిరోజు రావడం లేదు. చెత్తంతా పోగై కంపుకొడుతోంది. చెన్నూరు మున్సిపాల్టీలోని శివారు వార్డుల్లో మురుగు కాలువలు, అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. ఆరో వార్డులోని ఆదర్శనగర్‌లో నిత్యం ప్రజలు సమస్యలతో ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. క్యాతనపల్లి మున్సిపాల్టీలోని కనకదుర్గ కాలనీ, తిలక్‌నగర్, అల్లూరి సీతారామరాజునగర్‌లో డ్రైనేజీలు శిథిలావస్థకు చేరాయి. అంతర్గత రోడ్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. చెన్నూరు మున్సిపాల్టీ ఆరో వార్డులోని రోడ్డు పరిస్థితి ఇది. వర్షాకాలం వస్తే చాలు రోడ్డు బురదమయంగా మారుతుంది. ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తారు రోడ్డుపై ఇసుక వేయడంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు.

# యాసంగికి శ్రీరామ రక్ష

జగిత్యాల : ఉమ్మడి జిల్లా వరదాయని శ్రీరామసాగర్ ప్రాజెక్టు యాసంగి సాగుకు భరోసాగా నిలవనుంది. ఈ వానాకాలంలో గోదావరి పరీవాహకంలో వానలు ఆలస్యంగా ప్రారంభమైనా తదుపరి భారీ వర్షాలతో ఎన్నడూ లేనంతగా ప్రాజెక్టులోకి వరద చేరింది. ఈ సీజన్‌లో జూన్ 1 నుంచి ఇప్పటివరకు 882 టీఎంసీల నీరు రాగా 815 టీఎంసీలను దిగువకు వదిలారు. గడిచిన నాలుగేళ్లలో ఈసారి వరదే అధికం. ఇందులో అత్యధికంగా మిగులు జలాలుగా గోదావరిలోకి విడుదల చేశారు. వానాకాలం సీజన్ ముగిసినా ఎస్సారెస్పీలోకి ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో స్పిల్‌వే గేట్ల ద్వారా కొంత నీటిని నదిలోకి వదులుతున్నారు. యాసంగి మొదలైన నేపథ్యంలో ప్రాజెక్టులో గరిష్ఠ స్థాయిలో నీరు నిలువ ఉండటంతో పూర్తి స్థాయిలో పంటలకు నీరందే అవకాశం ఏర్పడింది.

**29న బాబ్లీ గేట్లు మూసివేత**

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మహారాష్ట్రలో గోదావరిపై నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఏటా జులై 1న తెరచి అక్టోబరు 29న మూసివేస్తున్నారు. ఈ నాలుగు నెలలు ఎగువ నుంచి బాబ్లీలోకి వచ్చిన వరదను మొత్తం దిగువన ఎస్సారెస్పీలోకి వదలాలి. ఆ తర్వాత తదుపరి నెలల్లో వచ్చే 2.74 టీఎంసీల నీటిని మహారాష్ట్ర వినియోగించుకోవాలి.

తెలంగాణ తాగునీటి అవసరాల నిమిత్తం మార్చిలో 0.60 టీఎంసీల నీటిని బాబ్లీ నుంచి ఎస్సారెస్పీలోకి విడుదల చేయాలి.

2.40 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం గల బాబ్లీ ప్రాజెక్టు గేట్లను మూసివేసినా ప్రస్తుతం ఎస్సారెస్పీతో పాటు మధ్యమానేరు, దిగువమానేరు, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయి నీటితో ఉమ్మడి జిల్లాకు భరోసా కలగనుంది.

ఎస్సారెస్పీ, ఎల్‌ఎండీల పరిధిలో ప్రధాన పంటలైన వరి, ఇతర ఆరుతడి పంటలకు అనుగుణంగా నీటి విడుదల ప్రణాళికను అధికారులు రూపొందించి వారబందీ పద్ధతిని అమలు చేస్తారు.

ఎస్సారెస్పీ నుంచి ఉమ్మడి జిల్లా అవసరాల కోసం కాకతీయ, వరద కాలువలకు నీటిని విడుదల చేసి ఆయకట్టుతో పాటు చెరువులు, కుంటల్లోకి తరలించనుండటంతో భూగర్భ జలమట్టం కనిష్ఠ స్థాయిలో కొనసాగి పంటల సాగుకు ఉపకరించనుంది.ఎస్సారెస్పీ ఆయకట్టు విస్తీర్ణం(ఎకరాల్లో)

ఎల్‌ఎండీ ఎగువన : 4,42,920

దిగువన : 5,05,720

వరదకాలువ ఆధారంగా : 50 వేలు

# పరిశీలించకుండా.. పచ్చజెండా

హైదరాబాద్ : నగర శివారులో ఫ్లాట్ల నిర్మాణం చేపట్టిన ఓ స్థిరాస్తి సంస్థ హెచ్‌ఎండీఏ నుంచి అనుమతుల కోసం ఏకంగా ఇబ్రహీంపట్నం ఆర్డీవో సంతకాన్ని ఫోర్జరీ చేసింది. ఇటీవలే సంస్థ పనులు ప్రారంభించగా, రెవెన్యూ అధికారులకు అనుమానం వచ్చి రికార్డులను పరిశీలించగా, వ్యవసాయయేతర భూమిగా మార్చుకోకుండానే ఆర్డీఓ అనుమతిచ్చినట్లు ఫోర్జరీ పత్రాన్ని సృష్టించినట్టు తేలింది. దీంతో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధ్యులపై కేసు నమోదు చేశారు. నకిలీ పత్రం అని తెలుసుకోకుండా ఎలా అనుమతులిచ్చారని హెచ్‌ఎండీఏ అధికారులను పోలీసులు ప్రశ్నిస్తే మీనమేషాలు లెక్కిస్తున్నారు. మరోవైపు సంస్థ ప్రతినిధులు హయత్‌నగర్ సమీపంలోని తట్టిఅన్నారంలో ఫ్లాట్ల నిర్మాణం సాగిస్తున్నారు.

ధ్రువీకరించుకోకుండా: అబ్దుల్లాపూర్ మండలం తట్టిఅన్నారంలో 600లకు పైగా ఫ్లాట్లు నిర్మించేందుకు ఓ స్థిరాస్తి సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. రెండు ఎకరాల వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు ఏడేళ్ల క్రితం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ కార్యాలయం నుంచి అనుమతులు పొందారు. ఈ భూమికి పక్కనే ఉన్న మరో ఎకరం భూమికి అనుమతులు తీసుకోలేదు. కొద్ది నెలల క్రితం తొలుత రెండెకరాల భూమిలో లే-అవుట్ వేసి హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులు తీసుకున్నారు. అనంతరం ఎకరం భూమిని నాలా కన్వర్షన్ (వ్యవసాయేతర భూమి)చేయించకుండా ఆర్డీవో సంతకాన్ని ఫోర్జరీ చేసి హెచ్‌ఎండీఏకు సమర్పించగా అనుమతులు మంజూరయ్యాయి. దీంతో పనులు మొదలు పెట్టారు.

**సమాచారం ఇచ్చేందుకు మీనమేషాలు..**

ఫ్లాట్ల నిర్మాణానికి లే-అవుట్లు ఇచ్చేప్పుడు హెచ్‌ఎండీఏ అధికారులు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి. రెవెన్యూ అధికారులు, స్టాంప్స్, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులతో మాట్లాడాలి. వీటన్నింటిని విస్మరించిన అధికారులు అనుమతులిచ్చారు. దీనిపై పోలీసులు ప్రశ్నిస్తుంటే మూడు నెలలుగా సమాచారం ఇవ్వడం లేదు. దీంతో నిందితుల అరెస్ట్ ఆలస్యమవుతోందని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు. ఫోర్జరీకి పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షిస్తామని, హెచ్‌ఎండీఏ అధికారుల అలసత్వముంటే ఉన్నతాధికారులకు సమాచారమిస్తామన్నారు.

# వాయువు మూస్తే.. ఆయువు పోసేదెలా?



నల్గొండ: అత్యవసర సమయంలో రోగులకు ప్రాణవాయువు అందించే ఆక్సిజన్ ప్లాంట్లు నిరుపయోగంగా ఉన్నాయి. కొన్నిచోట్ల విద్యుత్తు బిల్లుల మోత పెరగడంతో నిర్వహణ ఆపేశారు. కరోనా సమయంలో శ్వాసకోస సమస్యలు తలెత్తి.. పలువురు ఆక్సిజన్ అందక ప్రాణాలు కోల్పోయారు. దీంతో ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్లు నిర్మించాలని ఆదేశించింది. అయితే రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి.

**ఆసుపత్రుల్లో వినియోగం ఇలా..**

ఒక్కో జిల్లాసుపత్రిలో అన్ని విభాగాలు కలిపి రోజూ 800 మంది ఓపీ నమోదవుతుంది. ఐపీ 300 మంది వరకు ఉంటారు. గర్భిణులు వైద్యసేవలకు ఎక్కువగా తరలివస్తారు. ఐసీయూ, అత్యవసర సేవలు, శస్త్రచికిత్స విభాగాల్లో సెంట్రల్ ఆక్సిజన్ సిస్టం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సంప్రదాయ ఆక్సిజన్ సిలిండర్లను మాత్రమే వినియోగిస్తున్నారు. ప్రతి నెల గరిష్ఠంగా ఒక్కో ఆసుపత్రిలో 10 వరకు వాడుతున్నారు. ఒక్కో ఆసుపత్రిలో గరిష్ఠంగా రూ.60 లక్షలతో నిర్మించిన 500, 1000 లీటర్ ఫర్ మినిట్(ఎల్పీఎం) సామర్థ్యం కలిగిన ఆక్సిజన్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఐసీయూతో పాటు ఆక్సిజన్ అవసరం ఉన్న అన్ని విభాగాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సూర్యాపేట జిల్లాలోని సాధారణ ఆసుపత్రిలో ప్లాంట్ ఏర్పాటు చేసి వినియోగిస్తున్నారు. కోదాడ ప్రాంతీయ ఆసుపత్రిలో ప్లాంట్ నిర్మించినప్పటికి వినియోగించడం లేదు. తిరుమలగిరిలో ఏడు పడకల ఆసుపత్రి ఉండటంతో ఇక్కడ ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేయలేదు. హుజూర్‌నగర్ 60 పడకల ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేయగా ప్రస్తుతం మరమ్మతుల కారణంగా వినియోగించడం లేదు.

నల్గొండ జిల్లాసుపత్రిలోనూ లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్‌ను నిర్మించినా.. విద్యుత్తు బిల్లులు ఎక్కువ రావడం, వినియోగం తక్కువగా ఉండటంతో సిలిండర్లను వినియోగిస్తున్నారు. నాగార్జునసాగర్ కమల నెహ్రూ ప్రాంతీయ ఆసుపత్రిలో నిర్మించినా.. విద్యుత్తు ఖర్చులు పెరుగుతుండటంతో సిలిండర్లను వినియోగిస్తున్నారు.

దేవరకొండ ప్రాంతీయాసుపత్రిలో టెక్నీషియన్ లేక నిరుపయోగంగా ఉంది.

నకిరేకల్, మునుగోడులో నిర్మించినా ప్రారంభించలేదు.

**గుత్తేదారుల నిర్లక్ష్యం వల్లే నిర్వహణ కష్టాలు**

- డా.మాతృనాయక్, జిల్లా సుపత్రుల పర్యవేక్షకుడు, నల్గొండ

కరోనా సమయంలో ఒక్కో సెంట్రల్ ఆక్సిజన్ సిస్టంను జిల్లాసుపత్రిలో, తక్కువ పడకలున్న చోట్ల మినీ లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంకులను నిర్మించి వదిలేశారు. దేవరకొండలో నెలకు రూ.40వేల వరకు విద్యుత్తు బిల్లులు వస్తుండటం, మరమ్మతులకు గురవుతుండటంతో సిలిండర్లు వినియోగిస్తున్నారు. గుత్తేదారుల సంస్థ కొన్ని ప్రాంతీయాసుపత్రుల్లో బిల్లులు రాక సగం నిర్మించి వదిలేశారు. నిర్మించిన చోట్ల మరమ్మతులు వచ్చినా పట్టించుకోవడం లేదు.

# భగీరథ.. తొలి అడుగు ఇక్కడే..!



నల్గొండ : దేశంలోనే అత్యధిక ఫ్లోరిన్ నీటి సమస్య ఉన్న ప్రాంతమైన మునుగోడు నియోజకవర్గం నుంచి 'మిషన్ భగీరథ' పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఫ్లోరైడ్ సమస్య నుంచి శాశ్వతంగా విముక్తి కల్గించేందుకు నదీ జలాన్ని శుద్ధి చేసి రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ నల్లా ద్వారా అందించాలనేది ఈ పథకం లక్ష్యం. మిషన్ భగీరథ చిహ్నంగా చౌటుప్పల్‌లో పైలాన్‌ను నిర్మించారు. 2015 జూన్ 8న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పైలాన్‌ను ఆవిష్కరించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఈ పథకానికి రూ.5800 కోట్లు కేటాయించారు. 14 నెలల కాలంలో పనులు పూర్తి చేసి ఆగస్టు 7న గజ్వేల్ నియోజకవర్గంలోని కోమటిబండ వద్ద ప్రధాని నరేంద్రమోదీ చేతులమీదుగా ప్రారంభోత్సవం చేయించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 36.07లక్షల జనాభాకు నిత్యం స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఈ పథకాన్ని రూపొందించారు. రోజుకు ప్రతి ఒక్కరికి గ్రామాల్లో 100 లీటర్లు, పురపాలికల్లో 135 లీటర్లు, పట్టణాల్లో 150 లీటర్లు చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు. గ్రామాలకు 4.354, పురపాలికలకు 1.190, పరిశ్రమలకు 0.210 టీఎంసీలు నీళ్లు అవసరమని 2018లో నిర్ణయించారు. 2048 నాటికి జనాభా పెరుగుదలను అంచనా వేసి ఆ మేరకు నీటి అవసరాలను లెక్కించారు. శ్రీశైలం, పాలేరు నుంచి నీటిని సేకరించేందుకు ప్రణాళిక రూపొందించారు. 7137 కిలోమీటర్ల ప్రధాన పైపులైను వేయించారు. నీటిని శుద్ధి చేయడానికి అంతకు ముందున్న రోజుకు 180.10 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేసే నీటి శుద్ధి కేంద్రాలతో పాటు 303 ఎంఎల్‌డీ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. అంతకు ముందున్న 126 ఉపరితల, భూతల నీటి రిజర్వాయర్లతోపాటు కొత్తగా 113 నిర్మించారు. అంతకుముందున్న 43 సంపులకు అదనంగా 16 నిర్మాణం చేయించారు. గ్రామాల్లో అంతకు ముందున్న 6132.69 కి.మీ. పైపులైన్లకు తోడుగా 2096.32 కి.మీ పైపులైను వేయించారు. 180.90 ఎకరాల భూమిని సేకరించారు. రాష్ట్రంలో ఫ్లోరైడ్, ఆర్సినిక్ జలాలున్న ఆవాసాలు లేవని, కొత్తగా ఫ్లోరైడ్ కేసులు నమోదు కాలేదని 2020లో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటించింది. మిషన్ భగీరథ పథకం ద్వారా నదీజలాలను సేకరించి, శుద్ధి చేసి, ఇంటింటికీ నల్లాల్లో పంపిణీ చేస్తున్న నీటిని ప్రజలు వినియోగించడం వల్ల ఫ్లోరైడ్ కొత్త కేసులు నమోదు కాలేదని, దశాబ్దాలుగా జిల్లాలోని లక్షల మందిని పీడించిన సమస్య పరిష్కారమైందని జిల్లా అధికారులు వెల్లడించారు.

# భద్రత డొల్ల.. పర్యవేక్షణ కల్ల



ఆలేరు : భువనగిరి ఆర్బీనగర్‌కు చెందిన ఒక టిఫిన్ సెంటర్ నిర్వాహకుడి ఇంట్లో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ నుంచి కమర్షియల్ సిలిండర్‌లోకి గ్యాస్‌ను నింపే క్రమంలో గ్యాస్ లీకైంది. మంటలతో పాటు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో దంపతులు, అక్కడే ఉన్న మరొకరు దుర్మరణం చెందారు.' హోటళ్లు, క్యాంటీన్‌లు, టీకొట్లు, బేకరీలలో ఆహార పదార్థాల తయారీకి గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నారు. చాలావరకు ఇరుకు గదులలో వంటలు తయారు చేస్తున్నారు. అగ్నిమాపకశాఖ నిబంధనలు పాటించడం లేదు. చిన్నచిన్న నిర్లక్ష్యాలు, తప్పిదాలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. చాలా హోటళ్లలో గ్యాస్ సిలిండర్లను ఉపయోగిస్తున్నప్పటికీ అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వీడటం లేదు.

**ఇష్టారాజ్యంగా అనుమతులు**

హోటళ్లు, బేకరీలు, వాణిజ్య సముదాయాల నిర్వహణకు పురపాలిక, ఆహార తనిఖీ, అగ్నిమాపక శాఖల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. నిబంధనలు పాటిస్తేనే అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. గ్యాస్ సిలిండర్లను గదుల్లో కాకుండా భవనం ముందు భాగంలో ఏర్పాటు చేయాలి. అక్కడి నుంచి పైపుల ద్వారా భవనంలోకి గ్యాస్‌ను సరఫరా చేసుకోవాలి. అవసరమైన అగ్నిమాపక పరికరాలు, గోనె సంచులు, ఇసుక, నీరు అందుబాటులో ఉంచాలి. వెలుతురు ఉన్న గదుల్లోనే ఆహార పదార్థాలు, వంటలు తయారు చేయాలి. పొగ లేకుండా గొట్టాలు ఏర్పాటు చేయాలి. కానీ సంబంధిత శాఖల అధికారులు చూసీచూడనట్లుగా తనిఖీలు చేపట్టడం, అనుమతులు ఇస్తుండటంతో ప్రమాదాలకు ఆస్కారం కలుగుతోంది. కొందరు హోటళ్ల నిర్వాహకులు వంటగ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తూ ప్రభుత్వం ఇస్తున్న రాయితీని దుర్వినియోగం చేస్తున్నారు.

**జాగ్రత్తలతోనే రక్షణ..**

గ్యాస్ సిలిండర్‌కు బిగించిన రెగ్యులేటర్, పైపును తరచూ పరిశీలిస్తుండాలి. గ్యాస్ లీకేజీ నివారణకు వినియోగం పూర్తయిన వెంటనే గ్యాస్‌స్టవ్‌కు సరఫరా నిలిపివేయాలి.

బేకరీలు, హోటళ్లు, వాణిజ్య సముదాయాల్లో రాత్రివేళ సీసీ కెమెరాలు మినహా, ఇతర గదులకు విద్యుత్తు సరఫరా నిలిపివేయాలి.

వంటచేసే సమయంలో సిబ్బంది నూలు దుస్తులు ధరించాలి. సిల్క్, టెరికాటన్ లాంటి దుస్తులకు త్వరగా మంటలు అంటుకునే గుణం ఉంటుంది, ఇలాంటివి ధరించకూడదు.

జిల్లా సమాచారం

గ్యాస్ ఏజెన్సీలు: 19

దీపం కనెక్షన్లు: 51,391

ఉజ్వల: 13,007

డొమెస్టిక్: 1,85,070

# ఉపయోగం లేక .. రూ.కోట్లు వృథా

పెద్దపల్లి :కాల్వశ్రీరాంపూర్ మండలం ఇప్పలపల్లి గ్రామశివారులో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేశారు. పరికరాలు సమకూర్చారు. స్మశాన వాటిక సమీపంలో ఉండటంలో అటువైపు వెళ్లేందుకు పిల్లలు, క్రీడాకారులు జంకుతున్నారు. అందులో ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు పెరిగాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలు, విద్యార్థులను ఆటల వైపు మరల్చేందుకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు అలంకారప్రాయంగా మారాయి. చెరువు శిఖం, గుట్ట, పనికిరాని ప్రాంతాల్లో నిర్మించటంతో అందులో సాధన చేసిన నాథుడే లేడు. ఆరేళ్ల క్రితం ఆగమేఘాల మీద ఉపాధిహామీ నిధులు వెచ్చించి క్రీడా ప్రాంగణాలు నెలకొల్పారు. కబడ్డీ, వాలీబాల్, పరుగు పందెం సాధనకు మైదానాన్ని చదును చేసి పరికరాలు బిగించారు. అయితే అధికారుల ముందుచూపు, నిర్వహణ లోపం కరవై రూ.లక్షల ప్రజాధనం వృథాగా మారింది.




**ఒక్కో దానికి రూ.4లక్షల లోపు నిధులు**

ఒక్కో ప్రాంగణానికి రూ.4 లక్షలలోపు ఉపాధిహామీ నిధులు వెచ్చించారు. ఈ లెక్కన జిల్లాలో 266 పంచాయతీల్లో సుమారు రూ.9 కోట్లు కేటాయించి.. నిర్మించారు. గ్రామానికి దూరంగా, స్మశానవాటికల సమీపంలో ఉండటంతో నిరుపయోగంగా మారాయి. పంచాయతీలు మైదానాలు నిర్మించటంలో చూపిన శ్రద్ధ వాటి నిర్వహణలో మరిచాయి. క్రీడా పరికరాలు పొదల్లో తుప్పు పట్టిపోతున్నాయి. ఆరేళ్లలో ఒక్కసారి కూడా వీటిని వినియోగించకపోవటం గమనార్హం. ఎత్తులు, వంకల స్థలాల్లో ఉండటంతో చిరుజల్లులకే బురదమయంగా మారుతున్నాయి.

**మూలన కిట్లు**

సాధనకు ఒక్కో పంచాయతీకి క్రీడా కిట్లు సరఫరా చేశారు. అందులో క్రికెట్, అథ్లెటిక్స్, వాలీబాల్, ఇతరత్రా పరికరాలు ఉన్నాయి. ఇవి పంచాయతీల్లో మూలన మూలుగుతున్నాయి. కొన్నిచోట్ల ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి కూడా నెలకొంది. మైదానాల్లో సాధన చేసే ఉద్దేశంతో వీటిని పంపిణీ చేసినప్పటికీ ప్రభుత్వ ఆశయం అటకెక్కింది. గ్రామీణులు ఆరోగ్య కోసం నడక, వ్యాయామం చేసేందుకు ఆసక్తి చూపుతున్నా.. సరైన వసతులు లేవు. రహదారులపై సాధన చేస్తూ ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయి.

# అద్దె పథకం.. మూలన పరికరం

పెద్దపల్లి : స్వయం సహాయక సంఘాల్లోని మహిళల ఆర్థికాభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు అమలు చేస్తున్నాయి. రాయితీపై రుణాలు అందిస్తున్నాయి. ఇందులో భాగంగా జాతీయ జీవనోపాధుల మిషన్ ఆధ్వర్యంలో నాలుగేళ్ల కిందట మండలానికి ఒక కస్టమర్ హైరింగ్ సెంటర్‌ను(సీహెచ్‌సీ) మంజూరు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పరికరాలను అద్దెకు ఇచ్చి మహిళలు ఉపాధి పొందడం కార్యక్రమ ఉద్దేశం. వివిధ కారణాలతో ఆశయం అటకెక్కి పరికరాలు మూలనపడ్డాయి.

**మండలానికి ఒక యూనిట్**

జాతీయ జీవనోపాధుల మిషన్‌లో కేంద్రం 25 శాతం రాయితీ కల్పించింది. మిగిలిన సొమ్మును మండల సమాఖ్య నుంచి రుణంగా తీసుకొని ట్రాక్టర్, కల్టివేటర్, బేయర్, రొటోవేటర్, ట్రాలీ, కేజ్ వీల్స్, గడ్డికోత యంత్రాలు కొనుగోలు చేశారు. ఒక్కో యూనిట్‌కు రూ.8 లక్షల నుంచి రూ.13 లక్షలు ఖర్చయింది. గ్రామాల్లో వ్యవసాయ పరికరాలను అద్దెకు ఇచ్చి ఉపాధి అవకాశాలు పెంచాలని నిర్ణయించారు. 2021లో ప్రయోగాత్మకంగా జిల్లాకు ఒకటి చొప్పున ఇవ్వగా ఏడాది తర్వాత అన్ని మండలాలకు ఒక్కోటి కేటాయించారు.


**ఎందుకు ఈ పరిస్థితి?**

కొన్ని మండలాల్లో కేంద్రం ఇచ్చిన రాయితీ సొమ్ముతో పాటు మండల సమాఖ్య నుంచి తక్కువ రుణం తీసుకొని కొనుగోలు చేసుకున్నారు. గ్రామాల్లో చాలా మంది రైతులకు ట్రాక్టర్లు, ఇతర పరికరాలు అందుబాటులో ఉండటంతో గిరాకీ తగ్గింది. ప్రచార లోపంతోనూ రైతులు అద్దెకు తీసుకోవడం లేదు. అధికారులు ఈ విషయంపై దృష్టి పెట్టడం లేదు.కరీంనగర్ జిల్లా నగునూరు గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో రూ.12 లక్షలతో పనిముట్లు కొనుగోలు చేశారు. అవసరం ఉన్న రైతులకు అద్దెకు ఇచ్చారు. మొదట్లో కొంత గిరాకీ రావడంతో ఆదాయం సమకూరింది. తరువాత ఆ పరిస్థితి లేదు.

గ్రామాల్లో పెద్ద రైతులు ట్రాక్టర్లు, ఇతర యంత్రాలను కొనుగోలు చేసుకొని అద్దెకు ఇస్తున్నారు. రైతులు వారికి తరువాత డబ్బులు ఇచ్చే అవకాశముండటంతో రైతులు స్వశక్తి సంఘాల నుంచి తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదు.

# పనులు పరుగులు పెట్టాలి

హైదరాబాద్: నవంబరు నెలాఖరుకల్లా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు పూర్తి చేయాలని ద.మ.రైల్వే నిర్ణయించుకున్నా ఇప్పటివరకు 60శాతం పనులు కూడా పూర్తవ్వలేదు. రూ.699 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టగా మరో 40 శాతం మిగిలున్నాయి. ఇప్పటికే అనేక రైళ్లను చర్లపల్లి, నాంపల్లి, కాచిగూడకు తరలించినా ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో పనులు పరుగులు పెట్టించాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.



**పురోగతిలో ఉన్నవి..**

దక్షిణం వైపు ప్రధాన భవనం, బేస్‌మెంట్ ఉత్తరం వైపు మల్టీలెవెల్ కారు పార్కింగ్ ఉత్తరం వైపు ప్రధాన భవనం, బేస్‌మెంట్ ఎయిర్ కాన్‌కోర్స్ కాజీపేట్ వైపు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నాంపల్లి వైపు ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఫుట్ ఓవర్ బ్రిడ్జితో కూడిన ట్రావెలేటర్.ప్రారంభం 2023 పూర్తి లక్ష్యం 2025 నవంబర్ రోజువారీ ప్రయాణికులు 1,00,000 (ప్రస్తుత అంచనా) రైళ్లు 120

# వ్యయం జాస్తి.. నైపుణ్యం నాస్తి

కర్నూలు : జిల్లాల విభజనకు ముందుకు కర్నూలుకు నైపుణ్యాభివృద్ధి కేంద్రం మంజూరైంది. బి.త్రాండపాడులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో రూ.70 లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులతో భవన నిర్మాణం చేపట్టారు. గత వైకాపా ప్రభుత్వంలో నిర్మాణం పూర్తికాగా సార్వత్రిక ఎన్నికలకు ముందు హడావుడిగా ప్రారంభించారు. అందులో కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదు. రెండేళ్లవుతున్నా వినియోగంలోకి రాకపోవడం గమనార్హం.

**రెండేళ్లుగా అలంకారప్రాయమే..**

బి.తాండ్రపాడు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఐదు సెంట్ల స్థలంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రం నిర్మించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజర్ క్యాబిన్, కార్యాలయం, పైఅంతస్తులో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు వీలుగా ఈ భవనం నిర్మించారు. రెండేళ్లు గడుస్తున్నా ఈ కేంద్రంలో మౌలిక సౌకర్యాలు కల్పించలేదు. అమరావతిలోని నైపుణ్యాభివృద్ధి సంస్థ నుంచి ఫర్నీచర్, టేబుళ్లు, శిక్షణకు అవసరమైన పరికరాలను సరఫరా చేయాల్సి ఉంది. ఇవేవీ లేకపోవడంతో భవనం




నిరుపయోగంగా మారింది. దీంతో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి స్థానిక బిర్లాగేట్‌లోని న్యాక్ సెంటర్ లేదా పాణ్యం నియోజకవర్గానికి చెందిన స్కిల్‌హబ్ కేంద్రంలో కూర్చోవాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వమైనా స్పందించి అవసరమైన సౌకర్యాలు కల్పించి భవనాన్ని వినియోగంలోకి తేవాలని.. శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించాలని నిరుద్యోగ యువత కోరుతోంది.

**శిక్షణ ఊసే లేదు**

ఇందులో యువత, మహిళలకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు మెరుగు పరచాలన్నది లక్ష్యం. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా యువత, నిరుద్యోగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇప్పించాలి. జిల్లాకు రూ.వేల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు రాబోతున్నాయి. ఆయా పరిశ్రమల అవసరాలను గుర్తించి అందుకు తగ్గట్టుగా జిల్లా యువతకు శిక్షణ ఇచ్చి నైపుణ్యాలు పెంపొందించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. కానీ నిరుద్యోగ యువతీ, యువకులకు తాత్కాలిక అవసరాలకు తగ్గట్టుగా శిక్షణ ఇస్తున్నారే తప్ప వారికి శాశ్వత ఉపాధి చూపేందుకు ప్రయత్నించకపోవడంపై పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# స్థాయి పెంచారు.. సేవలు మరిచారు

డోన్ : గనుల ఖిల్లా.. రెండు జాతీయ రహదారుల కూడలి.. నెత్తు'రోడ్డు'తున్న నేల.. దీన్ని దృష్టిలో పెట్టుకొని డోన్ పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రాంతీయ ఆసుపత్రిగా స్థాయి పెంచారు. 'వంద' పడలుగా మార్చారు.. ఇందుకు గత ప్రభుత్వం వైకాపా హయాంలో రూ.37 కోట్లు వెచ్చించారు. పట్టణ శివారులోని పదెకరాల్లో నిర్మించారు. ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభించారు.. స్థాయి పెంచినా అందుకు తగ్గట్లు వైద్యులు, సిబ్బందిని కేటాయించలేదు. రోగులు ఇప్పటికీ కర్నూలుకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

**రక్తనిల్వ కేంద్రం లేక..**

డోన్ పరిధిలో పరిశ్రమలు ఎక్కువగా ఉండటం, రెండు జాతీయ రహదారులు ఉన్నాయి. నిత్యం ఏదో ఓ చోట ప్రమాదాలు జరుగుతుంటాయి. దీంతో క్షతగాత్రులకు రక్తం అత్యవసరం ఉంటుంది. ఇలాంటి సందర్భంలో స్థానిక ఆస్పత్రిలో రక్తనిల్వ కేంద్రం లేకుండాపోయింది. అత్యవసర పరిస్థితుల్లో రక్తం కావాల్సి వస్తే కర్నూలుకు వెళ్లాల్సిందే.

**అత్యవసరం అవస్థలు**

కంటి వైద్యులున్నా కేవలం పరీక్షలు నిర్వహించి మందులు మాత్రమే రాసిస్తున్నారు. పరికరాలు లేకపోవటంతో కేవలం పరీక్షలకే కంటి వైద్యం పరిమితమైంది.

అత్యవసర వైద్యం అందించే ఐసీయూకు పరికరాలు కొరత వేధిస్తోంది. ఇవన్నీ వస్తే మానిటర్లు పెరగటంతో పాటు సిబ్బంది అవసరం ఉంటుంది. కీళ్ల వ్యాధులకు సంబంధించి చిన్నచిన్న పరీక్షలు, చికిత్సలు మాత్రమే చేస్తున్నారు. ఇందుకు అవసరమైన సి-ఆర్మ్ పరికరం



లేకపోవటంతో పెద్ద ప్రమాదాలు జరిగితే శస్త్రచికిత్సలు చేసే వీలులేని పరిస్థితి ఉంది.

**వేధిస్తున్న సిబ్బంది కొరత**

జనరల్ సర్జన్-1, గైనకాలజిస్టు-1, జనరల్ మెడిసిన్-2, స్టాఫ్ నర్సు-5, ఫార్మసిస్టు-1 ఖాళీలు ఉన్నాయి. హోమియో ఫార్మసిస్టే ఓపీ రాయడం గమనార్హం.

**నీరు.. కరవు**

ఆస్పత్రి నిర్మాణ సమయంలోనే నాలుగు బోర్లు వేసినా నీళ్లు పడకపోవటంతో మున్సిపాలిటీ నీటినే వినియోగిస్తున్నారు. పైప్‌లైన్ మరమ్మతులు గురైతే నీటికి ఇబ్బందులు తప్పవు. శుద్ధజల యంత్రం ఉన్నా మధ్యాహ్నానికే నీరు అయిపోతోంది. "వైద్యులు, సిబ్బంది కొరత, యంత్ర పరికరాలు లేకపోవటంపై నివేదించామని, ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి దృష్టికి సైతం తీసుకెళ్లినట్లు ఆసుపత్రి పర్యవేక్షకులు డా.హనీఫ్" తెలిపారు.

**కర్నూలుకు వెళ్లాల్సిందే**

అంతర్గత అవయవాల్లో లోపాలను గుర్తించే కీలకమైన అల్ట్రాసౌండ్ స్కాన్ యంత్రం ఉంది.. రేడియాలజిస్టు లేకపోవటంతో నిరుపయోగంగా మారింది. గదికి తాళం వేశారు. దీంతో పరీక్షల కోసం ప్రైవేట్ కేంద్రాలకు లేదా కర్నూలుకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

సీటీ, ఎమ్మారై యంత్రాలు లేకపోవటంతో వైద్యులు రోగులను కర్నూలుకు రెఫర్ చేస్తున్నారు. గర్భిణులకు టిఫా స్కాన్ చేయించాలన్నా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిందే.

# ఊపిరి అందక ఉక్కిరిబిక్కిరి



తిరుపతి : చలి తీవ్రతతో శ్వాసకోశ వ్యాధులు పెరుగుతున్నాయి. బ్రాంకియో లైటీస్ వైరల్ ఇన్‌ఫెక్షన్ (బీఎల్‌వీ), రెస్పిరేటరీ సెన్సిటియల్ వైరస్ (ఆర్‌ఎస్‌వీ)లు పంజా విసురుతున్నాయి. వీటి వల్ల చిన్నారులు శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ చిన్న పిల్లల ఆస్పత్రుల్లో ఆక్సిజన్, వెంటిలేటర్లపై చికిత్స పొందుతున్నారు.

**ఆక్సిజన్ తప్పనిసరి** బీఎల్‌వీ, ఆర్‌ఎస్‌వీ వైరస్‌ల బారిన పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు పడుతున్నారు. కొందరిలో బ్యాక్టీరియాతో న్యుమోనియా వ్యాపిస్తోంది. వైరల్ న్యుమోనియా ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతుంది. పిల్లల్లో ఏ తరహా న్యుమోనియా ఉందో తెలుసుకునేందుకు పరీక్షలు చేయాల్సి వస్తోంది. రుయాలో పరీక్షా ఫలితాల జాప్యంతో వ్యాధి తీవ్రత పెరుగుతుంది. స్విమ్స్‌లో చిన్నపిల్లల విభాగం సేవలు పెద్దగా లేకపోవడంతో ఆ భారం రుయాపై పడుతోంది. శ్వాసకోశ సమస్యలకు గురైన చిన్నారులకు కనీసం ఐదు రోజులు ఆక్సిజన్ అందిస్తే కోలుకుంటారని రుయా చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్ తెలిపారు.

**లక్షణాలు ఇలా** తీవ్రమైన దగ్గు, కఫం ఉంటుంది.

చల్లటి వాతావరణం ఉన్నా 102 డిగ్రీలపైన జ్వరం కాస్తుంది.

ఛాతిలో నొప్పి, శ్వాస తీసుకోవడం కష్టమవుతోంది.

ఆయాసం, తీవ్రమైన నీరసం ఉంటుంది.

పిల్లలు పాలు తాగకపోవడం, వాంతులు చేసుకుంటారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

పిల్లల్లో మూడు రోజులు దాటి జ్వరం, దగ్గు, శ్వాస తీసుకునేటప్పుడు పక్కలు ఎగరేయడం, ఆయాస పడుతుంటే వైద్యులను సంప్రదించాలి.

కొన్నిసార్లు పిల్లల్లో పెదవులు, చేతులు నీలం రంగులోకి మారిపోతాయి. వారికి వెంటనే చికిత్స అందించాలి.

చిన్నారులకు టీకాలు సకాలంలో వేయించాలి. డీపీటీ, హిబ్‌తోపాటు న్యుమోకోకల్ వ్యాక్సిన్ 6, 10 వారాల్లో రెండు డోసులు, తర్వాత 9 నెలలకు మరో డోసు ఇప్పించాలి. ఈ టీకా ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేస్తోంది.

60 ఏళ్లు దాటిన వారు ఫ్లూ, ఇన్‌ఫ్లూయింజా వ్యాక్సిన్లు ఏటా తీసుకోవడం వల్ల న్యుమోనియా బారిన పడకుండా ఉంటారు.

రుయా చిన్న పిల్లల వార్డులో 60 మంది చిన్నారులకు చికిత్స అందిస్తున్నారు. అందులో 29 మంది ఆక్సిజన్.. ఏడుగురు వెంటిలేటర్లపై ఉన్నారు. అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. గత వారం రోజుల్లో ఐదుగురు చనిపోయారు.

**చివరికి రుయాకు..**

వైరల్ కారణంగా శ్వాస తీసుకోలేక ఇబ్బందిపడుతున్న పిల్లలను మొదట ప్రైవేట్ ఆస్పత్రులకు తీసుకెళ్తున్నారు. వారు వ్యాధి తీవ్రతను సరిగా గుర్తించక రెండు మూడు రోజులు తిప్పుకొంటున్నారు. చివరికి రుయా చిన్నపిల్లల విభాగానికి పంపిస్తున్నారు. అప్పటికే వ్యాధి తీవ్రత పెరగడంతో వెంటిలేటర్ ద్వారా శ్వాస అందించాల్సి వస్తోంది. అక్కడి వరకు వెళ్లిన చిన్నారుల పరిస్థితి విషమంగా ఉంటోంది. ఇంకొందరు పిల్లలను గమనించకుండా చివరి సమయంలో ఆస్పత్రులకు వస్తున్నారు.

# నెయ్యి ప్లాంటుకు గ్రహణం



తిరుపతి : ఒక రోజుకు 15వేల లీటర్ల పాలు ఉంటే 650 కిలోల నెయ్యి ఉత్పత్తి అయ్యే సామర్థ్యంతో దీన్ని ఏర్పాటు చేశారు. ప్లాంటును వినియోగంలోకి తేవాలంటే రోజుకు కనీసం 2 వేల లీటర్ల పాలు ఉంటే 80 కిలోల నెయ్యి తయారు చేయవచ్చు. గోశాలలో ఉత్పత్తయ్యే పాలతో ఈ ప్లాంట్ నడపడం సాధ్యంకానే కాదని నిపుణులు చెబుతున్నారు. ఈ ప్లాంట్‌కు సరిపడా పాలు ఉత్పత్తి కావాలంటే కనీసం ఇప్పుడున్న ఆవులకు అదనంగా మరో 500 దేశవాళీ ఆవులు అవసరం. ఎస్వీ గోశాలలోని నెయ్యి ప్లాంటు నిర్మాణం పూర్తయ్యి మూడేళ్లు గడుస్తున్నా అందుబాటులోకి తీసుకురావడం లేదు. గత ప్రభుత్వ హయాంలో దాత సహకారంతో పనులు ప్రారంభించారు. భవనం నిర్మించి తలుపులకు తాళాలు వేసి వదిలేశారు.

ఎల్ఎస్‌నగర్ వద్ద ఉన్న తితిదే ఎస్వీ గోసంరక్షణ శాలలో 2300 వరకు గోవులున్నాయి. నిత్యం ఇక్కడి నుంచి తిరుమలకు సుమారు 700 లీటర్ల పాలు సరఫరా చేస్తున్నారు. ప్రతి శుక్రవారం స్వామివారి అభిషేకానికి ఇక్కడి పాలనే వినియోగిస్తారు. అన్న ప్రసాదాలతోపాటు క్యూలైన్లు, కంపార్ట్‌మెంట్లలోనూ భక్తులకు టీ, కాఫీ, పెరుగన్నానికి ఈ పాలనే వాడతారు.

**విరాళాలతో గోవుల సేకరణ**

దేశవాళీ గోవు పాలను వినియోగించాలని కాంక్రేజ్, గిర్ జాతికి చెందిన సుమారు 500 ఆవులను దాతల సాయంతో కొనుగోలు చేశారు. వీటితో పాల ఉత్పత్తి పెరిగింది. ఎస్వీ వెటర్నరీ వర్సిటీ సహకారంతో దేశవాళీ గోజాతుల పునరుత్పత్తి చేపట్టి, వీటి సంఖ్యను పెంచడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. మొదటి దశలో 6 పెయ్య దూడలను ఉత్పత్తి చేశారు. వీటి సంఖ్య పెరిగే అవకాశం ఉండటంతో నెయ్యి ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

**దాత సహకారంతో..**

తితిదే ఎస్వీ గోసంరక్షణశాలలో నెయ్యి ప్లాంట్ నిర్మాణానికి మూడేళ్ల ముందు ఆఫ్కాన్స్ సంస్థ ముందుకొచ్చింది. భవన నిర్మాణం ఆ సంస్థ విరాళ రూపంలో పూర్తి చేసి ఇచ్చింది. అప్పటి ప్రభుత్వం ప్లాంటుకు సంబంధించిన యంత్రాలను కొనుగోలు చేసింది. భవన నిర్మాణానికి, యంత్రాల కొనుగోలుకు సుమారు రూ.10 కోట్లు ఖర్చయ్యింది. నిర్వహణకు ఐదుసార్లు టెండర్లు పిలిచినా ఒక్కరూ ముందుకు రాకపోవడం గమనార్హం. అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడానికి హైదరాబాద్‌కు చెందిన దాత ముందుకొచ్చినట్టు సమాచారం. తితిదే అధికారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్లాంటును వినియోగంలోకి తెస్తే రూ.కోట్ల విలువ చేసే పరికరాలు పాడవ్వకుండా ఉంటాయి.

# 'నకిలీ' నర్సులొస్తున్నారు



కర్నూలు : ఆసుపత్రిలో చేరిన రోగులను కంటికి రెప్పలా చూసుకుంటూ.. కన్నవారిని మరిపించేలా సేవలు అందిస్తూ.. వారిలో ధైర్యాన్ని నింపి.. త్వరగా స్వస్థత పొందేలా చూసే పవిత్రమైన నర్సింగ్ వృత్తికి కొందరు కళంకం తెస్తున్నారు. అక్రమార్జన కోసం కొన్ని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు అడ్డదారులు తొక్కుతున్నాయి. ఎడాపెడా విద్యార్థులను చేర్చుకుని.. వారు కళాశాలకు హాజరు కాకున్నా.. వృత్తి నైపుణ్యాలు పెంచే క్లినికల్ ప్రాక్టికల్స్‌కు వెళ్లకున్నా సరే డబ్బు తీసుకుని పరీక్షలు రాయించి.. ధ్రువపత్రాలు ఇస్తున్నారు. వాటి ఆధారంగా వారు పైరవీలు చేసుకుని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నర్సులుగా చేరిపోతున్నారు.

**25 శాతం మంది గైర్హాజరు**

శాంతిరాం, విశ్వభారతి వైద్య కళాశాలలతో పాటు నగరంలోని కొన్ని ప్రైవేటు ఆసుపత్రులకు అనుబంధంగా ఉన్న నర్సింగ్ కళాశాలల విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు అక్కడే హాజరవుతారు.

పది ప్రైవేటు, ఓ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న 2006 మంది మాత్రం మూడు షిఫ్టుల్లో కర్నూలు సర్వజన వైద్యశాలకు క్లినికల్ ప్రాక్టికల్స్‌కు హాజరవ్వాల్సి ఉంది. వీరితో పాటు 7 ప్రైవేటు, ఒక ప్రభుత్వ జీఎన్ఎం నర్సింగ్ కళాశాల నుంచి 1044 మంది జీజీహెచ్‌కు ప్రాక్టికల్స్‌కు హాజరుకావాలి.

ప్రైవేటు కళాశాలల విద్యార్థులు 20- 25 శాతం మంది గైర్హాజరవుతున్నారు. వీరంతా అటు కళాశాలలకు కూడా వెళ్లడం లేదు. వీరి నుంచి కళాశాలల యాజమాన్యం భారీగా డబ్బు తీసుకుని బోగస్ హాజరుతో పరీక్షలు రాయించి సర్టిఫికెట్లు ఇస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**వారు ఎక్కడున్నట్లు**

నగరంలోని ఓ బీఎస్సీ నర్సింగ్ కళాశాలలో నాలుగు సంవత్సరాలకు కలిపి 172 మంది విద్యార్థులు సర్వజన వైద్యశాలకు క్లినికల్ ప్రాక్టికల్స్‌కు హాజరుకావాలి. కానీ 128 మంది మాత్రమే వస్తున్నారు. ఇదే కళాశాల నుంచి జీఎన్ఎం నర్సింగ్ కోర్సుకు సంబంధించి మరో 73 మంది హాజరవ్వాల్సి ఉండగా.. 20 మంది గైర్హాజరవుతున్నారు. మరో ప్రైవేటు కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ కోర్సు చదువుతున్న 192 మంది సర్వజన వైద్యశాలలో ప్రాక్టికల్స్‌కు రావాల్సి ఉంది. 154 మంది మాత్రమే వస్తున్నారు. వీరితో పాటు మూడేళ్ల జీఎన్ఎం నర్సింగ్ కోర్సుకు సంబంధించిన సుమారు 149 మంది హాజరవ్వాల్సి ఉండగా 58 మంది డుమ్మా కొడుతున్నారు.

**నిబంధనల ఉల్లంఘన**

బీఎస్సీ, జీఎన్ఎం నర్సింగ్ కోర్సుల్లో ప్రతి పదిమంది విద్యార్థులకు ఒకరు చొప్పున బోధనా సిబ్బంది ఉండాలి. విద్యార్థులు చదువుతున్న కోర్సు సంవత్సరాన్ని బట్టి క్లినికల్ ప్రాక్టికల్స్ 3, 4, 6, 9 నెలలు ఉంటాయి. ఒకపూట ప్రాక్టికల్స్‌కు హాజరైతే మరోపూట కళాశాలలో పాఠాలు వినాల్సి ఉంటుంది.

ప్రైవేటు కళాశాలల్లో బీఎస్సీ, జీఎన్ఎం కోర్సుల్లో చేరిన వారిలో చాలామంది కళాశాలలకు వెళ్లడం లేదు. వారు ప్రాక్టికల్స్‌కు కూడా రాకుండా నేరుగా పరీక్షలకు హాజరవుతున్నారు. వీరి నుంచి కళాశాలల నిర్వాహకులు రూ.వేలల్లో డబ్బు తీసుకుని పరీక్షలు రాయిస్తున్నారు. వీటిని పర్యవేక్షించేందుకు ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నుంచి వచ్చే అధికారులు కూడా పైరవీల కారణంగా మొక్కుబడి తనిఖీలతో సరిపెడుతున్నట్లు పెద్దఎత్తున ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

# 'మాను'కు మంట

నంద్యాల : రహదారుల వెంట చెట్లకు రక్షణ కరవైంది.. అక్రమార్కుల గొడ్డలి వేటుకు నేలవాలుతున్నాయి. జిల్లాలో 1,657.684 కి.మీల పొడవునా ఆర్‌అండ్‌బీ రహదారులు, 1,884.674 కి.మీ. పొడవునా పంచాయతీ రహదారులు ఉన్నాయి. వీటికి ఇరువైపులా ఏళ్ల కిందట నాటిన మొక్కలు భారీ వృక్షాలయ్యాయి. ఇందులో వేప, చింత, బిర్శన, అవిశ చెట్లు ఉన్నాయి. వీటికి మార్కెట్లో డిమాండ్ ఎక్కువగా ఉండటంతో అక్రమార్కులు రాత్రికి రాత్రే పడగొడుతున్నారు. ముందుగా చెట్టు మొదళ్లలో 'నిప్పు' పెడతారు. కొంత భాగం కాలిన వెంటనే అక్రమార్కులు గొడ్డళ్లు, రంపాలతో కోసి తరలిస్తున్నారు. మరికొన్నిచోట్ల ముందుగా పెద్దపెద్ద కొమ్మలను నరికి.. ఆ తర్వాత రంపాలతో కోసి తీసుకెళ్తున్నారు. ఆయా శాఖల అధికారుల వద్ద లెక్కాపత్రం లేకపోవడం అక్రమార్కులకు కలిసి వస్తోంది.

**ఎవరూ పట్టించుకోక**

నంద్యాలలో ముగ్గురు కలప స్మగ్లర్లు ప్రత్యేకంగా వేప చెట్లను మాత్రమే నరికిస్తూ పెద్దఎత్తున కూడబెట్టుకున్నారు. గిరిజనుల చేత నరికించి టింబర్ డిపోలకు గుట్టుగా విక్రయిస్తున్నారు.

నంద్యాల-ఆత్మకూరు రహదారిలో బండిఆత్మకూరు-పార్నపల్లి మార్గంలో ఉన్న వేప చెట్లను కొన్ని నెలల కిందట నరికేశారు. ఓ అటవీ అధికారి సాయంతో టింబరు డిపో యజమానులు కోత మిషన్లతో చెట్లను కూల్చివేసినప్పటికీ కనీస చర్యలు కరవయ్యాయి. ఓ నేత సమీప బంధువులే నరికివేయించారన్న ఆరోపణలున్నాయి. పాణ్యం-బనగానపల్లి ఆర్‌అండ్‌బీ రహదారిపై ఉన్న వేప చెట్లపై అక్రమార్కులు గురి పెట్టారు. ఒకదాని తర్వాత ఒకటి నరికేస్తూ తరలిస్తున్నారు. పాణ్యం నూలు మిల్లులో పెద్దఎత్తున ఉన్న చెట్లను అక్రమార్కులు ఇటీవల పెద్దఎత్తున నరికి కలపను విక్రయించి సొమ్ము చేసుకున్నారు. గడివేముల-నందికొట్కూరు రహదారిలో 30 ఏళ్ల కిందట తలముడిపి పాఠశాలలో పనిచేసిన ఓ ఉపాధ్యాయుడు విద్యార్థులతో 2 కి.మీల నాటించిన మొక్కలు భారీ చెట్లుగా పెరిగాయి. వీటిల్లో బిర్శన, వేప, కానుగ తదితర చెట్లు ఉన్నాయి. వీటికి ఇటీవల నిప్పు పెట్టారు. సగం కాలి అవి కింద పడిపోగానే రహదారికి అడ్డుగా ఉన్నాయంటూ తరలించుకుపోయారు.

**వేప చెట్లపై గురి**

నంద్యాల-ఆత్మకూరు, పాణ్యం-బనగానపల్లి, బనగానపల్లి-కోవెలకుంట్ల, నంద్యాల-నందికొట్కూరు, చాగలమర్రి-శిరివెళ్ల, డోన్-బనగానపల్లి తదితర రహదారులను ఆనుకుని పెద్దఎత్తున వేప చెట్లు ఉన్నాయి. వేప కర్రను ఇంటి తలుపులతోపాటు కిటికీలు, చౌకట్లకు పెద్దఎత్తున వాడుతుంటారు. ఈ కలపకు బహిరంగ విపణిలో ఎక్కువగా డిమాండ్ ఉంది. వేప చెట్లను నరికి టింబరు డిపోల్లోకి నేరుగా తీసుకెళుతున్నా అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. గత ఐదేళ్లలో రాష్ట్ర రహదారుల వెంబడి ఉన్న వందలాది వేప చెట్లు గొడ్డలి వేటుకు గురయ్యాయి. మిడుతూరు సమీపంలో పొలాలకు అడ్డుగా ఉన్నాయని పెద్ద చెట్లను నరికేస్తుండగా అటవీ అధికారులు కేసు నమోదు చేశారు.

# ఆధార్ లోపాలు.. అపార్ కష్టాలు

కర్నూలు : ప్రతి విద్యార్థికి ఆధార్ తరహాలో ఒక ఐడీ ఉండాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అపార్ (ఏపీఏఏఆర్ : ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)ను తీసుకొచ్చింది. ఈ ఐడీతో ప్రతి విద్యార్థికి ఒక డిజీ లాకర్ ఏర్పడుతుంది. ఇందులో ఒకటో తరగతి నుంచి ఆ విద్యార్థికి చెందిన అర్హత పత్రాలు, ఆధార్‌తో పాటు ఇతర పత్రాలన్నీ నిక్షిప్తమై ఉంటాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చేపట్టిన అపార్ ఐడీ నమోదు ప్రక్రియ ఇప్పటి వరకు 85 శాతమే పూర్తయింది. ఆధార్‌కార్డులోని సమాచారం.. పాఠశాల దస్త్రాల్లోని వివరాల్లో వ్యత్యాసాల కారణంగా మిగిలిన 15 శాతం మంది పిల్లలకు అపార్ నమోదులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటి సవరణ కోసం పిల్లలు, వారి తల్లిదండ్రులు ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం లేదు.

పుట్టిన తేదీ వివరాల్లో తేడాలు

ఉమ్మడి జిల్లాలో సుమారు 72 వేల మంది విద్యార్థులకు అపార్ నమోదు కావాల్సి ఉంది. ఆధార్ పత్రంలో చాలామంది పిల్లల పుట్టిన తేదీ జనవరి 1 అని ఉంది. పాఠశాల దస్త్రాల్లో మరోరకంగా ఉంది. ఇలా పుట్టిన తేదీ వేర్వేరుగా ఉండటంతో అపార్ నమోదు కావడం లేదు. ఆధార్‌లో పుట్టిన తేదీ మార్చాలంటే జనన ధ్రువీకరణ పత్రం అవసరం. ఇది చాలామందికి లేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల పిల్లలకు పుట్టిన తేదీ వివరాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరముందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

ఇలా చేస్తే ఉపశమనం

అపార్ నమోదులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించిన ఉపాధ్యాయులు తమ అభ్యర్థనలను జిల్లా విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా విద్యార్థి ఆధార్ కార్డులో పేరు, పుట్టిన తేదీ మార్పు కోసం ప్రధానోపాధ్యాయుడు జారీ చేసే పత్రాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. అపార్ నమోదు పెండింగ్ ఉన్న పాఠశాలలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఆధార్ కార్డులో లోపాలు సరిచేసే అవకాశం కల్పిస్తే సమస్య పరిష్కారం అవుతుందని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

# పట్టు'పట్టా'రో.. ఆక్రమణే!

విశాఖపట్నం: డీపట్టాల సమీపంలోని ప్రభుత్వ భూములపై కొందరు కన్నేస్తున్నారు. వాటిని ఎలాగైనా తమ పరం చేసుకోవాలని వ్యూహాలు పన్నుతున్నారు. ఇళ్ల స్థలాలు, పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం భూసమీకరణ, సేకరణ వేగంగా సాగిస్తోంది. ఆక్రమణదారులకూ పరిహారం అందిస్తోంది. ఇదే అదనుగా అక్రమార్కులు రంగంలోకి దిగారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో విలువైన భూములను హస్తగతం చేసుకునే కుట్రలకు తెరతీశారు. రైతులతో మాట్లాడుకొని గతంలో డీపట్టాలు పొందిన రైతుల నుంచి ఆ భూములు ప్రైవేటు వ్యక్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతిలోకి ఎప్పుడో వెళ్లిపోయాయి. ప్రస్తుతం ఆ భూములకు విలువ పెరగడంతో సమీప ప్రభుత్వ భూములు కొట్టేసేందుకు స్థానిక రైతులను పావులుగా వాడుకుంటున్నారు. ఆ భూముల్లోకి కొందరిని పంపించి పనులు చేయిస్తున్నారు. కొందరితో మొక్కలు నాటించి పెంచుతున్నారు. ఇంకొందరితో చుట్టూ రక్షణ కంచె వేయిస్తున్నారు. ఈ భూముల్లో ఎప్పటినుంచో ఉంటున్నామని, ఆక్రమణ దారులుగా చెప్పుకునే ప్రయత్నం జరుగుతోంది. తెరపై రైతులు కనిపిస్తున్నా... వెనకుండి నడిపించే వారు మరొకరు. ఇప్పటికే భూసేకరణ జరిగిన కొన్ని గ్రామాల్లో ఇదే తరహాలో అక్రమాలు జరిగాయని సమాచారం. అలా అలా గుప్పిట్లోకి ఆనందపురం మండలం తర్లువాడలో ఒకరికి గతంలో ప్రభుత్వం డీపట్టా అందించింది. అక్కడ సదరు వ్యక్తి ఇంటి నిర్మాణం, పశువులశాల నిర్మించి కొంత వ్యవసాయం చేసుకుంటున్నారు. ఇప్పుడు ఆ భూములకు సమీపంలో దిగ్గజ సంస్థలు పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తన స్థలానికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో ఆక్రమణకు పాల్పడుతున్నారు. కొంత తమ ఆధీనంలో ఉన్నట్లు చెప్పుకునేందుకు చెట్లు, పొదలు తొలగించి పనులు చేస్తున్నారు. ఆనందపురం మండలంలో శొంఠ్యాం, గిడిజాల, దుక్కవానిపాలెంలో ఇదే తరహాలో అవకతవకలు చోటుచేసుకున్నాయి. భీమిలి మండలంలోని అన్నవరం మరికొన్ని గ్రామాల్లో ఇలాగే ఎత్తుగడలు సాగుతున్నాయి. పెందుర్తి మండలంలోని కొన్ని గ్రామాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు కీలక నేతల అండదండలతోడీపట్టాలకు సమీపంలోని భూములను ఆక్రమిస్తున్నారు.

చురకలు



# మామిడి, టమాటా రైతులకు తీపికబురు

అనంతపురం : జిల్లాలో ఉద్యానశాఖ ద్వారా మామిడి, టమాటా రైతులకు బుట్టలను రాయితీపై అందించనున్నారు. వీటిని 50 శాతం రాయితీతో అందిస్తారు. జిల్లాకు 52,500 బుట్టలు పంపిణీ చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. మామిడి రైతులకు 24 కిలోల బుట్టలు, టమాటా రైతులకు 15 కిలోలవి రాయితీతో అందించనున్నారు. 24 కిలోలు పట్టేవి ఒక్కో రైతుకు హెక్టారుకు 250, 15 కిలోలవి ఒక్కో రైతుకు 100 చొప్పున పంపిణీ చేయనున్నారు. పెద్ద బుట్ట పూర్తి ధర రూ.240 కాగా అందులో రూ.120 రాయితీ పోను,



మిగిలిన రూ.120 రైతువాటా కింద చెల్లించాల్సి ఉంటుంది. చిన్న బుట్ట పూర్తి ధర రూ.120 కాగా అందులో సగం రైతు వాటా కింద చెల్లించాల్సి ఉంటుంది. కావాల్సినవారు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మరింత సమాచారానికి డివిజన్‌స్థాయిలో ఉద్యానాధికారులను(హెచ్‌వో) రైతులు సంప్రదించాలని ఉద్యానశాఖ ఉప సంచాలకురాలు ఉమాదేవి తెలిపారు.

# అరక పట్టి.. అక్షరం నేర్చి

తిరుపతి : సాధారణంగా ఏ కోర్సు చేసినా.. ముందుగా పుస్తకాలు చదివిన తరువాత ప్రాక్టికల్స్ చేస్తుంటారు. తరగతిలో అన్నీ నేర్చుకున్నాకే క్షేత్రస్థాయిలో అడుగుపెడతారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దీక్షారంభ్ కార్యక్రమం ఇందుకు భిన్నంగా, విద్యార్థుల్లో ఆసక్తిని పెంచుతోంది. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో ఇటీవల బీఎస్సీ(వ్యవసాయం) నాలుగేళ్ల కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు తరగతి గదిని పరిచయం చేయడానికి ముందే క్షేత్రస్థాయికి పంపిస్తున్నారు.

**క్షేత్రస్థాయి పర్యటనలు..**

వ్యవసాయ పనులతోపాటు తిరుపతి పరిసరాల్లోని ప్రముఖ విద్యాసంస్థలు, జంతు ప్రదర్శనశాల, సైన్స్ సెంటర్ సందర్శనకు వెళ్తున్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణుల సూచనలు, విద్యార్థుల్లో దాగిన క్రీడా, సాంస్కృతిక, వ్యాసరచన పోటీలలో ప్రతిభను గుర్తించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నీట్, ఏపీఈఏపీ సెట్ లాంటి కఠినమైన ప్రవేశపరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వీరంతా తిరుపతి సమీపంలోని పెరుమాళ్లపల్లె వ్యవసాయ పరిశోధన స్థానంలో వ్యవసాయ విద్యతో పాటు సమాజం,



సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేసేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ విద్యా విధానం- 2020 అమలులో భాగంగా విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో చేరే విద్యార్థులకు విభిన్నంగా స్వాగతం పలికేందుకు కేంద్ర ప్రభుత్వం పరిచయం చేసిందే 'దీక్షారంభ్'. కొత్తగా ప్రవేశం పొందిన విద్యార్థులకు రాగానే పాఠ్యాంశాలు బోధించకుండా 10 రోజుల పాటు కళాశాల వాతావరణం, సంప్రదాయాలు, సంస్కృతి పరిచయం చేస్తున్నారు. వారు చేరిన కోర్సు స్వభావం, అది విజయవంతంగా పూర్తి చేసేందుకు కార్యాచరణ తదితర అంశాలను ముందస్తుగా పరిచయం చేయడమే దీక్షారంభ్ ముఖ్య లక్ష్యం.

**గతేడాది ఫలితాలే స్ఫూర్తి- డా. ఎం.శేఖర్ రెడ్డి, అసోసియేట్ డీన్, వ్యవసాయ కళాశాల**

2024 నుంచి కళాశాలలో దీక్షారంభ్ ప్రారంభించారు. గతేడాది మంచి ఫలితాలు వచ్చాయి. అదే స్ఫూర్తితో ఈ ఏడాది మరిన్ని ప్రయోజనకర సందర్శనలు, కార్యక్రమాలు రూపొందించి విజయవంతంగా కొనసాగిస్తున్నాం. విద్యార్థులు సైతం ఉత్సాహంగా పాల్గొంటున్నారు

# స్వచ్ఛమేవ జయతే..!


తిరుపతి : 'స్వచ్ఛభారతాన్ని సాధిద్దాం.. ప్రతి మనిషి ఏడాదికి వంద గంటలు పరిశుభ్రతకు కేటాయించాలి. గాంధీ కలలు కన్న పరిశుభ్ర భారతావనిని సాధించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరం పని చేద్దాం.'- 2014 అక్టోబరు 2 గాంధీ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలకు ఇచ్చిన సందేశమిది. ప్రధాని మోదీ పిలుపు మేరకు శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ బ్యూరో అప్పటి నుంచి ప్రతి శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహిస్తోంది. వర్సిటీలోని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామీణ ప్రాంతాలు, మురికివాడల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రత్యేక శిబిరాల ద్వారా పరిసరాల పరిశుభ్రత వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నారు. ఇప్పటివరకు వెయ్యికిపైగా కార్యక్రమాలతో ఆయా ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములయ్యారు. తడి, పొడి చెత్తను వేరు చేయడంపై అవగాహన కల్పిస్తున్నారు.

**ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర**

రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు ప్రతి మూడో శనివారం 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నారు. రోడ్లపై చెత్త ఊడ్చడం, భవనాల ముందు పిచ్చిమొక్కలు తొలగించడం, పూలు, పండ్ల మొక్కలు నాటి వాటిని సంరక్షించడం వంటి కార్యక్రమాలు చేస్తున్నారు.

స్ఫూర్తిదాయకంగా నిలవాలి- మంజీరసుధ, వాలంటీర్ దేశ ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపును అందుకుని స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. ప్రభుత్వంపై ఆధారపడకుండా స్వచ్ఛందంగా పనులు చేపట్టాలి. ప్రతి శనివారం కొన్ని యూనిట్లు, ప్రతి మూడో శనివారం కొన్ని యూనిట్లతో వర్సిటీలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా మా భవనాల ముందున్న పిచ్చిమొక్కలు తొలగించి, చెత్తను దూరంగా వేయడం, మొక్కలు నాటి సంరక్షిస్తున్నాం. సమాజంపై బాధ్యతగా మెలిగేలా- ఐ.వి.లలితకుమారి, ఎన్ఎస్ఎస్ సెల్ సమన్వయకర్త ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు వారంతట వారే వారికి కేటాయించిన ప్రాంతాలకు వెళ్లి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. పిచ్చిమొక్కలు, చెత్తను తొలగిస్తారు.

# పెన్నోబిలేశుడికి రథప్రాప్తి ఎన్నడో?



అనంతపురం : దేవాదాయశాఖ అధికారుల వైఫల్యం, గుత్తేదారు ఇష్టారాజ్యం పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి భక్తుల పట్ల శాపంగా మారింది. వందేళ్ల నాటి రథం శిథిలమై నాలుగేళ్లు, కొత్త రథం తయారీ పనులు మొదలై మూడేళ్లు కావొస్తోంది. అయినా కొత్త రథం తయారీ ఇప్పటికీ కొలిక్కి రాకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. నిధులు పుష్కలంగా ఉన్నా నాలుగేళ్లుగా శిథిల రథానికే మరమ్మతులు చేసి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీంతో స్వామివారి నూతన రథం కోసం విరాళాలు ఇచ్చిన వేలాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. అధికారులు స్పందించి వచ్చే ఏడాదైనా నూతన రథాన్ని అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఆదాయం ఉన్నా..** పెన్నహోబిలం ఆలయానికి వేల ఎకరాల భూమితోపాటు ఏటా హుండీల ద్వారా రూ.కోటికి పైగా ఆదాయం వస్తోంది. కొత్త రథం తయారీ కోసం భక్తులు మూడేళ్ల కిందటే రూ.కోటి వరకు విరాళాలు ఇచ్చారు. 2024 ఫిబ్రవరిలో రథం తయారీకి రూ.1.78 కోట్లకు టెండర్లు పిలిచి పనులను గుత్తేదారుకు కట్టబెట్టారు. మిగిలిన నిధుల్ని ఆలయ ఖాతా నుంచి వినియోగించేందుకు నిర్ణయించారు. అదే ఏడాది మార్చిలో రథం తయారీ పనులు మొదలుపెట్టగా అవి ముందుకు సాగలేదు. అప్పటి వైకాపా పాలకులకు గుత్తేదారు అనుకూలంగా ఉండటంతో పనులు చేపట్టకపోయినా పట్టించుకోలేదు. ఇదే క్రమంలో టెండరు పూర్తయ్యాక కూడా మరోసారి భక్తుల నుంచి విరాళాల సేకరణకు కరపత్రాలు ముద్రించారంటే అధికారుల నిర్లక్ష్యం ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

**అంతా ఆయన కనుసన్నల్లోనే..**

గత వైకాపా ప్రభుత్వంలో రథం తయారీ పనుల్ని వైకాపాకు వీరవిధేయుడైన ఓ వ్యక్తికి అప్పగించారు. గత ఎన్నికలకు ముందు కొందరు తయారీదారులతో ఒప్పందం కుదుర్చుకుని హడావుడి చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత బదిలీల్లో అక్కడి అధికారులను మార్చారు. ఆ తరువాత వచ్చిన అధికారులు రథం తయారీపై రాజకీయాన్ని ప్రారంభించారన్న ఆరోపణలు ఉన్నాయి. గుత్తేదారు మీద ఒత్తిడి తెచ్చి, రథం తయారీని వేగవంతం చేయకుండా ఈ ప్రభుత్వంలో కూడా ఆయనకే వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఓ అధికారితోపాటు మరో కీలక వ్యక్తి డబ్బును డిమాండు చేయడంతోనే రథం తయారీదారులు పనులు వదిలేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో అధికారులకు, తయారీదారులకు మధ్య పెద్దఎత్తున వాదనలు జరిగి పంచాయితీలు కూడా చేసినట్లు ప్రచారం జరుగుతోంది. రథం నిర్మాణంపై పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఇన్‌ఛార్జి ఈవో తిరుమలరెడ్డి వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని.. తాను బాధ్యతలు తీసుకుని కొన్ని రోజులే అయ్యిందన్నారు.

# రహదారులు.. పైపూతలకు దిక్కులేదు!



అనంతపురం : తాడిపత్రి నుంచి సజ్జలదిన్నె మీదుగా ఆలూరుకు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో గుంతలు పడిన చిత్రమిది. సుమారు 9 కి.మీ ఈ రహదారి ఉంది. రహదారి పొడవునా గుంతలున్నాయి. తారురోడ్డు నెర్రెలు చీలి అధ్వానంగా ఉంది. రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.రహదారులు, భవనాలశాఖ పరిధిలోని పలుచోట్ల రహదారులు అధ్వానంగా మారాయి. అనంతపురం జిల్లాలో 1,840 కి.మీ, శ్రీసత్యసాయి జిల్లాలో 2,400 కి.మీ మేరకు ర.భ.శాఖ పరిధిలో రహదారులున్నాయి. అందులో సుమారు 30 శాతం మేరకు రోడ్లు దారుణంగా ఉన్నాయని అధికారులు గుర్తించారు. కొన్నిచోట్ల ప్యాచ్‌వర్కులు, మరికొన్ని చోట్ల కొత్తగా రోడ్లు వేయాల్సి ఉంది. ఆర్అండ్‌బీ రహదారి అంటేనే ఎంతోమన్నికగా, గుంతలు లేకుండా ఉంటాయి. క్షేత్రస్థాయిలో నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో రోడ్డు నిర్మించిన కొంత కాలానికే గుంతలు ఏర్పడుతున్నాయి. పంచాయతీ, జడ్పీ రోడ్లకంటే దారుణంగా ఆర్అండ్ బీ రోడ్లు తయారవుతున్నాయి. రోడ్లు నిర్మించిన తరువాత టెండరు ఒప్పందం ప్రకారం నిర్వహణ బాధ్యతలు కూడా గుత్తేదారుడిపై ఉంటుంది. ఇవేవీ అమలుకావడం లేదు. టెండర్లు నిర్వహిస్తే కమీషన్లు వస్తాయనే ఉద్దేశంతో కొందరు అధికారులు రోడ్డు మొత్తం పాడయ్యే వరకూ పట్టించుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి.

అనంత జిల్లాలో పెద్దపప్పూరు, కుందుర్పి, శింగనమల, గుంతకల్లు, గుత్తి, బొమ్మనహాళ్, శ్రీసత్యసాయి జిల్లాలో కదిరి, బుక్కపట్నం, హిందూపురం తదితర మండలాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వరద సాయం లేనట్లేనా?


భారీ వర్షాలు, తుపానులతో ఉమ్మడి జిల్లాలో కొంతవరకు రహదారులు దెబ్బతిన్నాయి. అయితే తుపాను తీవ్రత జిల్లాలో తక్కువగా ఉన్నందున ప్రత్యేక నిధులు కేటాయించలేదని సమాచారం. ఉన్న నిధులతోనే రోడ్లకు మరమ్మతు చేయించాలి. లేకపోతే ఇప్పటికే దెబ్బతిన్నవి మరింత అధ్వానంగా మారే అవకాశముంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 500 కి.మీ. మేరకు మరమ్మతు చేయాల్సి ఉంది.

**మరమ్మతులు చేయిస్తాం**

- మురళీకృష్ణ, పర్యవేక్షక ఇంజినీరు, ర.భ.శాఖ

కొంతమేరకు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వీటి వివరాలతో నివేదికను ప్రభుత్వానికి పంపించాం. మెయింటెనెన్స్ కింద గుంతలు పడిన రోడ్లు బాగు చేయిస్తాం.

# రూ.870 కోట్లతో కొత్త తాగునీటి పథకాలు



రాయదుర్గం : నియోజకవర్గాలకు మరో 33 ఏళ్ల దాకా ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం రెండు బృహత్తర తాగునీటి పథకాలను రూపొందించింది. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఈ పథకాలను చేపట్టనున్నారు. వీటిని త్వరలోనే మంజూరు చేసే అవకాశం ఉందని గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈ డి.రామారావు తెలిపారు. ఇప్పటికే ఈరెండు పథకాలకు సంబంధించిన సర్వే, డీపీఆర్‌లు పూర్తయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50శాతం నిధులు భరించనున్నాయి.

ః ఉరవకొండ నియోజకవర్గానికి రూ.480 కోట్లు, రాయదుర్గానికి రూ.390 కోట్ల ప్రతిపాదనలు తయారు చేశారు. రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఈ పథకాల మంజూరుకు కృషి చేశారు. ప్రస్తుతం ఉన్న శ్రీరామిరెడ్డి పథకానికి సమాంతరంగా పీఏబీఆర్ నుంచి ఆయా నియోజకవర్గాలకు నేరుగా కొత్త పైపులు వేయనున్నారు. నీటిని తోడే ఇంటెక్వెల్, జలశుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. రాయదుర్గం నియోజకవర్గానికి 210 కిలోమీటర్ల మేర పైపులైన్ వేయనున్నారు.

**ముగియనున్న శ్రీరామిరెడ్డి పథకం గడువు**

రాయదుర్గం నియోజకవర్గానికి 20 ఏళ్లదాకా పీఏబీఆర్ నీటిని సరఫరా చేసేందుకు 2008లో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. మరో మూడేళ్లలో ఈ పథకం కాల పరిమితి పూర్తి కానుంది. మరో 30 ఏళ్ల దాకా అప్పటి జనాభాను దామాషా పద్ధతిలో అంచనా వేసి ఈ రెండు పథకాలను డిజైన్ చేశారు. ప్రస్తుతం శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా 153 గ్రామాల్లో ఒక వ్యక్తికి రోజుకు 40 లీటర్ల నీటిని సరఫరా చేస్తుండగా కొత్త పథకాల ద్వారా ప్రతి వ్యక్తికి 55 లీటర్లు ఇవ్వనున్నారు.

**భవిష్యత్తు అవసరాలకే..**

- డి.రామారావు, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్, రాయదుర్గం

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాల గడువు పూర్తికావస్తుంది. రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల ప్రజల దాహార్తిని మరో 30 ఏళ్ల దాకా తీర్చేందుకు రూ.870 కోట్లతో రెండు పథకాలను రూపొందించాం. వీటికి ప్రభుత్వ అనుమతి రాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

# చిక్కులు తీర్చుతూ.. ఉపాధికి బాటవేస్తూ..

తిరుపతి: రాష్ట్రానికే తలమానికంగా నిలిచిన శ్రీసిటీని మరింత విస్తరించి లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 8 వేల ఎకరాల్లో సెజ్ ఉండగా.. తాజాగా మరో 2,500 ఎకరాలు సేకరించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు.ప్రస్తుతం 65 వేల మందికి..: శ్రీసిటీలో 65 వేల మంది ఉద్యోగాలు చేస్తున్నారు.జపాన్‌కు చెందిన పరిశ్రమలు మన దేశంలో పెట్టుబడులు పెట్టాలని భావిస్తే తొలుత శ్రీసిటీకే ప్రాధాన్యం ఇస్తున్నాయి. దాదాపు 35 కంపెనీలు ఇక్కడ ఉత్పత్తి చేస్తున్నాయి. కొత్తగా సేకరించే 2,500 ఎకరాల్లోనూ జపనీస్ పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఎంఎస్ఎంఈ పార్కును అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు.ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే సీఎం చంద్రబాబు శ్రీసిటీని సందర్శించి 15 పరిశ్రమలను ప్రారంభించారు. అప్పట్లోనే విస్తరణకు భూమి సేకరించాలని ఆదేశించారు. అంగీకరిస్తే తమిళనాడులోనూ..: అదనంగా మరో 3,500 ఎకరాలు సేకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు




ఆకాంక్ష. శ్రీసిటీ పొరుగునే ఉన్న తమిళనాడు ప్రభుత్వం అంగీకరించి, ప్రజలను ఒప్పిస్తే ఈ మేరకు లక్ష్యం సాకారం కానుంది.

**ఆరు- ఎనిమిది నెలల్లో**

వచ్చే ఏడాది జులై నాటికి భూములు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 50 దేశాలకు చెందిన 500 కంపెనీలను ఆకర్షించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. దాదాపు 1.50 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా కృషి చేస్తున్నారు.

**వీలైనంత త్వరగా..**- వెంకటేశ్వర్, కలెక్టరు శ్రీసిటీకి మరింత స్థలం కావాలని అడగడంతో 2,500 ఎకరాలు సేకరిస్తున్నాం. వీలైనంత త్వరగా సేకరించి అప్పగిస్తాం. రైతుల అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకొని, ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం.

# నేరస్థుల గుండెల్లో రైళ్లు

తిరుపతి : తిరుపతి ఎస్టీవీ నగర్‌కు చెందిన రౌడీషీటర్ ఫిరోజ్ (26) మద్యం దుకాణం వద్ద కత్తితో హల్‌చల్ చేశాడు. మందు కోసం అక్కడున్న వారిని కత్తితో బెదిరించాడు. పోలీసులు ఫిరోజ్ నేర చరిత్రను గుర్తించి కేసు పెట్టారు. అతనిపై ప్రజల్లో భయాన్ని పోగొట్టడానికి రోడ్లపై నడిపించుకుంటూ కోర్టుకు తీసుకెళ్లారు.

ఓ కీచక ఉపాధ్యాయుడు (55) ఓ బాలికను గత మూడేళ్లుగా లైంగికంగా వేధించాడు. బాలిక శరీరంలోని మార్పులను గుర్తించిన తల్లి ఆస్పత్రికి తీసుకెళ్లింది. వైద్యుడు చెప్పిన మాటతో కంగారు పడి.. కారకుడు ఎవరని నిలదీయగా కీచక ఉపాధ్యాయుడి బాగోతం బయటపడింది. పోలీసులు కేసు పెట్టి బాలికలపై మరొకరు చెయ్యి వేసేందుకు సాహసించకూడదని అతన్ని నగర రోడ్లపై నడిపించుకుంటూ న్యాయమూర్తి ముందు నిలబెట్టారు. తాజాగా జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం.. నేరాలకు పాల్పడే ఆరుగురు నేరస్థులపై ఉక్కుపాదం మోపింది. మళ్లీ వీళ్లు నేరాలకు పాల్పడే అవకాశం ఉందని గుర్తించి వారిపై పీడీ యాక్టు (ముందస్తు నిర్బంధం) అమలు చేసి జైలుకు పంపారు.

జిల్లాలో నేరాలను కట్టడి చేయడానికి పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తోంది. తప్పు చేస్తే వదలరనే భయం అటు నేరస్థుల్లో.. పోలీసులు ఉన్నారనే భరోసాను ఇటు ప్రజల్లో కల్పిస్తోంది. ఇందుకు పైఉదాహరణలే నిదర్శనం.

**చరిత్రలో మొదటిసారిగా..**

జిల్లా చరిత్రలో మొదటిసారిగా ఆదివారం ఆరుగురిపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపించారు. బాలికలను వేధిస్తున్నట్లు గుర్తించిన 160 మందిపై ఇప్పటికే పోక్సో కేసు నమోదైంది. గంజాయి రవాణా.. విక్రయాలు సాగిస్తున్న 16 మందిపై, భూకబ్జాదారులపై పీడీ యాక్ట్ నమోదు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు.

రాత్రిళ్లు గస్తీ..జిల్లాలో రాత్రి 11 నుంచి 2 గంటల మధ్య సీఐ స్థాయి అధికారి ఆధ్వర్యంలోని బృందం పట్టణం, మండలాల్లో గస్తీ కాస్తున్నారు. తాగి వాహనాలు నడిపితే డ్రంకన్ డ్రైవ్ కేసులు పెడుతున్నారు. అందుకు ప్రతి పీఎస్‌కు బ్రీత్ అన్‌లైజర్ పరికరం అందజేశారు. డ్రోన్లు ఎగరేసి మందుబాబులు, జూదగాళ్ల స్థావరాలను గుర్తిస్తున్నారు. పాపిలాన్ పరికరంలో వేలిముద్రలు తీసుకొని నేరస్థుల ఆటకట్టిస్తున్నారు.

# కార్తిక కష్టం..!

శ్రీకాళహస్తి: కార్తిక మాసం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకునేందుకు ఇసుకేస్తే రాలనంతగా జనం తరలివచ్చారు. ఆఖరు సోమవారం పురస్కరించుకుని ఆలయం తెరిచే సమయానికి అన్ని క్యూలైన్లు నిండిపోయాయి. ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలు పెద్దఎత్తున వెలిగించారు. ఉదయం నుంచి రాత్రి ఆలయం మూతవేసే సమయానికి దాదాపు 40 వేల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు భావిస్తున్నారు. రాహు, కేతు సర్పదోష నివారణ పూజలు, ఆర్జిత సేవల టికెట్లు, ప్రసాద విక్రయాలు భారీగా జరిగాయి.సమాచారలోపం.. సంకటం: రాహు,



కేతు పూజల కౌంటర్లు ఒక దగ్గర, పూజలు నిర్వహించే మండపాలు మరోచోట, దర్శనాలకు వెళ్లే క్యూలైన్లు మరోచోట ఉండటంతో భక్తులు గందరగోళానికి గురయ్యారు. పూజలకు ఎటు వెళ్లాలి.. పూజలయ్యాక దర్శనాల కు ఎటువైపు నుంచి వెళ్లాలో తెలియక భక్తుల పరిస్థితి దయనీయంగా మారింది. దీనిపై స్పష్టమైన సమాచారం ఇచ్చేవారు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దర్శనం పూర్తయ్యేసరికి కనీసం నాలుగైదు గంటలు పట్టడంతో భక్తులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. రద్దీ సమయంలో శీఘ్రదర్శనం, ప్రత్యేక, సర్వదర్శనాల క్యూలైన్ల ప్రారంభం వద్ద చిన్నపాటి మైకులతో భక్తులకు అవగాహన కల్పిస్తే ఈ తరహా కష్టాలు కాస్తయినా తప్పే అవకాశముంది.

## ఎంపీ తలుచుకుంటే.. పనైపోద్ది..!

మధురానగర్ : గుణదల మూడు వంతెనల ఆర్ఓబీ.. రైవస్ కాలువ, ఏలూరు కాలువ, బుడమేరుల మీదుగా గుణదల నుంచి నున్నకు సులువుగా చేరేందుకు తలపెట్టిన పై వంతెన ఇది. 2009లో శంకుస్థాపన చేసుకోగా.. కొద్దిపాటి నిర్మాణం జరిగి ఆ తర్వాత నిలిచిపోయింది. ఇది ఎప్పుడు పూర్తవుతుందా..? అని గుణదల వాసులు ఎదురు చూస్తున్నారు. 2006లో రూ.36 కోట్ల అంచనాలతో సిద్ధం చేయగా.. తాజాగా రెట్టింపు అయింది. అయితే రైల్వేశాఖ గతిశక్తి ప్రాజెక్టు కింద పూర్తి స్థాయిలో నిర్మించేందుకు ముందుకు వచ్చింది.

**తప్పని ట్రాఫిక్ కష్టాలు**

గుణదల 1వ డివిజన్ ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోంది. వేలాది నివాసాలు వస్తున్నాయి. వారంతా ఈ మూడు వంతెనల మీదుగా రాకపోకలు సాగించాలి. అవి ఇరుకుగా ఉండటంతో.. తరచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో పరిస్థితి దారుణంగా ఉంటోంది. అందుకే పైవంతెనను వేగంగా పూర్తి చేస్తే ఈ కష్టాలు తీరతాయని స్థానికులు అంటున్నారు.

**చొరవ చూపితేనే పరిష్కారం**

రైల్వేశాఖ వద్ద పెండింగ్‌లో ఉండటంతో పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ చొరవ చూపితేనే పనులు ప్రారంభమవుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభమై.. నిర్మాణం పూర్తి చేసుకుని ఘనంగా ప్రారంభం చేస్తారని ఎదురు చూస్తున్నామని పేర్కొంటున్నారు. ఆ దిశగా ఎంపీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



**అన్నీ సిద్ధమైనా...**

పైవంతెన నిర్మాణానికి అన్నీ సిద్ధమయ్యాయి. నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పూర్తయింది. కాలువగట్లను ఖాళీ చేయించారు. ప్రాజెక్టు నిర్మాణ పనులు రైల్వే వద్ద పెండింగ్‌లో పడడంతో పనులు ప్రారంభం కాలేదు. కారల్‌మార్క్స్ రోడ్డులో పైవంతెన నిర్మాణమయ్యే ప్రాంతం ఇప్పుడు చెత్తకుప్పలకు కేంద్రంగా మారిపోయింది. పనికి రాని మట్టి, చెత్తను తీసుకువచ్చి పైవంతెన నిర్మాణం జరిగే ప్రాంతంలో నిల్వ చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం డంపింగ్ యార్డ్‌లా మారిపోయింది.

**రైలు గేటు పడితే అంతే..**

విజయవాడ-గుడివాడ రైలు మార్గం ఉంది. గూడ్సు రైళ్లు ఎక్కువగా వస్తుంటాయి. ఒక్కోసారి రెండు వస్తాయి. అప్పటి వరకు గేటు తీయరు. దీంతో అరగంట సేపు ఆగిపోవాల్సిందే. గేటు తీసినా ఇరువైపులా భారీగా నిలిచిపోయిన వాహనాలు క్లియర్ అయ్యేందుకు ఎక్కువ సమయం తీసుకుంటుంది. సువర్చల, లెనిన్‌నగర్

**అరగంట ముందు బయలుదేరాలి**

పిల్లలను పాఠశాలకు తీసుకువెళ్లాలంటే వంతెనపై ఉదయం వేళ ట్రాఫిక్ నిలిచిపోతుంది. అందుకే అరగంట ముందు బయలుదేరాలి. ట్రాఫిక్ ఆగితే.. ఆ రోజు ఆలస్యమైనట్లే. వేరే వైపు వెళదామంటే.. సరైన మార్గమే లేదు. రోజూ నిలిచిపోయే ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్నాం.సుబ్బారావు, కర్మెల్‌నగర్

## పాత పనుల్లో గుట్టు.. కొత్త బిల్లుల్లో కనికట్టు

అమరావతి : పెనుగంచిప్రోలు పంచాయతీలో పాత పనులకు కొత్తగా బిల్లులు చేసుకుని భారీగా నిధులు పక్కదారి పట్టించారు. 2014-19 తెదేపా పాలనలో చేసిన పనులకు వైకాపా పాలనలో బిల్లులు చేసుకున్నారు. పారిశుద్ధ్య పనులు చేసే సిబ్బంది జీతాలను సైతం పక్కదారి పట్టించారు. ఈ వ్యవహారం మొత్తం స్థానిక వైకాపా నాయకులు, సిబ్బంది కుమ్మక్కై చేసినట్లు తెలుస్తోంది.

**రూ.లక్షలు మింగేశారు...**

గ్రామంలో తాగునీటి అవసరాలకు 2023-24లో కొత్త ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం చేసినట్లు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.31.6లక్షలు బిల్లులు తీసుకున్నారు. పంచాయతీలో 3 ట్యాంకులు ఉండగా 20 ఏళ్ల కిందటే రెండు నిర్మించారు. 2014-19 తెదేపా పాలనలో ఒక ట్యాంకు నిర్మించారు. దానికి అప్పుడే బిల్లులు చెల్లించేశారు. మరో ట్యాంకు ఎక్కడా నిర్మించలేదు. బిల్లులు మాత్రం స్వాహా చేశారు.గ్రామంలో ఓ సీసీ రహదారి నిర్మాణం 2022లో చేపట్టినట్లు రూ.11.34లక్షలు బిల్లులు తీసుకున్నారు. వాస్తవానికి ఆ రహదారి 2014-19 తెదేపా పాలనలోనే నిర్మాణం చేపట్టారు.




మరికొన్ని పనులు చేసినట్లు రూ.22లక్షలు బిల్లులు తీసుకున్నారు.

**వైకాపా నేతల దందా..**

పంచాయతీలో మొత్తం 30 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఒక్కొక్కరికి నెలకు రూ.15,480 చొప్పున జీతం ఇస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వీరిలోనే 16 మందిని హరిత రాయబారులుగా నియమించినట్లు తీర్మానం చేశారు. ఒక్కొక్కరికి నెలకు రూ.6వేల చొప్పున రూ.96వేలు చెల్లిస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నుంచి సాధారణ నిధులకు మళ్లించి అక్కడ నుంచి సొమ్ము స్వాహా చేస్తున్నారు. వైకాపా పాలనలో పంచాయతీ ఎన్నికల నుంచి ఇప్పటివరకు దాదాపు రూ. 50లక్షల వరకు స్వాహా చేశారు.

**ఇన్నాళ్లు ఏం చేస్తున్నారో?**వైకాపా మద్దతుదారుడైన సర్పంచి, కార్యదర్శి కలిసే నిధుల దుర్వినియోగం చేసినట్లు పంచాయతీ 14వ వార్డు సభ్యుడు ప్రవీణ్ నాయకులు, అధికారులకు ఫిర్యాదులు చేశారు. అధికారులు కనీసం పరిశీలించకుండానే రూ.కోటికి పైగా బిల్లులు మంజూరు చేశారంటే వారికీ భారీగా ముడుపులు అందినట్లు తెలుస్తోంది. 'అక్రమాల విషయం నా దృష్టి వచ్చింది. విచారణకు ఆదేశాలిచ్చాను. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం' అని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

# మెప్మా.. అవినీతికి చిరునామా!



ధర్మవరం : ధర్మవరంలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) అవినీతి కూపంగా మారిపోయింది. గత వైకాపా ప్రభుత్వంలో కొంతమంది ఆర్‌పీలు (రీసోర్సు పర్సన్లు) నకిలీ సంఘాలను సృష్టించి రూ.కోట్లు రుణాలు పొంది తమ ఖాతాల్లోకి జమ చేసుకున్నారు. వీరికి కొందరు సీవోలు, బ్యాంకు సిబ్బంది అండగా నిలిచారనే విమర్శలు ఉన్నాయి. రుణాలు తిరిగి చెల్లించకపోవడంతో సంఘాల మహిళలకు ప్రస్తుత నోటీసులు జారీ అవుతుండటంతో చర్చనీయాంశమైంది. ఏకంగా రూ.10 కోట్ల నుంచి 11 కోట్ల వరకు అవినీతి జరిగిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మీరు రూ. 15 లక్షలు రుణం పొందారు. వాటిని చెల్లించకపోతే కేసులు నమోదు చేయిస్తామని ధర్మవరంలోని సిద్దయ్యగుట్టకు చెందిన అక్కమ్మ మహిళా సంఘం సభ్యులకు ఎస్‌బీఐ అధికారులు నోటీసులు జారీ చేశారు. అవాక్కైన సభ్యులు వెంటనే మెప్మా కార్యాలయానికి చేరుకున్నారు. 'మేము రుణం పొందకున్నా.. బ్యాంకు అధికారులు నోటీసులు జారీ చేశారని అధికారులతో వాగ్వాదానికి దిగారు. వివరాలను పరిచూడగా.. మీ సంఘం పేరు మీద ఇతర గ్రూపులోని మహిళలను ఏర్పాటు చేసి రుణం తీసుకున్నారని మెప్మా అధికారులు తెలిపారు. దీంతో బాధితులు డీఎస్పీకి రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

**ఉన్నతాధికారులకు సమాచారమిచ్చాం**

విజయభాస్కర్, పట్టణ మెప్మా ప్రాజెక్ట్ అధికారి

నోటీసులు తీసుకుని పోలీసులను కలిశాం. మా అధికారుల సంతకాలు లేకుండా రుణాలు పొందారు. దీనిపై విచారణ చేయాలని పోలీసులు, బ్యాంకు అధికారులను కోరాం. బోగస్ సంఘాలపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం.

**అంతా ఆమె నడిపించింది..**

గత వైకాపా ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకురాలు స్థానిక నాయకుల అండతో శానిటేషన్ విభాగంలో ఒప్పంద కార్మికురాలిగా విధుల్లోకి చేరింది. ఆ తరువాత మెప్మాలో సీఓగా నియమితురాలై కార్యాలయాన్ని పూర్తిగా తన చేతుల్లోకి తీసుకుంది. ఎంతగా అంటే తన అనుమతి లేకుండా ఏ ఒక్కరికి రుణం మంజూరు చేయకూడదని ఆదేశాలిచ్చింది. ఈమెకు పురపాలక శాఖలో కీలకంగా ఉన్న ఓ అధికారి అండగా నిలిచినట్లు ఆరోపణలు ఉన్నాయి. మెప్మాలోని సంఘాలు రుణాలు తీసుకోవాలంటే బ్యాంకు కాగితాలపై సీఓ సంతకం ఉండాలి. ఇవేమీ లేకుండానే బ్యాంకు అధికారులు బోగస్ సంఘాలకు రుణాలు మంజూరు చేశారు. నెలలు గడుస్తున్న కంతులు చెల్లించకపోవడంతో ప్రస్తుతం బ్యాంకు అధికారులు సంఘాలకు నోటీసులు జారీ చేస్తున్నారు. దీంతో అక్రమార్కుల్లో వణుకు మొదలైంది.

ధర్మవరం పట్టణ మెప్మా పరిధి

మహిళా సంఘాలు: 2,466

సభ్యులు: 24,660

బోగస్‌గా తేలిన సంఘాలు: 150-160

వీటి కింద పొందిన రుణాలు: రూ. 10- 11 కోట్ల వరకు

# జలాల లెక్కలు తేల్చేదెవరు?



అనంతపురం : ఉమ్మడి జిల్లా వరప్రదాయినిగా భావించే హెచ్చెల్సీ, హంద్రీనీవా ప్రధాన కాలువ, ఉప కాలువల్లో నీటి ప్రవాహం పుష్కలంగా కొనసాగుతోంది. 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా జలాలు దండిగా ఉన్నా అధికార యంత్రాంగం నిర్వాకం.. నిర్లక్ష్యం మూలంగా నీటి నిర్వహణ అస్తవ్యస్తంగా నడుస్తోంది. నీటి కేటాయింపుపై కార్యాచరణ ప్రణాళిక.. కాలువలపై పర్యవేక్షణ ఊసేలేదు. నీటి సీజన్ మొదలై ఐదు నెలలు గడుస్తున్నా జలవనరులు(ఎంఐ), హెచ్చెల్సీ, హంద్రీనీవా ప్రాజెక్టుల అధికారులు కూర్చొని చర్చించిన దాఖలాలు లేవు. ఏ కాలువకు నీరు ఎన్ని కేటాయించాలి. చెరువులు ఎలా నింపాలి, ఆయకట్టు పరిస్థితి ఏమిటీ.. వంటి అంశాల ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకోలేదు. సరికదా.. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, కలెక్టర్ స్థాయిలో ఈ సీజన్‌లో ఒక్క సమావేశం జరగపోవడం విచారకరం. నీరు విడుదలైన మూడు నెలల తర్వాత మొన్ననే ఐఏబీ సమావేశం నిర్వహించారు. అన్నర్ల కొరత, అద్దె వాహనాలు, నీటి కేటాయింపులపై సరైన చర్చ జరగలేదన్నది నిష్ఠూర సత్యం. వీటిపై ఏ నిర్ణయం తీసుకోలేదు.

**చెరువులకు అంతంత మాత్రమే**

హంద్రీనీవా ప్రధాన కాలువకు నీటిని ఎత్తిపోసే ప్రక్రియ మూడు నెలల కిందట మొదలైంది. రెండో దశ ప్రధాన కాలువకు 10.284 టీఎంసీలు ఎత్తిపోశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 219 చెరువులకు నీరు ఇవ్వాలని భావిస్తున్నారు. ఇందులో అనంతలో 42, శ్రీసత్యసాయిలో 177 ప్రకారం ఉన్నాయి. గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి జలాశయాలకు అరకొరగానే జలాలు వెళ్తున్నాయి. పుంగనూరు ఉప కాలువకు మాత్రం 219 క్యూసెక్కులు ప్రవహిస్తున్నాయి. మడకశిర ఉప కాలువ కింద ఏకంగా 103 చెరువులు ఉంటే.. ఇప్పటికి కేవలం రెండు మాత్రమే భర్తీ అయ్యాయి. మరో ఐదింటికి ప్రవాహం చేరుతున్నాయి. 96 చెరువుల పరిస్థితి ఏమిటో తెలీదు. ఈ ఉప కాలువకు కేవలం 100 క్యూసెక్కుల ప్రవాహం ఉందంతే.

**ఆయకట్టుపై అశ్రద్ధ**

హెచ్చెల్సీ నీరు కణేకల్లు చెరువు ద్వారా జీబీసీ, ఎమ్మిఆర్, పీఏబీఆర్‌కు వెళ్తున్నాయి. మూడు నెలలు గడిచినా జీబీసీ ద్వారా గుత్తి ఉప కాలువకు చేరలేదు. ఎమ్మిఆర్ దక్షిణ కాలువ ద్వారా తాడిపత్రి ఉప కాలువకు వెళ్లడం గగనమైంది. సుబ్బరాయసాగర్ ద్వారా కేవలం ఐదు క్యూసెక్కులు మాత్రమే వెళ్తున్నాయి. హెచ్చెల్సీ ప్రధాన కాలువ మోపిడి రెగ్యులేటర్ వద్ద 1430 క్యూసెక్కులు చూపిస్తే.. ఎమ్మిఆర్‌లోకి 1175 క్యూసెక్కులే చేరుతున్నాయి. పీఏబీఆర్ లింకు కాలువ మొదట్లో 249 క్యూసెక్కులు నమోదైతే.. డ్యాంలోకి 150 క్యూసెక్కులు మాత్రమే చేరుతున్నాయి. ముచ్చుకోట రిజర్వాయర్‌కు 32 క్యూసెక్కులని చూపిస్తున్నా.. కనీసం పది కూడా చేరడం లేదు.

హెచ్చెల్సీ

తుంగభద్రలో కేటాయింపు : 24.068 టీఎంసీ

డ్యాంలో విడుదల : 17.187 టీఎంసీ

జిల్లా సరిహద్దుకు చేరిక : 15.489 టీఎంసీ

ప్రధాన కాలువకు ప్రవాహం : 1974 క్యూసెక్కులు

హంద్రీనీవా

శ్రీశైలం మల్యాల వద్ద ఎత్తిపోత : 21.695 టీఎంసీ

జిల్లా సరిహద్దుకు చేరిక : 19.578 టీఎంసీ

జీడిపల్లి జలాశయానికి చేరిక: 17.338 టీఎంసీ

ప్రస్తుత ప్రవాహం : 1910 క్యూసెక్కులు

నీటి నిర్వహణ పక్కాగా చేస్తాం

నీటి నిర్వహణ ప్రక్రియను పక్కాగా అమలు చేస్తాం. ఐఏబీ సలహా మేరకు ప్రత్యేక కార్యాచరణ తయారు చేస్తున్నాం. ఏ కాలువకు ఎన్ని జలాలు కేటాయించాలో నివేదిక రూపొందిస్తున్నాం. ఆయకట్టుకు నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం పంపిణీ చేస్తాం. ఏ సమస్య తలెత్తకుండా చూస్తున్నాం.

సుధాకర్‌రావు, ఎస్ఈ, హెచ్చెల్సీ

# తిరుచానూరులో.. అవస్థలే సదా!

తిరుచానూరు.. పద్మావతి అమ్మవారి దివ్య పుణ్యక్షేత్రం కొలువైన ప్రాంతం. తిరుమలేశుడితో సమానంగా అమ్మవారికి ఆదాయం వస్తున్నా.. అభివృద్ధిలో మాత్రం వెనుకంజే. అమ్మ దర్శనం అటుంచితే.. అక్కడి వరకు ప్రయాస పడుతూ వెళ్లాల్సిందే. ఆలయాభివృద్ధి అంతంతే కావడం ప్రధాన కారణం. తిరుమల తరహాలో తిరుచానూరును అభివృద్ధి చేస్తామన్న తితిదే అధికారుల మాటలు వాస్తవ రూపం దాల్చడం లేదు.

**వేధిస్తున్న సమస్యలివే..**

పార్కింగ్ ప్రదేశాలు సరిగా లేవు. ఏళ్లుగా వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు.

తిరుచానూరులో సరైన బస్టాండ్ లేదు. రోడ్లపైనే బస్సులు నిలపాల్సిందే. శౌచాలయాలు సమస్య తీవ్రంగా ఉంది. డిప్యూటీ ఈఓ కార్యాలయం పక్కనే ఉన్న వాటిని ఒకేసారి ఐదుగురు వినియోగించుకోలేని దుస్థితి. ఆలయానికి కొంతదూరంలో ఉన్నవాటి వినియోగం అంతంతే.ఆలయానికి వెళ్లే దారులు ఇరుగ్గా ఉన్నాయి. ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. విస్తరణ పనులు కాగితాలకే పరిమితం. జాతీయ రహదారి నుంచి గేట్-1కు వెళ్లే మార్గం ఇరుగ్గా ఉంది.గేట్-2, 3 వద్ద చిరువ్యాపారులు ఇష్టానుసారంగా దుకాణాల ఏర్పాటుతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ప్రాంతాన్ని ఫ్రీజోన్ చేయాలనే ప్రతిపాదన ఉంది.చరవాణులు భద్రపరిచేందుకు లాకర్లు, పాదరక్షల స్టాండ్లు అవసరం మేర లేవు.

**అక్కడికే పరిమితం..**

20 ఏళ్ల కిందట మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ఆలయ మాడవీధుల విస్తరణతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టారు. అప్పట్లో నిత్యం 5 వేల మంది భక్తులు వచ్చేవారు. ఇప్పుడా సంఖ్య 25 వేలకు చేరింది. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. ఈ విషయమై తితిదే అధికారులకు అంచనా ఉన్నా.. మౌలిక వసతుల కల్పన దిశగా చర్యలు శూన్యం.

రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా..రెండేళ్ల క్రితం అమ్మవారి పద్మ సరోవరంలో రూ.10 కోట్లతో మరమ్మతులు చేశారు. ఆ తర్వాత ఒక్క అడుగు ముందుకు పడలేదు. పాలకమండలి తీర్మానం మేర రూ.20 కోట్లతో క్యూ కాంప్లెక్స్, భక్తుల వసతిగృహాలు, కల్యాణకట్ట తదితర నిర్మాణాలు చేపట్టారు. ఇవి చివరి దశలో ఆగిపోయాయి. స్థానిక గ్రామపంచాయతీకి పార్కింగ్ ఫీజు ద్వారా ఏటా రూ.5 కోట్ల ఆదాయం వస్తోంది. అయితే అభివృద్ధికి సహకారం మాత్రం అంతంతే భక్తులకు కనీసం తాగునీరు అందించలేని దుస్థితి.

## మేల్కొంటేనే మనుగడ..

అమరావతి : పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ, ప్రకృతి విపత్తుల నుంచి రక్షించడంలో మడ అడవులు కీలక పాత్ర పోషిస్తాయి. పెనుగాలులు, ముంపు, సునామీలను ఆపాలంటే మడ అడవులు దట్టంగా పెరగాలి. వీటి వల్ల జన నష్టం లేకుండా బయటపడొచ్చు. నానాటికీ ఇవి తరిగిపోతుండడంతో 380 పీపీఎం మేర కర్బన వాయువు వెలువడుతోంది. నిర్లక్ష్యం చేస్తే 2050 నాటికి 500 పీపీఎంగా నమోదయ్యే ప్రమాదం ఉందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**సహజసిద్ధ రక్షణ ఛత్రం**

1977లో దివిసీమ ఉప్పెన సంభవించిన సమయంలో మడ మొక్కలు బాగా పెరిగిన చోట్ల ప్రభావం కనిపించలేదు. పూర్తిగా ధ్వంసమైన ప్రాంతాల్లో ఊళ్లకు ఊళ్లను మింగేసింది. వేలల్లో మృత్యువు బారిన పడ్డారు. 2004లో సునామీ వచ్చినప్పుడు కొన్ని ప్రాంతాల్లో మడ అడవులు సహజ రక్షణ కవచంగా పనిచేశాయి.

**దెబ్బతింటున్న జీవవైవిధ్యం**

మడ అడవులు ఎన్నో జీవ జాతులకు ఆశ్రయమిస్తున్నాయి. అవిసేనియా అఫిసినాలిస్, అవిసేనియా మరినా, అవిసేనియా ఆల్బా, రైజోఫోరా కాంజుగట, ఎక్కోకేరియా అగల్లోచా, వంటి వివిధ రకాల మడ మొక్కలు పెరుగుతాయి. బావురుపిల్లి, నీటికుక్కలు, సముద్రపు తాబేళ్లు, నీటి పాములు వీటిలో ఉంటాయి. సముద్రపు కాకి, కింగ్‌ఫిషర్, హనీ బీటిల్, ఫ్లెమింగోలు, నైట్ హెరాన్, వంటి పక్షులు విహరిస్తుంటాయి.



**వృద్ధి అంతంతే**

కృత్తివెన్ను నుంచి బాపట్ల వరకు 19,480.60 హెక్టార్ల మేర కృష్ణా అభయారణ్యంలో మడ అడవులు విస్తరించాయి. సముద్రపు నీరు ప్రవహించకపోవడంతో చాలాచోట్ల మొక్కలు లేకుండాపోయాయి. దీని వల్ల ఇసుక మేటలు వేసింది. ఇలాంటి చోట్ల వన్యప్రాణి విభాగం అధికారులు కృత్రిమంగా పునరుద్ధరించాలి. ఇండియన్ స్టేట్ ఫారెస్ట్ రిపోర్టు 2023 నివేదిక ప్రకారం.. కృష్ణాలో విస్తీర్ణం పెరుగుదలలో కొంతమేరే వృద్ధి నమోదైంది.

**స్వచ్ఛమైన గాలి**

మడ ఆకులు అతినీలలోహిత కిరణాలను అధికంగా తీసుకుంటాయి. రోజుకు ఎకరా విస్తీర్ణంలో 3.7 పౌండ్ల మేర పర్యావరణానికి హాని చేసే కర్బన వాయువులను పీల్చుకుని స్వచ్ఛమైన గాలి అందిస్తాయి. నీ చిత్తడి నేలల్లో విడుదలయ్యే హానికరమైన మిథేన్ వాయువును అధికంగా పీల్చుకుంటాయి. సముద్రం, నది నీరు కలిసేచోట పెరిగే ఈ మొక్కలు ఉప్పు నీటిలోని లవణాన్ని వేర్ల ద్వారా పీల్చుకుని ఆకుపై వదులుతాయి.

**ప్రణాళికలు సిద్ధం..**

వంద హెక్టార్లలో మడ అడవులను పెంచాలనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయాం.గతేడాది మిగిలిన 60 హెక్టార్లు, ఈఏడాది మరో 80 హెక్టార్లలో అడవులు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం.

## డెల్టా వ్యవస్థ మూసివేత..!

పెనుగొండ : అధిక వర్షాలతో పంట నీటమునగడంతో తీవ్ర నిరుత్సాహానికి గురైన అన్నదాతలు 'మొంథా' తుపాన్ దూసుకొస్తుందనే సమాచారంతో ఆవేదనకు గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో అధికార యంత్రాంగం వ్యవసాయ పంటల సంరక్షణపై దృష్టి సారించింది. కాలువ గట్లు బలహీనపడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా గోదావరి నుంచి తూర్పు, పశ్చిమ, మధ్య (మూడు) డెల్టాల పరిధిలో అన్ని పంట కాలువలకు సాగునీటి సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. పశ్చిమ డెల్టాలో విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి ఉదయం 2 వేల క్యూసెక్కులు విడుదల చేశారు. అధిక వర్షాలు కురుస్తుండటంతో సాయంత్రానికి కేవలం వెయ్యి క్యూసెక్కులకు పరిమితం చేశారు. ఆదివారం ఉదయం విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్‌ను పూర్తిగా మూసివేశారు. ఉండి సబ్‌డివిజన్ పరిధిలోని వెంకయ్య వయ్యేరు, ఉండి పంట కాలువ, పాతవయ్యేరు కాలువల పరిధిలో వ్యవసాయ పంటలకు నీటి అవసరాలు లేకపోవడంతో నాలుగు రోజుల నుంచే కాలువలకు సరఫరాను నిలిపివేశామని ఉండి డీఈఈ సత్యనారాయణమూర్తి తెలిపారు.'

**చేరుతున్న మురుగునీరు..** ఉండి సబ్ డివిజన్ పరిధిలో 1.49 లక్షల ఆయకట్టు విస్తీర్ణముంది. ఉండి, గణపవరం, చిలకపాడు, యండగండి, ఆకివీడు సెక్షన్ల పరిధిలోని కాలువలు మూడు రోజుల



కిందట వరకూ ఎర్ర బురదతో కన్పించాయి. వెంకయ్య వయ్యేరును పంట, మురుగు కాలువగా కూడా వినియోగిస్తున్నారు. గణపవరం, నిడమర్రు, ఆకివీడు, ఉండి, కాళ్ల మండలాల్లోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ భూముల్లో డ్రెయిన్లలోని మురుగు ఈ కాలువలోకి చేరుతోంది. ఉండి పంట కాలువది అదే పరిస్థితి. గణపవరం, పాలకోడేరు, ఉండి, కాళ్ల మండలాల్లోని వివిధ ప్రాంతాల్లో వరి చేలల్లో నిలిచిన నీరు ఈ కాలువలోకి చేరుతోంది.

పశ్చిమ డెల్టాలో ప్రధాన పంట కాలువలు: 11

మొత్తం (లక్షల ఎకరాలు)

ఆయకట్టు: 5.29

వరి 3.60

ఆక్వా, ఇతర పంటలు: 1.69

చురకలు



# మల్బరీ..ఆ ఊరి ఉపాధి

చౌడేపల్లి: ఆ గ్రామంలో ఎక్కడ చూసినా మల్బరీ సాగు, పట్టుపురుగుల పెంపకమే కనిపిస్తుంది. దీన్నే జీవనోపాధిగా మార్చుకున్నారు. ఆ ఊరే చౌడేపల్లె మండలం తెల్లనీళ్లపల్లె. గతంలో ఇక్కడ సంప్రదాయ పంటలు సాగు చేయగా, నష్టాలు చవిచూశారు. ఓ దశలో కొందరు మల్బరీని పండించి, పట్టుపురుగులు పెంచి అప్పుల నుంచి బయటపడ్డారు. ఇక అంతే అందరూ ఇదే బాటలో నడిచారు. మొత్తం 100 కుటుంబాలు ఉండగా.. 80 కుటుంబాలు దీన్నే నమ్ముకున్నాయి. 150 ఎకరాలలో మల్బరీ పండిస్తున్నారు. ప్రభుత్వ రాయితీలను వినియోగించుకొని షెడ్లు నిర్మించుకుని, పట్టు పురుగులు పెంచుతున్నారు. పెట్టుబడి తక్కువ కావడంతో అందరూ దృష్టిసారించారు. ప్రతి నెలా 5 వేల కిలోల పట్టుగూళ్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఎంతోమంది తమ జీవితాల్లో ఈ సాగు మార్పు తీసుకొచ్చింది.

**నాలుగు దశాబ్దాలుగా..**

తెల్లనీళ్లపల్లెకు చెందిన తిమ్మారెడ్డి సంప్రదాయ పంటలు సాగు చేసేవారు. నష్టాలే మిగలడంతో 40 ఏళ్ల కిందట తొలిసారిగా 50



పట్టుగూళ్లు పెంచారు. ఆ తర్వాత అరెకరంలో పండించారు. ఆదాయం రావడంతో ఆయన జీవితమే మారిపోయింది. కుమార్తె పెళ్లికి చేసిన అప్పులు తీర్చేశారు. ఇంటిని నిర్మించుకున్నారు. బీఎస్సీ పూర్తిచేసిన ఈయన కుమారుడు తండ్రికి చేదోడుగా ఉంటున్నారు. ప్రస్తుతం 2.5 ఎకరాలలో మల్బరీ పండిస్తుండగా, 200 గూళ్లు పెంచుతున్నారు.

**నష్టాలు మిగలడంతో..**వెంకటరమణారెడ్డి.. 30 ఏళ్ల కిందటి వరకు చెరకు, వరి, వేరుసెనగ పండించారు. నష్టాలే మిగలడంతో మల్బరీ వైపు దృష్టిసారించారు. ముందుగా అరెకరంలో పండించారు. నష్టాలు తీరిపోవడంతో దీన్నే నమ్ముకున్నారు. రాయితీని సద్వినియోగం చేసుకొని షెడ్డు ఏర్పాటుచేసుకున్నారు. ప్రస్తుతం 4 ఎకరాలలో మల్బరీ పండిస్తున్నారు. పట్టుగూళ్లను పెంచుతున్నారు.

# వాన చినుకుకో లెక్కుంది!

తెనాలి :వాన కురిసినప్పుడు ఎంత వర్షపాతం నమోదైందో... మిల్లీమీటర్లు, సెంటీమీటర్లలో రెవెన్యూ అధికారులు వివరాలు వెల్లడిస్తుంటారు. వర్షపాత స్థాయిని బట్టి సాధారణమా..అధికమా, తక్కువా అనే కీలక అంశాలను విశ్లేషిస్తారు. అసలు ఈ గణన ఎలా ఉంటుందో తెలుసా...?ప్రతి మండలంలోని తహసీల్దారు కార్యాలయంలో వర్షపాత నమోదు సూచిక (రెయిన్ గేజ్ స్టేషన్) ఉంటుంది. అందులో పైభాగంలోని గరాటు ద్వారా లోపల ఉన్న జాడీలోకి వాన నీరు చేరుతుంది. నిర్ణీత సమయం పూర్తయ్యాక సహాయ గణాంక అధికారి ఆ జాడీని బయటకు తీసి మిల్లీమీటర్ల వంతున నమోదు కోసం



ప్రత్యేకించిన పరికరంలోకి వాననీటిని పోసి ఎంత వర్షం పడిందో నిర్ధారించి ప్రకటిస్తారు. సాధారణంగా ఉదయం 8:30 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8:30 గంటల వరకు అంటే 24 గంటల పాటు గణన కోసం వాన నీటి సేకరణ ఉంటుందని తెనాలి సహాయ గణాంక అధికారి వాసుబాబు తెలిపారు. అంటే ఉదయం నుంచి ఎఉదయం వరకు జరిగిన లెక్కింపును నాటి వర్షపాతంగా నమోదు చేస్తారు. తుపానులు, అల్పపీడనాలు వంటి సమయాల్లో అవసరాన్ని అనుసరించి ఈ గణన ప్రతి ఆరు గంటలకు ఒకసారి చేస్తారు. మండలాల నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయానికి.. అటు నుంచి కలెక్టర్ కార్యాలయానికి ఆ వివరాలు పంపుతారు. అన్ని ప్రాంతాల నుంచి లెక్కించి సగటు వర్షపాతం వివరాలు వెల్లడిస్తారని వివరించారు.

# పల్లెల్లో.. ఆగని స్వాహా పర్వం!

పెనుగొండ : మండలం నడిపూడిలోని ఈ ప్రాంతంలో మురుగు పారుదల నిమిత్తం గత ప్రభుత్వ హయాంలో పైపులైన్లు ఏర్పాటు చేశారు. ఈ పని నిమిత్తం అప్పట్లో బిల్లులు పెట్టగా కొందరి ఫిర్యాదుల మేరకు తిరస్కరణకు గురయ్యాయి. ఇటీవల మరోసారి ఇదే పనికి బిల్లు మంజూరు కోసం పంచాయతీలో తీర్మానం ఆమోదించేశారు. మరోపక్క ఇక్కడ పైపులైన్ల ఏర్పాటుకు అప్పట్లో స్థానిక నివాసితుల నుంచి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు వసూలు చేసినట్లు గుర్తించడంతో స్థానిక వార్డు సభ్యుడు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో వైకాపాకు చెందిన ప్రజా ప్రతినిధి కుమారుడి పాత్ర ఉన్నట్లు ఆరోపణలున్నాయి.గత వైకాపా ప్రభుత్వ హయాంలో పంచాయతీల్లో నిబంధనలకు విరుద్ధంగా నగదు చెల్లింపులు, తప్పుడు బిల్లులు, పన్ను వసూళ్లలో చేతివాటం వంటి వ్యవహారాలతో రూ. కోట్ల నిధులు పక్కదారి పట్టాయి. కొన్ని చోట్ల ఇప్పటికీ ఇలాంటి వ్యవహారాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. మరోపక్క కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు బిల్లుల మంజూరు కోసం అడ్డదారులు తొక్కుతూ ఇష్టారాజ్యంగా తీర్మానాలు చేస్తున్నారు.పారిశుద్ధ్య పనులు చేయకుండానే చేసినట్లు చూపి సొమ్ము స్వాహా చేశారని, తాగునీటి పథకం నిర్వహణకు సంబంధించి సామగ్రి కొనుగోలులో చేతివాటం చూపారని, పాలకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు ఖర్చులు, ఆడిట్ వివరాలను సభ్యుల దృష్టికి తీసుకురా లేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

పెనుమంట్ర మండలం పొలమూరు పంచాయతీలో పెద్ద ఎత్తున సొమ్ము దుర్వినియోగమైనట్లు ప్రచారం జరుగుతోంది. ఇక్కడ పనిచేసిన కార్యదర్శి పాలకవర్గ సభ్యులకు తెలియజేయకుండా రూ.7 లక్షలను ఏడు చెక్కుల రూపంలో శానిటేషన్ సామగ్రికి చెల్లించారు. దీనికి రెండు రోజుల ముందు పాలకవర్గ సమావేశం జరిగినా ఈ అంశాన్ని ప్రస్తావించలేదు.నడిపూడిలో ఆస్తి, కుళాయి పన్నులు, కొబ్బరిచెట్ల లీజు సొమ్ము పంచాయతీకి జమ కాలేదని, ఇసుక సీనరేజీ సొమ్ము ఏమైందో తెలియడం లేదని ఉన్నతాధికారులు ఫిర్యాదులు అందాయి.

**ఆడిట్ ఓ మాయాజాలం...** పంచాయతీల్లో ఆడిట్ ఓ మాయాజాలంలా మారింది. ఏటా ఈ ప్రక్రియ నిర్వహించాల్సి ఉండగా కొన్ని పంచాయతీల్లో ఏళ్ల తరబడి జరగలేదు. ఫలితంగా లక్షలాది రూపాయలు దుర్వినియోగమైనా వెలుగుచూసే పరిస్థితి కనిపించడం లేదు.

# మున్సిపల్ పాఠశాలల్లో బోధించేవారేరీ?




హిందూపురం : హిందూపురం, కదిరి, ధర్మవరం పట్టణాల్లోని మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. అనేక ఉర్దూ పాఠశాలల్లో 50 మంది విద్యార్థులు ఉన్నా.. ఒక్క ఉపాధ్యాయుడితోనే నడిపిస్తున్నారు. ప్రధానంగా ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులు లేకపోవడంతో బోధన కుంటుపడింది. అన్ని పాఠశాలల్లో తెలుగు, హిందీ, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నెలఖారు నాటికి 10వ తరగతి విద్యార్థులకు నిర్దేశించిన సిలబస్‌లో 90 శాతం పూర్తి చేసి ఉండాలి. అయితే అనేక పాఠశాలల్లో తెలుగు, హిందీ పాఠ్యాంశాల బోధన మొదలు కాలేదు. 6-9 తరగతులకు సంబంధించి మొదటి సెమిస్టర్ పాఠ్యాంశాలు పూర్తి చేసి, వచ్చే నెలలో ఎస్.ఎ.-1 పరీక్షలు నిర్వహించాలి. ఉపాధ్యాయుల కొరతతో వారిని పట్టించుకునేవారే లేకుండా పోయారు. మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్జీటీలకు తెలుగు, హిందీ భాషోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించడానికి అనేక అడ్డంకులు ఉన్నాయి. నిబంధనల్లో మార్పు తీసుకువచ్చి, వారికి పదోన్నతి కల్పిస్తేనే ఉపాధ్యాయుల కొరత తీరుతుంది.

1. కదిరిలోని వీవర్స్ కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో దాదాపు 1,000 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి బోధించడానికి 31 ఉపాధ్యాయుల పోస్టులు మంజూరయ్యాయి. అయితే కేవలం 13 మంది మాత్రమే ఉన్నారు. ఏకంగా 18 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తెలుగు, హిందీ బోధనకు ఒక్కరూ లేరు. ఇంత మంది విద్యార్థులకు భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు బోధన చేయాల్సి వస్తోంది.

2. హిందూపురంలోని ఎంజీఎం ఉన్నత పాఠశాలలో వెయ్యి మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ఒకే ఒక్క తెలుగు ఉపాధ్యాయుడు ఉన్నారు.

3. ధర్మవరంలోని సుందరయ్యనగర్ శ్రీగణేశ్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 780 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి ఒక్కరు చొప్పున మాత్రమే తెలుగు, హిందీ ఉపాధ్యాయులు ఉన్నారు. మూడు వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులు ఉంటే అన్నీ ఖాళీగానే ఉన్నాయి.

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం** మల్లికార్జున, హిందూపురం మున్సిపల్ కమిషనర్మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉన్న మాట వాస్తవమే. దీంతో బోధనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పోస్టుల భర్తీ అవసరాన్ని పురపాలక శాఖ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం. ఈ ఏడాది సమస్యను అధిగమించడానికి టీచింగ్ అసిస్టెంట్లను తాత్కాలిక పద్ధతిన నియమించడానికి అనుమతి తీసుకొంటాం. ఇదే విషయమై విద్యా శాఖతో సంప్రదిస్తున్నాం.

# అనుమతులిస్తాం.. అడ్డంగా నరికేయ్!



హిందూపురం : హిందూపురం నియోజకవర్గంలోని లేపాక్షి మండలంలో దశాబ్దాల వయసున్న రూ.లక్షలు విలువచేసే పచ్చని చెట్లపై గొడ్డలివేటు కొనసాగుతోంది. నాలుగు నెలల నుంచి కంచిసముద్రం, నాయనపల్లి, విభూతిపల్లి మరికొన్ని గ్రామాల్లో నిరంతరాయంగా ఈ చెట్ల సంహారం జరుగుతుండటంతో ఇప్పటికే దాదాపు 500 కుపైగా పెద్ద చెట్లు నరికివేతకు గురయ్యాయి.

**వెంచర్ల మోజులో..**

గ్రామాలు, రహదారుల సమీపంలో లేఅవుట్లు, వెంచర్లు వేసేందుకు రియల్టర్లు వస్తుండటంతో భూముల ధరలకు రెక్కలొస్తున్నాయి. దీంతో రైతులు వారికి భూములు విక్రయిస్తున్నారు. అందులో నాలుగైదు దశాబ్దాల వయసున్న ఫలసాయాన్ని అందించే చింత చెట్లు ఉన్నాయి. ఈ చెట్లు లేఅవుట్లకు అడ్డమని రియల్టర్లు రైతుల ద్వారా దరఖాస్తులు చేసి అటవీ అధికారుల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే కొట్టివేస్తున్నారు.

**అడ్డగోలుగా..**అటవీ అధికారులు ఎండిపోతున్న, ప్రమాదంగా ఉన్న, ఫలసాయం అందించని మొండిచెట్ల కొట్టివేతకు అనుమతులు ఇవ్వాలి. ఒక చెట్టు నరికేస్తే దాని స్థానంలో 2002 వాల్టా (నీరుచెట్టు) చట్టం మేరకు సంబంధిత వ్యక్తి ఐదు మొక్కలు నాటాలి. ఇలా మొక్కలు నాటాడని అధికారులు పరిశీలించిన వెంటనే అనుమతులు మంజూరు చేయాలి.. కాని ఎక్కడ ఇలా చేయటం లేదు.

**ప్రజల ప్రతిఘటన**

విభూతిపల్లిలో ఓ రైతు చెట్లు కొట్టివేతకు ఇటీవల దరఖాస్తు చేసుకొంటే అటవీశాఖ అధికారులు అనుమతులు మంజూరు చేశారు. ఈ మేరకు వారు చెట్లు నరికేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు.

**అవసరం ఉన్నవారికే అనుమతులు**

శ్రీనివాసరెడ్డి, అటవీరేంజ్ అధికారి, పెనుకొండ

నిజంగా అవసరం ఉన్న రైతులకు మాత్రమే చెట్లు కొట్టివేసుకునేందుకు అనుమతులు ఇస్తున్నాం. లేఅవుట్లు, వెంచర్లు ఏర్పాటు చేసుకొనేందుకు చెట్లు నరికేందుకు అనుమతులు ఇవ్వటం లేదు. రెవెన్యూశాఖ వారు రైతు భూమి అని నిర్ధారించి, చెట్టు కొట్టివేసిన స్థానంలో రెండు మొక్కలు నాటిన తర్వాతే అనుమతులు ఇస్తున్నాం. పెద్దఎత్తున చెట్లు కొట్టివేతపై విచారిస్తాం.

# ఆర్టీసీ డిస్పెన్సరీ.. ప్రయోజనకారి



తిరుపతి : ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది, కార్మికుల వైద్య పరీక్షల నిమిత్తం తిరుపతి కేంద్రీయ బస్‌స్టేషన్‌లో ఏళ్ల కిందట వైద్యారోగ్య డిస్పెన్సరీని నిర్మించారు. అది శిథిలావస్థకు చేరడంతో కొత్త భవన నిర్మాణాన్ని చేపట్టారు. పనులు పూర్తవడంతో ప్రారంభోత్సవానికి సిద్ధమైంది.**ఎంతమందికి ప్రయోజనం..:** జిల్లాలోని 11 డిపోల పరిధి, తిరుపతిలోని జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయంలో పనిచేస్తున్న వారితో కలిపి సుమారు 4 వేల మంది డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, ఉద్యోగులకు డిస్పెన్సరీ ఉపయోగపడుతుంది.

ఉమ్మడి చిత్తూరులోని ఉద్యోగులతో పాటు పునర్విభజనలో కలిసిన గూడూరు, వెంకటగిరి, వాకాడు, సూళ్లూరుపేట డిపోల ఉద్యోగులు, సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు 2 వేల మంది సేవలు పొందవచ్చు.

**సేవలు ఇలా..**ప్రస్తుత కేంద్రంలో రోజుకు సుమారు 100 మంది రోగులకు ఈసీజీతో పాటు సెమీ ఆటోమోటివ్ ఎనలైజర్ ద్వారా 30 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. నెలకు రూ.3 లక్షల వరకు ఉచితంగా మందులు అందజేస్తున్నారు. ఇవే సేవలు కొత్త కేంద్రంలో అందుతాయి. **30న సుముహూర్తం..**

నూతన డిస్పెన్సరీ ప్రారంభోత్సవానికి ఈ నెల 30న ముహూర్తం ఖరారైంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎండీ ద్వారకా తిరుమలరావు తదితరులు హాజరుకానున్నారు.

**ఏమేం ఉంటాయంటే..**

అలిపిరి డిపోకు సమీపంలో ఉన్న ఆర్టీసీ స్థలంలో దీన్ని అన్ని హంగులతో నిర్మించారు. కింది అంతస్తులో పార్కింగ్, మొదటి అంతస్తులో డిస్పెన్సరీ. రెండు, మూడు అంతస్తుల్లో.. అతిథిగృహం విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు, రోగుల కోసం ప్రత్యేక లిఫ్ట్.

50 మందికి పైగా వేచి ఉండేందుకు అన్ని సౌకర్యాలతో కూడిన హాల్ ఫార్మసీ, ఓపీ కేంద్రం. ఇద్దరు వైద్యులకు వేర్వేరుగా గదులు.

నిర్మించింది: కపిలతీర్థం-అలిపిరి మార్గంలో..

విస్తీర్ణం: 1.3 ఎకరాలలో.. జీ౩ భవనం

వ్యయం: రూ.3.89 కోట్లు

# ఆర్థిక సంక్షోభం.. చేయూత అవసరం

పెడన : జిల్లాలో చేనేత సహకార సొసైటీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎనిమిదేళ్లుగా ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సిన నిధులు నిలిచి ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అప్పులు చేసి కొంత కాలం నడిపినా వాటికి వడ్డీలు చెల్లించలేక సొసైటీల్లో ఉత్పత్తిని నిలిపివేశారు. అక్కడక్కడ ఉన్నా సొసైటీ నిర్వహణకు కూడా ఆదాయం రాని పరిస్థితి నెలకొంది.

**ప్రోత్సాహం కొరవడింది**

జిల్లాలో 36 చేనేత సహకార సంఘాలు గతంలో ఒక వెలుగు వెలిగాయి. పెడన, కప్పలదొడ్డి, పోలవరం, మల్లవోలు తదితర ప్రాంతాల్లోనివి వస్త్రాల నాణ్యతలో రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందాయి. 80వ నంబరు చీరలకు ఆప్కోతో పాటు ప్రైవేటు షోరూంల్లోనూ ఆదరణ ఉండేది. కొన్నేళ్లుగా చేనేత సంఘాలకు ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడింది. వైకాపా హయాంలో సంఘాలు పూర్తిగా నిర్వీర్యమయ్యా



యి. ప్రత్యేక రిబేటు కింద 20- 30 శాతం తగ్గించి విక్రయాలు చేసుకోవాలని, ఆ మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందని అప్పట్లో ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు రూ.14.25 కోట్ల బకాయిలు విడుదల కాలేదు. పావలా వడ్డీ, థ్రిఫ్ట్ ఫండ్, యార్న్ సబ్సిడీ, మార్కెటింగ్ ఇన్‌సెంటీవ్, 2018 వరకు రుణమాఫీ ఇలా మొత్తం రూ.47.15 కోట్ల వరకు చేరుకున్నాయి.

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం**

జిల్లాలో అత్యధికంగా పెడనలో చేనేత సొసైటీలు ఉన్నాయి. వీటిని గత ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. కూటమి సర్కారు దశల వారీగా అన్ని బకాయిలను చెల్లిస్తుంది. ఇప్పటికే చేనేత మంత్రి దృష్టికి సమస్యను తీసుకువెళ్లాం. త్వరలో పరిష్కారమవుతుంది.కాగిత కృష్ణ ప్రసాద్, పెడన ఎమ్మెల్యే

**ఉపాధి లేక వలసలు**

సొసైటీలు ఉపాధి కల్పించ లేని దుస్థితికి చేరడంతో కార్మికులు వలసలు వెళ్తున్నారు. కొంతమంది మాస్టర్ వీవర్ల వద్ద మంగళగిరి పట్టు చీరల ఉత్పత్తి వైపు మళ్లారు. జిల్లా మొత్తం మీద గతంలో దాదాపు 3 వేల మగ్గాలు సహకార రంగంలో ఉండగా ప్రస్తుతం 300 కూడా లేని పరిస్థితి ఏర్పడింది. కొన్ని సొసైటీలు కార్మికులకు వేతనాలు నిలిపివేశాయి. మొత్తం మీద చేనేత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సొసైటీలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక చేనేత మంత్రి సవిత పెడనలో పర్యటించి సొసైటీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. త్వరలో బకాయిల విడుదలకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

# ఆర్డరిస్తే చాలు... ఇంటికే కూరలు

అమరావతి : డబ్బావాలాలు.. ఈ మాట వినగానే గుర్తొచ్చేది ముంబైనే. మన గుంటూరులోనూ ఈ డబ్బావాలా సంస్కృతి విస్తరిస్తోంది. కానీ కాస్త భిన్నంగా. ఉద్యోగుల ఇళ్లకు వెళ్లి డబ్బాలను సేకరించడం కాకుండా... ఆహార పదార్థాలను వండి డబ్బాల్లో నింపి వినియోగదారుల ఇళ్లకు చేరవేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి కృష్ణ బదిలీపై ఇటీవలే గుంటూరుకు వచ్చారు. కుటుంబాన్ని తీసుకొచ్చే అవకాశం లేకపోవడంతో భోజనానికి ఇబ్బందిగా ఉంది. వంటకు సమయం సరిపోవడం లేదు. హోటళ్లు, కర్రీ పాయింట్ల నుంచి తెచ్చుకుందామంటే నాణ్యత ఎలా ఉంటుందోనన్న సందేహం. ఓ స్నేహితుడి సలహాతో హోం మేడ్ కర్రీస్ క్యారియర్స్ నిర్వాహకులను సంప్రదించి రోజూ ఆఫీసుకెళ్లే సమయానికి కూరలు వచ్చేలా ఏర్పాటు చేసుకున్నారు. ఏటీ అగ్రహారం ప్రాంతానికి చెందిన అవినాశ్ సతీమణికి ఆరోగ్యం సరిగా లేక వంట చేయలేని పరిస్థితి. తెలిసినవారి సలహా మేరకు కర్రీస్ క్యారియర్స్‌ను ఎంచుకున్నారు. ఉదయం 8 గంటలకల్లా కావాలని చెప్పడంతో తన సమస్య పరిష్కారమైంది.

**ఈ విధానం ఎలా అంటే...**

కొన్ని కుటుంబాలు.. వినియోగదారుల అభిరుచులకు తగ్గట్టుగా నాణ్యతతో ఇళ్లల్లోనే కూరలు తయారు చేస్తున్నాయి. వారు కోరుకున్న ఐటమ్స్, కోరుకున్న సమయానికి ఇంటి వద్దకే తెచ్చివ్వడం ఇందులోని ప్రత్యేకత. ఇలాంటి కుటుంబాలు కొవిడ్‌కు ముందు పదివరకే ఉ



ండగా... ఇప్పుడు 70కిపైగా సంస్థలొచ్చాయి. ఒక్కో సంస్థ పరిధిలో వంద నుంచి రెండొందలమంది వినియోగదారులున్నారు.

**ఏం కావాలో చెప్పొచ్చు..**

పప్పు, సాంబారు, రసం, పచ్చడి, తాళింపు, పెరుగుపచ్చడి... ఇలా నచ్చినవి ఎంచుకోవచ్చు. ఎన్ని ఐటమ్స్ ఎంతమందికి కావాలన్నదాన్ని బట్టి ధరలుంటాయి.నాలుగు రకాల కూరలు కావాలంటే ఒకరికి రూ.70 వసూలు చేస్తున్నారు.రూ.70, రూ.140, రూ.210, రూ.280... ఇలా ప్యాకేజీలుగా విభజించారు. పండగలు, ప్రత్యేక సందర్భాల్లో బూరెలు, బూందీ వంటివి ఉచితంగా ఇస్తుంటారు.

**వాటికీ, వీటికీ తేడా అదే..**

స్విగ్గీ, జొమాటో ద్వారా నచ్చిన హోటళ్ల నుంచి ఆహారం రప్పించుకుంటుంటాం. కర్రీస్ క్యారియర్స్ సంస్కృతిలో మాత్రం తయారీ, తరలింపు అంతా సంబంధిత వ్యక్తులే చూసుకుంటారు. ఆర్డర్లు గణనీయంగా పెరుగుతున్నాయని కర్రీస్ క్యారియర్స్ నిర్వాహకులు విజేత, రాజేష్ తదితరులకు తెలిపారు.

## చూపులతోనే హృదయాలు దోచుకుంటున్న అనుపమ!

అనుపమ పరమేశ్వరన్ ఈ మధ్యకాలంలో ఏం చేసినా అది సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గానే నిలుస్తోంది. టిల్లు స్క్వేర్ మూవీతో తన రూట్ మార్చిన ఈ ముద్దుగుమ్మ వరుస ఫోటోషూట్స్, వరుస సినిమాలతో ఊపు మీద ఉంది.అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ తాజాగా తన ఇన్స్టా ఫోటోలతో మరోసారి స్పెషల్ మీడియాలో హైలెట్ గా నిలిచింది. తాజాగా ఎల్లో కలర్ క్రాప్ టాప్ లో ఉన్న ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇందులో గోల్డెన్ కలర్ టాప్ ఎల్లో కలర్ బాటమ్ తో ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. స్లీవ్ లెస్ గోల్డెన్ కలర్ టాప్ లో తళుక్కుమని మెరిసిపోతుంది.. అంతేకాదు చెవులకు పెద్ద చెవి దుద్దులను పెట్టి తన లుక్ లో చెవి దుద్దులనే హైలెట్ చేసింది. రింగుల జుట్టుతో మత్తెక్కించే కళ్ళతో ఉన్న ఈ ఫోటోలు సోషల్ మీడియాని షేక్ చేస్తున్నాయి. ఈ హాట్ ఫోటోలను చూస్తే ఎవరైనా సరే అనుపమ అందానికి ఫిదా అవ్వాల్సిందే. అలా ఫోటోలతో కుర్రకారు గుండెల్లో మంట పెట్టిన అనుపమ పరమేశ్వరన్ ఇలాంటి ఫోటోల వల్లే సోషల్ మీడియాలో మరింత ఫేమస్ అవుతుంది. ముఖ్యంగా ఈ హీరోయిన్ ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో సాంప్రదాయమైన లుక్ తో అందరినీ కట్టిపడేసింది. కానీ రాను రాను అందరిలాగే ఈ హీరోయిన్ కూడా



తయారైంది అనేలా కొన్ని విమర్శలు ఎదుర్కొంది. ఎందుకంటే సినిమాల్లోకి వచ్చినా కొత్తలో అనుపమ పరమేశ్వరన్ ఒక్క సినిమాలో కూడా బోల్డ్ పాత్రలో నటించలేదు. పొట్టి బట్టలు వేసుకోలేదు. కానీ రౌడీ బాయ్స్ సినిమాతో రూట్ మార్చేసింది. ఈ సినిమాలో కాస్త బోల్డ్ గా నటించడంతోపాటు రొమాంటిక్ సన్నివేశాల్లో రెచ్చిపోయి నటించింది. దాంతో ఈ హీరోయిన్ ని ఇలాంటి పాత్రలో కూడా తీసుకోవచ్చని దర్శక నిర్మాతలకు ఓ క్లారిటీ వచ్చింది. డీజే టిల్లు సినిమాకి సీక్వెల్ గా వచ్చిన టిల్లు స్క్వేర్ సినిమాలో మాత్రం పూర్తి బోల్డ్ గా కనిపించింది. పొట్టి పొట్టి బట్టలు వేయడంతో పాటు లిప్ లాక్ లతో రెచ్చిపోయి అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఎందుకంటే అప్పటివరకు ఈ హీరోయిన్ ని అభిమానించిన అభిమానులు కూడా ఇదేంటి ఈ హీరోయిన్ ఇలా మారిపోయింది అని నోరెళ్లబెట్టి టిల్లు స్క్వేర్ సినిమాలో ఆమె పర్ఫామెన్స్ ను చూసి షాక్ అయిపోయారు. అయితే అలాంటి అనుపమ పరమేశ్వరన్ టిల్లు స్క్వేర్ సినిమా తర్వాత బోల్డ్ పాత్రలకు కూడా ఓకే చెప్పి మరిన్ని అవకాశాలు అందుకుంటుంది.అలా ఈ హీరోయిన్ టిల్లు స్క్వేర్ మూవీ తర్వాత పరదా అనే లేడీ ఓరియంటెడ్ మూవీ తో వచ్చింది. పరదా అనే డిఫరెంట్ కాన్సెప్ట్ ఉన్న మూవీని ఎంచుకొని సమాజంలో ఆడవాళ్ళు ఎదుర్కొనే ఇబ్బందుల గురించి ఈ సినిమాలో చూపించగా.. అందులో అద్భుతంగా నటించింది. కానీ ఈ సినిమా పెద్దగా విజయం సాధించలేదు. ఆ తర్వాత వెంటనే బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తో కిష్కింధపురి అనే మూవీ తో వచ్చి దెయ్యం పాత్రలో అందర్నీ భయపెట్టేసింది. అలా వరుస సినిమాలు చేస్తూ సౌత్ ఇండస్ట్రీలో బిజీ బిజీగా ఉంటున్న ఈ హీరోయిన్ చేతిలో ప్రస్తుతం ఎల్ క్లాసికో,ది పెట్ డిటెక్టివ్ అనే మలయాళ సినిమాలతో పాటు తెలుగులో భోగి, తమిళంలో బైసన్ అనే సినిమాలు ఉన్నాయి.

## అంతా కోల్పోయినా ఇంకా ఆశతో తూనీగ రియా చక్రవర్తి

బాలీవుడ్ ట్యాలెంటెడ్ హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణంతో ముడిపడిన అన్ని కేసుల నుంచి రియా చక్రవర్తి, ఆమె కుటుంబం బయటపడిన సంగతి తెలిసిందే. సుశాంత్ సింగ్ మరణానంతరం నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ), ఈడీ, సిట్ సహా పలు దర్యాప్తు సంస్థలు అప్పటి ప్రియురాలు రియా చక్రవర్తి, ఆమె సోదరుడు సోవిక్ చక్రవర్తిని అరెస్ట్ చేసి విచారించాయి. కానీ అన్ని కేసుల నుంచి రియా చక్రవర్తి, ఆమె సోదరుడు నిరపరాధులుగా బయటపడ్డారు. మీడియాలో చాలా కథనాలు రియా చక్రవర్తిని దోషిగా ప్రకటించగా, దానిపై ఇప్పటికీ రియా సెటైర్లు వేస్తూనే ఉంది. ఒక నేరంపై విచారణ తేలక ముందే సోషల్ మీడియాలు రియా చక్రవర్తిని అపరాధిని చేసాయి. అయితే ఈ కేసులో నాలుగేళ్ల పోరాటం ఫలించి చివరికి నిరపరాధిగా నిరూపించుకుని రియా బయటపడింది. అయితే



రియా చక్రవర్తి అన్ని కేసుల నుంచి బయటపడిన తర్వాత కూడా తన వద్ద నుంచి లాక్కున్న పాస్ పోర్ట్ ని తిరిగి ఇవ్వకపోవడం ఆశ్చర్యపరిచింది. ఎట్టకేలకు సంబంధిత అధికారుల నుంచి క్లియరెన్స్ వచ్చింది. రియా చక్రవర్తి చేతికి పాస్ పోర్ట్ అందిందని తెలుస్తోంది. ఇకపై రియా స్వేచ్ఛగా తూనీగలా విదేశాలకు కూడా ఎగిరిపోవచ్చు. అన్ని బంధనాలను తెంచుకుని తాను ఇప్పుడు స్వేచ్ఛగా ఉన్నానని రియా ఆనందం వ్యక్తం చేసింది. ఐదు సంవత్సరాలు ఎంతో ఓపిగ్గా ఉన్నాను. ఓపిక నా నిజమైన పాస్ పోర్ట్ అని రియా చక్రవర్తి వ్యాఖ్యానించింది. ఐదేళ్ల క్రితం రియా చక్రవర్తి నటించిన చిత్రం చెహ్రే. ప్రస్తుతం రియా తదుపరి ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తున్నారు. ఆమె తన కెరీర్‌ను తిరిగి ప్రారంభించడానికి ఉత్సాహంగా వేచి చూస్తోంది.అయితే నిరపరాధి అని నిరూపించుకున్న తర్వాత కూడా దర్శకనిర్మాతలు ఈ భామకు అవకాశాలివ్వడానికి సిద్ధంగా ఉన్నారా? అంటే ఈ ప్రశ్నకు ఇంకా సమాధానం లేదు. అంతా కోల్పోయినా కానీ ఇంకా ఆశతో ఉన్నానని రియా చక్రవర్తి చెబుతోంది. ఈ భామ ఎం.ఎస్.రాజు దర్శకత్వం వహించిన తూనీగ తూనీగ చిత్రంలో నటించిన సంగతి తెలిసిందే.




## సినిమా ఉన్నా లేకున్నా... మహేష్ సీక్రెట్ ఇదేనట!



సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో 'వారణాసి' సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. ఇటీవల జరిగిన గ్లోబ్‌ట్రోటర్ ఈవెంట్ లో మహేష్ బాబు లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహేష్ బాబు ఎప్పుడు బయట కనిపించినా, మీడియాలో కనిపించినా అభిమానులతో పాటు అందరూ సర్‌ప్రైజ్ అవుతారు. మహేష్ బాబు వయసు చెబితే చాలా మంది ఆశ్చర్యపోతారు. ఆయన అయిదు పదుల వయసు దాటిన ఇప్పటి మూడు పదుల వయసు ముందు ఉన్నట్లుగానే అనిపిస్తూ ఉంటాడు. ఆయన లుక్ పరంగా చాలా జాగ్రత్తలు తీసుకుంటారు అని అంటారు. కానీ ఆయన ఫిజిక్ పరంగా ఎక్కువ జాగ్రత్తలు తీసుకుంటారు అని ఆయన పర్సనల్ ఫిట్‌నెస్ కోచ్ కుమార్ మన్నావా అంటున్నారు. ఆయన ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మహేష్ బాబు గురించి చెప్పిన విషయాలు వైరల్ అవుతున్నాయి.

**వారణాసి ఈవెంట్‌లో మహేష్ బాబు లుక్...** వారణాసి ఈవెంట్‌లో మహేష్ బాబును చూసిన చాలా మంది ఖచ్చితంగా నోరు వెళ్లబెట్టి ఉంటారు. గుంటూరు కారం తర్వాత మహేష్ బాబు పెద్దగా బయట కనిపించలేదు. దాదాపు రెండేళ్ల తర్వాత మహేష్ బాబును ఒక ఫుల్ ఈవెంట్‌లో చూడటంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. కాస్త ఎక్కువ గ్యాప్ రావడం వల్లనో లేదంటే మహేష్ బాబు లుక్ మారిందో కానీ ఆయన మరింత ఆకర్షణీయంగా తయారు అయ్యాడు అంటూ అభిమానులతో పాటు అంతా కూడా తెగ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో వారణాసి ఈవెంట్‌లో మహేష్ బాబు లుక్ గురించి తెగ చర్చ జరిగింది. ఆయన ఆయన ధరించిన ఔట్ ఫిట్ మొదలుకుని, హెయిర్ స్టైల్, వాకింగ్ స్టైల్ వరకు అన్ని విషయాల గురించి ప్రముఖంగా చర్చ జరిగింది. ఇలాంటి సమయంలో కుమార్ మన్నావా ఇంటర్వ్యూ మరింతగా చర్చనీయాంశం అయింది.

**ఫిజికల్ ఫిట్‌నెస్ విషయంలో మహేష్ బాబు తర్వాతే...** మహేష్ ఫిట్‌నెస్ రహస్యం గురించి కుమార్ మన్నావా మాట్లాడుతూ... మహేష్ బాబు ఒక సినిమాలోని పాత్ర కోసం లేదా, ఏదైనా సినిమాలోని యాక్షన్ సీన్స్ కోసం ఫిజికల్ ఫిట్ నెస్ సాధించాలి అనుకోరు. ఆయన సినిమాలు ఉన్నా లేకున్నా, షూటింగ్ ఉన్నా లేకున్నా, నెలల తరబడి కెమెరాకు దూరంగా ఉండాల్సి ఉన్నప్పటికీ వర్కౌట్స్ మాత్రం ఆపరు. దేశంలో ఉన్నా, విదేశాల్లో ఉన్నా, షూటింగ్ లో ఉన్న, హాలీడేస్ లో ఉన్నా ఏడాదిలో 365 రోజులు ఆయన ఏదో ఒక సమయంలో వర్కౌట్స్ చేయడం జరుగుతూనే ఉంటుంది. ఆయన ప్రతి రోజు వర్కౌట్స్ చేయడం ఒక ఎత్తు అయితే, ఎలాంటి పరిస్థితుల్లో అయినా ఆయన తినాలి అనుకున్నవి మాత్రమే తింటాడు, ఆయన దూరంగా ఉంచాలి అనుకున్న ఫుడ్ ను ఎట్టి పరిస్థితుల్లో ముట్టుకోరు. అందుకే ఆయన ఇప్పటికీ చాలా యంగ్ గా, ఫిజిక్ పరంగా కుర్రాడిలా ఉంటాడు అన్నట్లుగా చెప్పుకొచ్చాడు.

**రాజమౌళి దర్శకత్వంలో వారణాసి...** టాలీవుడ్ జక్కన్న రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా సినిమా పదేళ్ల క్రితమే రావాల్సి ఉన్నా ఇద్దరి కమిట్‌మెంట్స్ వల్ల, సరైన కథ సెట్ కాకపోవడం వల్ల ఆలస్యం అవుతూ వచ్చింది. ఎట్టకేలకు ఇప్పుడు వీరి కాంబో సెట్ అయింది. రాజమౌళికి పాన్ ఇండియా రేంజ్ లోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించింది. ఆయన ఆర్‌ఆర్‌ఆర్ సినిమా ఏకంగా ఆస్కార్ వరకు వెళ్లింది. అంతే కాకుండా విదేశాల్లో జక్కన్న దర్శకత్వంలో వచ్చిన బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలు ఇంకా ఇతర సినిమాలు విడుదల అయ్యి మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. అందుకే జక్కన్న దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా వారణాసి సినిమా ఏ స్థాయికి వెళ్లి ఆగుతుందో ఏ ఒక్కరూ కనీసం ఊహించను కూడా ఊహించలేక పోతున్నారు. వెయ్యి కోట్లు, రెండు వేల కోట్లు అని కాకుండా మరో రేంజ్ లో ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు.

కచ్చితంగా అభిమానుల అంచనాలను జక్కన్న అందుకుంటాడు అనడంలో ఎలాంటి సందేహం లేదు.

## పార్ట్ -3 లో మోస్ట్ వాంటెడ్ చిత్రాలివే!



ఫ్రాంచైజీలు, సినిమాటిక్ యూనివర్శ్ లు, సీక్వెల్స్ అంటూ సౌత్ ఇండస్ట్రీలో ఒకటే జోరు కనిపిస్తోంది. ఫ్రాంచైజీల విషయంలో బాలీవుడ్ నే మించిపోయేలా కనిపిస్తోంది టాలీవుడ్. వరుస విజయాలతో ఫ్రాంచైజీలతో అంతకంతకు హైప్ తీసుకు రావడం సౌత్ కే చెల్లిందా? అనిపిస్తుంది. అలాంటి ఫ్రాంచైజీస్ లో మోస్ట్ వాంటెడ్ గా మారిన మూడు ఫ్రాంచైజీలు ఇవి. పుష్ప, కాంతార, కేజీఎఫ్, కార్తికేయ. పుష్ప నుంచి ఇప్పటికే ది రైజ్ ..ది రూల్ అంటూ రెండు భాగాలు రిలీజ్ అయి పాన్ ఇండియాలో ఎలాంటి సంచలనాలు నమోదు చేసాయో చెప్పాల్సిన పనిలేదు.

**హిట్ ఫ్రాంచైజీల నుంచి పార్ట్ -3...** ఇప్పుడిదే ఫ్రాంచైజీ నుంచి పుష్ప3 ని కూడా దర్శకుడు సుకుమార్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అదెప్పుడు ఉంటుందో తెలియదు కానీ కచ్చితంగా ఉంటుందని మాత్రం వెల్లడించారు. అలాగే కన్నడ నుంచి రిలీజ్ అయిన కేజీఎఫ్ రెండు భాగాలు పాన్ ఇండియాలో అంతే సంచలనమయ్యాయి. ఈ నేపథ్యంలో కేజీఎఫ్ 3 కూడా ఉం టుందని దర్శకుడు ప్రశాంత్ నీల్ ప్రకటించాడు. అదెప్పుడు పట్టాలెక్కిస్తారు అన్నది మాత్రం క్లారిటీ లేదు. కానీ ఈసారి మాత్రం సీ బ్యాక్ డ్రాప్ లో కథ సాగుతుందన్నది వాస్తవం. అలాగే కార్తికేయ 2తో దర్శకుడు చందు మొండేటి పాన్ ఇండియా వరల్డ్ లోకి అడుగు పెట్టిన సంగతి తెలిసిందే.

**కొత్త అప్ డేట్స్ పై అప్పుడే ఆసక్తి:** ఎలాంటి అంచనాలు లేకుండా రిలీజ్ అయిన సినిమా హిందుత్వం కాన్సెప్ట్ తో పాన్ ఇండియాకి కనెక్ట్ అయింది. దీంతో కార్తికేయ 3ని ఏకంగా గ్లోబల్ రేంజ్ రీచ్ ఉండేలా చేస్తారనే ప్రకటన వచ్చేసింది. కానీ ఆ ప్రాజెక్ట్ ఎప్పుడు మొదలవుతుంది? అన్నది సరైన క్లారిటీ లేదు.

ఖాళీ సమయంలో చందు మొండేటి ఆ స్క్రిప్ట్ వర్క్ లో బిజీ అవు తున్నాడు. అలాగే మరో కన్నడ ఫ్రాంచైజీ కాంతార ఎంత పెద్ద సక్సెస్ అయిందో చెప్పాల్సిన పనిలేదు. ఎలాంటి అంచనాలు లేకుండా రిలీజ్ అయిన కాంతార అనూహ్య విజయం అనంతరం రీసెంట్ రిలీజ్ కాంతార చాప్టర్ వన్ ఏ రేంజ్లో హిట్ అయిందో తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంతార చాప్టర్ -2ని కూడా ప్రకటించారు.

అయితే ఈ నాలుగు చిత్రాల నుంచి రిలీజ్ అయ్యేది పార్ట్ 3 భాగాలు కావడం విశేషం. పాన్ ఇండియాలో ఈ మూడవ భాగంపై అంచనాలు భారీగా ఉన్నాయి.

ఎలాంటి కథతో వస్తారు? అందులో పాత్రలు ఎలా ఉండ బోత్తున్నాయి? అన్న ఆసక్తి ఇప్పటి నుంచే మొదలైంది.వీటిపై అప్ డేట్స్ రావడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది.

## బ్లాక్ అవుట్ ఫిట్ లో మరింత అందంగా!

మృణాల్ ఠాకూర్.. ప్రముఖ డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నటించిన పూర్తి స్థాయి తొలి తెలుగు చిత్రం 'సీతారామం'. ఈ సినిమా కంటే ముందు మహానటి సావిత్రి బయోపిక్ ఆధారంగా వచ్చిన 'మహానటి' సినిమాలో జెమినీ గణేషన్ పాత్ర పోషించిన ఈయన.. ఆ తర్వాత సీతారామం సినిమాతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సినిమా ద్వారానే తెలుగు ప్రేక్షకులను పలకరించింది మృణాల్ ఠాకూర్. ఇందులో సాంప్రదాయంగా చీరకట్టులో కనిపించి, సీత పాత్రతో అందరి హృదయాలను దోచుకుంది. ఇందులో ఆమె చీరకట్టు బొట్టు అభిమానులను ఆకట్టుకోవడమే కాకుండా తెలుగు సినీ ప్రేక్షకులు కూడా ఈమెను సొంత అమ్మాయిగా ఓన్ చేసేసుకున్నారు. అంతేకాదు



పలు చిత్రాలలో అవకాశాలు ఇవ్వాలని అభిమానులు కూడా డిమాండ్ చేసిన విషయం తెలిసిందే.అలా సీతారామం విజయం సాధించడంతో నాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన 'హాయ్ నాన్న' సినిమాలో జోష్ణ పాత్రతో మరొకసారి పలకరించింది. ఈ సినిమాతో కూడా మంచి విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ తో కలిసి 'ది ఫ్యామిలీ స్టార్' సినిమా చేసింది. కానీ ఈ సినిమా పెద్దగా విజయాన్ని అందించలేదు. ఇప్పుడు అడివి శేష్ హీరోగా నటిస్తున్న డెకాయిట్ సినిమా నుండి శృతిహాసన్ తప్పుకోవడంతో ఆ స్థానాన్ని భర్తీ చేసిన మృణాల్ త్వరలోనే ఈ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇదిలా ఉండగా తాజాగా ఈ ముద్దుగుమ్మ ఇంస్టాగ్రామ్ ద్వారా షేర్ చేసిన కొన్ని ఫోటోలు అభిమానులను, ఫాలోవర్స్ ను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి .

అందులో బ్లాక్ ఔట్ఫిట్ లో కనిపించిన ఈమె తన అందంతో అబ్బురపరిచింది. విషయంలోకి వెళ్తే.. ముంబైలోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ లో జరి గిన బ్వ్లగారి సెర్పెంటి ఇన్ఫినిటీ ఎగ్జిబిషన్ కి టాలీవుడ్ బాలీవుడ్ అని తేడా లేకుండా చాలామంది నటీమణులు తమ ఫ్యాషన్స్ సెన్స్ తో సందడి చేశారు. అందులో భాగంగానే హీరోయిన్ మృణాల్ ఠాకూర్ కూడా హాజరయ్యింది.ఇందులో మృణాల్ ఠాకూర్ ఎగ్జిబిషన్లో లీనమై ఆర్ట్ ఇన్స్టాలేషన్ మధ్య అద్భుతమైన నల్లటి ఔట్ఫిట్ లో ఫోటోలకు ఫోజులిచ్చింది.

## రుక్మిణికి ఆ హీరో లవ్ స్టోరీస్ ఇష్టమట..!

కన్నడ భామ రుక్మిణి వసంత్ ప్రస్తుతం సోషల్ మీడియా ట్రెండింగ్ లో ఉంటుంది. సప్త సాగరాలు దాటి సినిమాతో సౌత్ ఆడియన్స్ మనసులు గెలిచిన ఈ అమ్మడు రీసెంట్ గా రిలీజైన కాంతారా చాప్టర్ 1 లో అదరగొట్టేసింది.

సినిమాలో కనకావతి రోల్ లో రుక్మిణి తనకు వచ్చిన అవకాశాన్ని పర్ఫెక్ట్ గా యూజ్ చేసుకుంది. కాంతారా 1 తో అమ్మడు మరింత క్రేజ్ సంపాదించుకుంది. సినిమాలో ఆమె క్లిప్స్ ని సోషల్ మీడియాలో తెగ వైరల్ చేస్తున్నారు రుక్మిణి వసంత్ ఫ్యాన్స్.

**ఎన్టీఆర్ డ్రాగన్ లో రుక్మిణి..** స్టార్ హీరోయిన్ క్వాలిటీస్ అన్నీ ఉన్న రుక్మిణి తెలుగులో నిఖిల్ తో అప్పుడో ఇప్పుడో ఎప్పుడో సినిమా చేసింది. నెక్స్ట్ ఎన్టీఆర్ డ్రాగన్ లో అమ్మడు నటిస్తుంది. రుక్మిణి ఇప్పటికే తమిళంలో వరుస సినిమాలు చేస్తుంది. విజయ్ సేతుపతితో ఏస్,



శివ కార్తికేయన్ తో మదరాసి సినిమాల్లో నటించింది అమ్మడు. ఐతే రుక్మిణి తన ఇంటర్వ్యూస్ లో ఎప్పుడు తనకు ఇష్టమైన హీరో ఎవరంటే ఆమె తమిళ స్టార్ సూర్య పేరు చెబుతూ వచ్చింది. సూర్య సార్ అంటే చాలా ఇష్టం. ఆయన చేసిన లవ్ స్టోరీస్ చాలా ఇష్టమంటుంది అమ్మడు. రుక్మిణి అలా చెబుతున్న క్లిప్స్ ని సూర్య ఫ్యాన్స్ తెగ వైరల్ చేస్తున్నారు. ఎలాగు అమ్మడికి మంచి ఫాలోయిన్ వచ్చింది కాబట్టి ఆమెకు ఇష్టమైన హీరో సూర్యతో జత కట్టే ఛాన్స్ ఇస్తే బెటర్ అని అంటున్నారు. రుక్మిణి వసంత్ కూడా సూర్య తో నటించే అవకాశం కోసం ఎదురుచూస్తున్నట్టు ఉంది.

**ఆడియన్స్ అంతా ఆమె మాయలో..** ఇక తెలుగులో రుక్మిణికి చరణ్ అంటే ఇష్టమని చెప్పింది. సో ఇటు ఎన్ టీ ఆర్ తర్వాత అమ్మడు చరణ్ తో కూడా నటించే ఛాన్స్ లు ఉన్నాయి. ఏది ఏమైనా రుక్మిణి వసంత్ ప్రస్తుతం నేషనల్ ఆడియన్స్ అంతా తన మాయలో పడి ఊగిపోతున్నారు. తప్పకుండా అమ్మడికి ఇంకా చాలా మంది అవకాశాలు వచ్చి పాన్ ఇండియా లెవెల్ లో అద్భుతాలు చేసేలా ఉందని చెప్పొచ్చు. కాంతారా 1లో తన రోల్ కి పూర్తిస్థాయిలో న్యాయం చేసిన రుక్మిణి కోసం మరిన్ని ఛాలెంజింగ్ రోల్స్ రాసేందుకు అవకాశం ఇస్తుంది. అంతేకాదు లవ్ స్టోరీస్, కమర్షియల్ సినిమాల్లో నటించడం కూడా ఇష్టమని అంటుంది అమ్మడు. సౌత్ నుంచి నేషనల్ క్రష్ గా మారింది కన్నడ భామ రష్మిక మందన్న. ఐతే ప్రస్తుతం ఆమె వరుస సినిమాలతో బిజీ అయ్యింది. ఐతే రష్మిక తర్వాత నేషనల్ క్రష్ ట్యాగ్ ని రుక్మిణికి ఇచ్చేయాలని కొత్త నేషనల్ క్రష్ రుక్మిణి వసంత్ అని సోషల్ మీడియాలో ఒకటే హడావిడి జరుగుతుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536